బుధవారం
2•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 56
• పేజీలు : 16 + 24 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఎస్సారెస్పీకి పునర్జీవం



రెండువేల కోట్లతో పథకం.. ఇప్పటికే రూ.వేయి కోట్లు విడుదల: మంత్రి హరీశ్

ఈ నెల 10న పనులకు పోచంపాడులో సీఎం శంకుస్థాపన ■ అనంతరం భారీ బహిరంగసభ

వ్యవసాయ పెట్టుబడి, సమాఖ్యలపై రైతులతో చర్చించనున్న ముఖ్యమంత్రి

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పూర్వవైభవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. రూ.2వేల కోట్లతో ఎస్సారెస్పీ పునర్జీవ పథకాన్ని చేపట్టింది. ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు పోచంపాడు దగ్గర ఎస్సారెస్పీ పునర్జీవ పనులకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అక్కడ భారీ బహిరంగసభ ఏర్పాటుచేశారు. తమ జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొచ్చేలా ప్రాజెక్టుకు జీవం పోయనున్న నేపథ్యంలో ఏర్పాటుచేస్తున్న ఈ బహిరంగసభకు దాదాపు ఐదు లక్షల మంది రైతులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా పాత నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని భావిస్తున్నారు. వీరితోపాటు నల్లగొండ జిల్లా సహా ఎస్సారెస్పీ ఆయకట్టు కింద ఉన్న రైతులంతా పాల్గొననున్నారు. రైతులకు ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.4వేల పెట్టుబడి ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. పెట్టుబడి పథకం, రైతు సమాఖ్యల ఏర్పాటు తదితర అంశాలపై సీఎం కేసీఆర్ నేరుగా రైతులతో చర్చించనున్నారు. ఈ మేరకు సభ నిర్వహణపై మంగళవారం పలువురు మంత్రులతో సీఎం కేసీఆర్ మాట్లాడినట్టు సమాచారం. బహిరంగసభ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు,



మిగతా 2వ పేజీలో

రెండేండ్లలో పూర్తిస్థాయిలో
కేజీ టు పీజీ

- నాణ్యమైన విద్యకు రాష్ట్రంలో బలమైన పునాది
- మూడేండ్లలోనే 489 గురుకుల పాఠశాలలు
- ఈ ఏడాది 2.78 లక్షలమందికి కార్పొరేట్ స్థాయి విద్య
- ఏటా రెండువేల కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



తెలంగాణ ఉద్యమ స్వప్నం కేజీ టు పీజీ (కిండర్ గార్టన్ టు పోస్టు గ్రాడ్యుయేషన్) విద్యాపథకం అమలుకు కార్యాచరణ మొదలైంది. ప్రభుత్వం గత రెండేండ్లుగా ఇందుకోసం బలమైన పునాదులు వేసింది. ఇప్పటిదాకా 489 గురుకుల పాఠశాలలు, 31 డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలను ప్రారంభించింది. ఈ ఏడాది పాఠశాలల్లో 5,6,7 తరగతులకు, డిగ్రీ గురుకులాల్లో ఫస్టియర్‌కు అడ్మిషన్లు నిర్వహించింది. 2,68,955 విద్యార్థులకు అవకాశం లభించింది. ఇకపై ఏటా పాఠశాలలు కళాశాలల సంఖ్యతోపాటు తరగతుల అప్‌గ్రెడేషన్ జరుపుతూ ముందుకు వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల వచ్చే రెండేండ్లలో కేజీ టు పీజీ విద్య పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో కేవలం 296 గురుకుల పాఠశాలలు మాత్రమే ఉండేవి. రాష్ట్ర అవతరణ తర్వాత రెట్టింపు సంఖ్యలో గురుకుల పాఠశాలలు ఏర్పాటయ్యాయి. వాటిలో 1,31,445 మంది విద్యార్థులు, కళాశాలల్లో 9120 మంది విద్యార్థులు చేరారు.

మానవ వనరుల అభివృద్ధి..: అరవై ఏండ్ల సమైక్యపాలనలో తెలంగాణలో మానవ వనరుల అభివృద్ధి అంశం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. విద్యాహక్కు అందని ద్రాక్ష పండులా మారింది.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులు ఉత్తమ విద్యకు దూరమయ్యారు. ఫలితంగా

మిగతా 11వ పేజీలో



మంగళవారం వరంగల్ విద్యుత్ భవన్ ముందు ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

కాంగ్రెస్‌పై కన్నెర్ర

తమ జీవితాల్లో వెలుగులు ఆర్పేస్తున్నారంటూ కరెంటోళ్ల ఆగ్రహం

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళనలు

విద్యుత్‌శాఖలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే ఆ ప్రయత్నాలకు కాంగ్రెస్ గండికొట్టేలా వ్యవహరిస్తున్న తీరుపై విద్యుత్ ఉద్యోగులు భగ్గుమన్నారు. తమ జీవితాల్లో వెలుగులను ఆర్పేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో కోర్టులో వేసిన పిటిషన్లను వాపసు తీసుకోకుంటే తీవ్ర ఉద్యమం తప్పదని హెచ్చరించారు. క్రమబద్ధీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు కోర్టుకు వెళ్లడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు జిల్లా కార్యాలయాల వద్ద మంగళవారం భారీఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ధర్నాలు, ర్యాలీలతో హోరెత్తించారు. తమ ఉద్యోగాలను సీఎం కేసీఆర్ దేవుడిలా క్రమబద్ధీకరిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. తీరు మార్చుకోకపోతే కాంగ్రెస్ నాయకుల ఇండ్లకు కరెంటు కట్ చేస్తామని హెచ్చరించారు.

14

మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో
546 పోస్టుల భర్తీకి హైకోర్టు సమ్మతి

సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసిన ద్విసభ్య ధర్మాసనం

మహిళా కాలేజీల్లో మహిళా సిబ్బంది నియామకం రాజ్యాంగ విరుద్ధం కాదని వ్యాఖ్య

2



నీతి ఆయోగ్ పదవికి పనగరియా రాజీనామా

5

కాల్పుల ఒప్పందం!

తుపాకీతో కాల్చినవాళ్లు విక్రమ్‌గౌడ్ కిరాయి మనుషులే ▪ పోలీసుల అదుపులో గ్యాంగ్‌లీడర్

షేక్‌పేట చెరువులో దొరికిన తుపాకీ ▪ కాల్పుల ఘటనపై నేడు పోలీసుల అధికారిక ప్రకటన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

విక్రమ్‌గౌడ్ ఇంట్లో కాల్పుల వ్యవహారం సస్పెన్స్ వీడి క్లైమాక్స్‌కు చేరుకుంటున్నది. మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కొడుకు విక్రమ్‌గౌడ్‌పై కాల్పులు జరిపిన ఇద్దరు వ్యక్తులు ఆయనకు తెలిసినవారేనని అర్థమవుతున్నది. విక్రమ్‌గౌడే స్వయంగా తనను కాల్చేందుకు వారిని కిరాయికి తెచ్చుకున్నాడని స్పష్టమవుతున్నది. విక్రమ్‌గౌడే కాల్చుకున్నాడా? వాళ్లే కాల్చారా? అన్న విషయాలపై బుధవారం పోలీసులు అధికారికంగా ప్రకటన చేయనున్నారు. కాల్పుల ఘటనపై ఐదురోజులపాటు 10 పోలీసు బృందాలు దర్యాప్తు జరిపి ఐదుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఏపీ, కర్ణాటకతోపాటు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఈ కాల్పుల ఘటనతో లింకు ఉండటం గమనార్హం. విక్రమ్‌గౌడ్ కాల్‌డాటా ఆధారంగా కీలక సమాచారాన్ని సేకరించిన దర్యాప్తు అధికారులు, అనంతపూరంలో ఇద్దరిని, కర్ణాటకలో ఇద్దరిని, మధ్యప్రదేశ్‌లో ముఠా నాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం



మిగతా 12వ పేజీలో

అమల్లోకి రెరా

కొనుగోలుదారులకు కొత్త అస్త్రం

ఏ ప్రాజెక్టు డబ్బు ఆ ప్రాజెక్టుకే

కార్పెట్ ఏరియా ప్రాతిపదికనే ఫ్లాట్ల విక్రయం

ఏజెంట్లకూ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్ (రెరా) నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. 2017 జనవరి 1 నుంచి రాష్ట్రంలో ప్రారంభమైన కొత్త లేఅవుట్లు, నివాస సముదాయాలకు ఈ చట్టాన్ని వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నది. దీని ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 500 చదరపు మీటర్లు లేదా అంతకంటే అధిక విస్తీర్ణంలో ఎనిమిది లేదా ఎక్కువ ఫ్లాట్లను నిర్మించే ప్రతి డెవలపర్..

మిగతా 12వ పేజీలో

తదుపరి ఎవరు?

డ్రగ్స్ కేసులో ఒత్తిళ్లను అధిగమించి సిట్ విచారణ

విస్తుబోయే వాస్తవాలు బయటకు • ముగిసిన 12 మంది విచారణ

వీడియో రికార్డింగ్‌లో అంతా నిక్షిప్తం • వాటి ఆధారంగా త్వరలో చార్జిషీట్

మరో విడుత నోటీసులపై సస్పెన్స్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పన్నెండు మంది సినీ ప్రముఖులు సహా పలువురి విచారణ ప్రక్రియను మంగళవారంతో పూర్తిచేసిన ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తదుపరి వ్యూహాలపై కసరత్తు చేస్తున్నది. అనేక ఒత్తిళ్ల నడుమ తొలి విడుత విచారణ పూర్తయిన నేపథ్యంలో మలి విడుతలో మరికొందరిని పిలుస్తారా? పిలిస్తే ఎవరెవరు నోటీసులు అందుకోబోతున్నారు? ఇప్పటివరకూ విచారణకు హాజరైనవారిని నిందితులుగా పరిగణిస్తారా? లేక సాక్షులుగా చేర్చుతారా? అనే అంశాల్లో సస్పెన్స్ కొనసాగుతున్నది. డ్రగ్స్ కేసులో 12 మంది సినీ సెలబ్రిటీలను, ఇతర రంగాలకు చెందిన 27 మందిని విచారించిన సిట్ త్వరలోనే చార్జిషీటు దాఖలుచేయనుంది. నిబంధనల ప్రకారం 90 రోజుల్లో కోర్టుకు చార్జిషీటు సమర్పించాల్సి ఉంటుంది. విచారణకు హాజరైన వారు నిందితులుగా ఉంటారా? లేక సాక్షులుగానా? అనేది చార్జిషీటు సమర్పించిన తర్వాత కానీ తేలదు.

ఆరోపణలు తట్టుకోలేకపోయా

- కెల్విన్, జీషాన్ ఎవరో తెలియదు
- నాకు డ్రగ్స్ అలవాటు లేదు
- సిట్ విచారణలో నటుడు నందు

మాదకద్రవ్యాలపై ప్రభుత్వం కఠినవైఖరి

సెలబ్రిటీల నుంచి విద్యార్థుల వరకు అన్ని వర్గాల్లోకి చాపకింద నీరులా చేరుతున్న మత్తు మందు అంతు చూసేందుకు ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకుంది. ఈ క్రమంలోనే లోతైన విచారణ కోసం ఎక్సైజ్‌శాఖ సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం)ను ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాలో అత్యంత కీలక నిందితుడు కెల్విన్ అరెస్టుతో మత్తు మాఫియా గుట్టు కొద్దికొద్దిగా బయటికి వచ్చింది. కలుగులోని ఎలుకలను బయటికి రప్పించినట్టు సిట్ అధికారులు మత్తు మాఫియాను బయటకు లాగారు. తమదైన శైలిలో

మిగతా 11వ పేజీలో



అబూ దుజానా

లష్కరే కమాండర్ ఖతం

- పుల్వామాలో అబూ దుజానాను కాల్చిచంపిన సైన్యం
- ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది హతం
- నాలుగు గంటలపాటు సాగిన ఆపరేషన్

5

లోకం పోకడ



గురుకుల డిగ్రీ లెక్చరర్ల పరీక్షపై స్టే ఎత్తివేత

సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసిన ద్విసభ్య ధర్మాసనం

మహిళా కాలేజీల్లో మహిళల నియామకం

రాజ్యాంగ విరుద్ధం కాదని వ్యాఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో 546 అధ్యాపక పోస్టుల భర్తీకి హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం మంగళవారం ఆమోదం తెలిపింది. కేవలం మహిళా అభ్యర్థులతోనే పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రాతపరీక్షలపై స్టే విధిస్తూ జూలై 17వ తేదీన సింగిల్ బెంచ్ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. వీటిపై జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ శ్యాం ప్రసాద్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సస్పెన్షన్ విధించింది. పోస్టుల భర్తీ అనేది ప్రభుత్వాల విధానపరమైన నిర్ణయమని, అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోజాలవని పేర్కొంది. సింగిల్ బెంచ్ జారీచేసిన స్టే ఉత్తర్వులను ఎత్తివేసింది. మహిళలకోసం ఏర్పాటుచేసిన రెసిడెన్షియల్ కళాశాలల్లో పోస్టులను మహిళలతోనే భర్తీచేయడం రాజ్యాంగవిరుద్ధం కాదని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తంచేసింది. అయితే పోస్టుల భర్తీ ప్రక్రియ ఈ వ్యాజ్యంపై తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టంచేసింది. మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో 546 అధ్యాపక పోస్టులను భర్తీచేయడానికి టీఎస్‌పీఎస్సీ ఈ ఏడాది జూన్ 2వ తేదీన నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పోస్టులకు మహిళా అభ్యర్థులే అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నిబంధనను సవాల్ చేస్తూ మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన వెంకటనర్సింహగౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ధర్మాసనం.. మహిళా అభ్యర్థులతోనే భర్తీకి నోటిఫికేషన్ జారీచేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. నోటిఫికేషన్ ఆధారంగా జూలై 30న నిర్వహించాల్సిన రాత పరీక్షలపై స్టే విధిస్తూ జూలై 17న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తదితరులు హైకోర్టులో అప్పీల్ దాఖలుచేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. మహిళలతోనే పోస్టులను భర్తీ చేయడాన్ని గతంలో విజయలక్ష్మి వర్సెస్ పంజాబ్ వర్సిటీ కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదంటూ కొన్ని తీర్పులను ఉటంకించారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. భర్తీ ప్రక్రియను నిలిపివేస్తూ సింగిల్ బెంచ్ జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సస్పెండ్‌చేసింది. భర్తీ ప్రక్రియ తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ప్రతివాదికి నోటీసులు జారీచేసింది.

విధివంచితులకు గురుకుల ప్రవేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన అర్బన్ గురుకుల విద్యాలయాల్లో విధివంచిత విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై జిల్లా విద్యాధికారులకు ఆ శాఖ డైరెక్టర్ జీ కిషన్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసుశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, కార్మిక ఉపాధి కల్పన శాఖ, విద్యాశాఖ ఉన్నతాధికారులతో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య మంగళవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులను గుర్తించి, వారు ప్రవేశాలు పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కులాలవారీగా విద్యార్థుల వివరాల సేకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కులాలవారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారాన్ని సేకరించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. సెప్టెంబర్ 1 నుంచి ఏకీకృత జిల్లా విద్యాసమాచార విధానం ద్వారా వివరాలు సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బీసీ కార్పొరేషన్ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో విద్యాభివృద్ధి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సమాచారం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.



విజయ డెయిరీ రాష్ట్ర చైర్మన్ భూమారెడ్డి

త్వరలో విజయ డ్రింకింగ్ వాటర్

తొర్రూరు, నమస్తే తెలంగాణ: విజయ డెయిరీ ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ఉత్పత్తులను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ లోక భూమారెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా రూ.500 కోట్ల పాలు, పాల ఉత్పత్తుల వ్యాపారాన్ని కొనసాగిస్తున్న విజయ డెయిరీ ఇకపై నీటి వ్యాపారాన్ని మొదలు పెట్టనున్నదని చెప్పారు. 15 రోజుల్లో ఐఎస్ఐ అనుమతి వస్తుందని తెలిపారు. 250 మిల్లీలీటర్ల నుంచి 20 లీటర్ల సామర్థ్యం కలిగిన బాటిళ్లు, క్యాన్లు, వాటర్ ప్యాకెట్లను విక్రయిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 15లోగా నీటి విక్రయాలను ప్రారంభిస్తామన్నారు. లీటర్‌కు రూ.5 తక్కువ ఉండేలా నాణ్యమైన నీటిని ప్రజలకు అందించేలా ప్రణాళికను సిద్ధం చేశామని ఆయన తెలిపారు.

లాలాగూడ స్థలాలు అప్పగిస్తాం

మంత్రి పద్మారావు, టీఆర్ఎస్ ఎంపీలకు రైల్వే మంత్రి సురేశ్ ప్రభు హామీ

త్వరలోనే ఉత్తర్వులు ఇస్తామని వెల్లడి

లాలాగూడ రైల్వే స్థలాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

సికింద్రాబాద్‌లోని లాలాగూడలో ఉన్న రైల్వే భూములను డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికిగాను రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్పగించేందుకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేశ్‌ప్రభు సానుకూలత వ్యక్తంచేశారు. మంగళవారం కేంద్రమంత్రిని రాష్ట్ర మంత్రి పద్మారావు, టీఆర్ఎస్ ఎంపీలు కలిసి.. లాలాగూడలోని రైల్వే స్థలాలను అప్పగించాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. రైల్వే శాఖ పరిధిలో లాలాగూడలో 12.16 ఎకరాల మేర (సర్వే నం. 34-50) ఖాళీ స్థలం ఉన్నదని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించినట్లయితే ఇందుకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని సమకూరుస్తామని కేంద్ర మంత్రికి పద్మారావు వివరించారు. ఈ విషయంలో గతంలోనే సీఎం కేసీఆర్ లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారని, టీఆర్ఎస్ ఎంపీలు సైతం గతంలో మెమొరాండం సమర్పించారని పద్మారావు గుర్తుచేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో గతంలో చర్చించినప్పుడు ప్రత్యామ్నాయ స్థలం ఇచ్చినట్లయితే అభ్యంతరం లేదన్నారని తెలిపారు. పద్మారావు విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సురేశ్‌ప్రభు వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పద్మారావుచేత కూడా మాట్లాడించారు. వీలైనంత త్వరగా దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయని రైల్వే మంత్రి హామీ ఇచ్చారు. ఇదే అంశంపై సోమవారం కేంద్ర కార్మిక మంత్రి దత్తాత్రేయను కలిసిన పద్మారావు.. ఈ విషయంలో చొరవ తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. సురేశ్‌ప్రభుతో జరిగిన భేటీలో బండారు దత్తాత్రేయతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రామచంద్రు తేజావత్, టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, కవిత, మల్లారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాంనాయక్ ఉన్నారు. అనంతరం ఎంపీ కవిత మీడియాతో మాట్లాడుతూ, లాలాగూడలోని రైల్వే భూముల అప్పగింతకు సురేశ్‌ప్రభు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఆ భూముల్ని ప్రభుత్వానికి అప్పగించేలా ఆదేశాలు వస్తాయన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ అంశాలను కూడా రైల్వే మంత్రితో చర్చించామని, వీటన్నింటిపై లోతుగా చర్చించి, వెంటనే నిర్ణయం తీసుకునేందుకు త్వరలోనే తెలంగాణలో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారని కవిత వివరించారు.



లాలాగూడ స్థలాలపై మంగళ వారం ఢిల్లీలో రైల్వేమంత్రి సురేశ్‌ప్రభుకు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి పద్మారావు, ఎంపీ కవిత. చిత్రంలో కేంద్రమంత్రి దత్తాత్రేయ, ఎంపీలు వినోద్, మల్లారెడ్డి, సీతారాం నాయక్ తదితరులు కూడా ఉన్నారు.

పెండింగ్ అంశాలపై రైల్వే మంత్రికి ఎంపీ కవిత విజ్ఞప్తి

నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన కొన్ని రైల్వే అంశాలను మంత్రి సురేశ్‌ప్రభు దృష్టికి ఎంపీ కవిత తీసుకెళ్ళారు. నిజామాబాద్, జగిత్యాల రైల్వే స్టేషన్లలో సౌర విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పాలని, అంక్షాపూర్ రైల్వే స్టేషన్ పేరును పడ్గల్‌గా మార్చాలని కోరారు. నవీపేట స్టేషన్‌లో ప్లాట్‌ఫారానికి, రైల్వే ట్రాక్‌కు మధ్య దూరంగా ఎక్కువ ఉన్నందున రైలు ఆగిన సమయంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నందున ప్లాట్‌ఫారం పెంచాలని, నవీపేట రైల్వేస్టేషన్, అర్సపల్లి స్టేషన్ల మధ్య రైల్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని విజ్ఞప్తిచేశారు.

తెలంగాణకు నీతి ఆయోగ్ ప్రశంస



మంగళవారం ఢిల్లీలో నీతిఆయోగ్ వైస్ చైర్మన్ పనగరియా అధ్యక్షతన జరిగిన ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అడ్వైజరీ గ్రూప్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల రంగంలో తెలంగాణ విధానాలు ఆశాజనకం: పనగరియా

అడ్వయిజరీ గ్రూప్ తొలి సమావేశానికి మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి, విద్యుత్ ఉత్పత్తి సాధనలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించింది.ఆశాజనకంగా ఉన్న తెలంగాణ విధానంపై అన్ని రాష్ట్రాలూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను గణనీయంగా ఉత్పత్తి చేస్తున్న పది రాష్ట్రాలతో ఏర్పడిన అడ్వయిజరీ గ్రూప్ తొలి సమావేశం ఢిల్లీలోని నీతి ఆయోగ్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశం వివరాలు మంత్రి జగదీశ్‌రెడ్డి తరువాత మీడియాకు తెలిపారు. 2022 సంవత్సరం నాటికి దేశంలో 175 గిగావాట్ల ప్రత్యామ్నాయ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంలో 75% ఉత్పత్తి చేస్తున్న పది రాష్ట్రాలతో నీతి ఆయోగ్ ఈ అడ్వయిజరీ గ్రూపును ఏర్పాటు చేసిందని చెప్పారు. గ్రూపు తొలి సమావేశంలో ఈ లక్ష్యాన్ని చేరుకోడానికి ఉన్న ఇబ్బందులు, వాటిని అధిగమించడం కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పత్తికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనుసరిస్తున్న విధానంపై చర్చించామన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరులంటే కేవలం సౌర విద్యుత్ మాత్రమే కాదని, పవన, బయోమాస్, గ్యాస్ ఆధారిత రంగం కూడా అని వివరించామని చెప్పారు లక్ష్యాన్ని సాధించే దిశగా విధాన నిర్ణయాలు, కార్యాచరణ ఉండాలని వివరించినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్లను ప్రామాణికంగా తీసుకుని సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగేలా 'డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్'ను రూపొందించామని, ఎక్కడ విద్యుత్ అవసరం ఉంటే అక్కడే ఉత్పత్తి చేసేలా నిర్ణయం తీసుకున్నామని జగదీశ్‌రెడ్డి తెలిపారు. గతంలో భారీ స్థాయిలో సౌర విద్యుత్ పార్కులు ఉండేవని, ఇక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ట్రాన్స్‌మిషన్ లైన్ల ద్వారా వివిధ ప్రాంతాలకు సరఫరా చేసేవారమని, దీని వల్ల నష్టాలు జరుగడం మాత్రమే కాకుండా లీకేజీ కూడా ఉండేదని వివరించినట్లు తెలిపారు. ఎక్కడ అవసరం ఉంటుందో అక్కడే ఉత్పత్తి చేయడం ద్వారా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉండే ప్రాంతాలకు సరఫరా చేయడానికి మార్గం ఏర్పడిందని అన్నారు. ఇందుకోసం సబ్‌స్టేషన్ల వారీగా టెండర్లను పిలిచామని తెలిపారు. ఈ నిర్ణయం వలన ట్రాన్స్‌మిషన్ లైన్లలో దాదాపు రూ. 550 కోట్ల మేర ఆదా అయిందని, ఒక్క సంవత్సరంలోనే 122 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం సగటున రూ. 49 కోట్ల మేరకు ఆదా చేసుకునే వీలు ఉంటుందని వివరించారు. రాబోయే కాలంలో ప్రత్యామ్నాయ ఇంధనాన్ని గ్రిడ్‌తో అనుసంధానం చేస్తామని తెలిపారు. సౌర విద్యుత్‌ను ఎక్కువగా వినియోగించుకోవాలంటే దానిని నిల్వ చేసుకునే సౌకర్యం ఉండాలని, ఇందుకోసం తక్కువ ఖర్చుతో బ్యాటరీలను రూపొందించే దిశగా పరిశోధనలు జరుగాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిపామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో రెండు వేల మెగావాట్ల ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి అవుతున్నదని, ఈ ఏడాదిలోగా ఉత్పత్తిని మరో 1500 మెగావాట్లు పెంచుతామని చెప్పారు. సమీప భవిష్యత్తులో 6000 మెగావాట్ల ఉత్పత్తి సాధిస్తామన్నారు. రైతాంగానికి 24 గంటల విద్యుత్‌ను సరఫరాలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులను కూడా జోడిస్తున్నామని తెలిపారు. మరో ప్రధానమైన అంశాన్ని కూడా ఈ సమావేశంలో తెలంగాణ ప్రస్తావించింది. ఇటీవల సౌర విద్యుత్ ఉత్పత్తి వ్యయం బాగా తగ్గినందువల్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ద్వారా తెలంగాణకు జరిగే నష్టాన్ని భర్తీ చేయాలని కేంద్రాన్ని కోరింది. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి అజయ్‌మిశ్రా, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల సంస్థ ఎండీ సుధాకర్‌రావు, కర్ణాటక మంత్రి శివకుమార్, మిగతా ఎనిమిది రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం టీఆర్ఎస్‌ఎల్పీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ విప్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎస్సారెస్పీకి పునర్జీవం

మొదటిపేజీ తరువాయి...

మిషన్‌భగీరథ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి బుధవారం అక్కడికి వెళ్లనున్నారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం గురించి మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు వివరిస్తూ.. గత పాలకుల నిర్లక్ష్యానికి వట్టిపోయిన తెలంగాణలోని అతిపెద్ద సాగునీటి వనరు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పూర్వవైభవం తేవడానికి తమ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి రెండు వేల కోట్ల రూపాయలను విడుదలచేయడానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని వెల్లడించారు. దీనిలో భాగంగా ఇప్పటికే వెయ్యి కోట్లను విడుదల చేసి, పునర్జీవ పనుల టెండర్ల ప్రక్రియను కూడా పూర్తిచేసినట్టు తెలిపారు. కాల్వల పునరుద్ధరణ పనులకు తాజాగా మరో వేయి కోట్లు కేటాయించడానికి సీఎం అంగీకరించారని హరీశ్ వెల్లడించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రూ.200 నుంచి రూ.300 కోట్లు కొన్ని రోజుల్లో విడుదలవుతాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వరదకాల్వల ద్వారా ఎస్సారెస్పీ రిజర్వాయర్‌ను నింపి, 14.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామనని హరీశ్ తెలిపారు. మేడిగడ్డ దగ్గర గోదావరి నీరు లక్షల క్యూసెక్కులు వృథాగా పోతూ సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. మేడిగడ్డ వద్ద ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నీటిని వరద కాల్వల ద్వారా ఎస్సారెస్పీకి తరలిస్తామన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల విషయంలో.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయడం, ఉన్న వాటిని ఆధునీకరించడం, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయడం అనే త్రిముఖ వ్యూహాన్ని తమ ప్రభుత్వం అనుసరిస్తున్నదని చెప్పారు.

మోడువారిన ప్రాజెక్టుకు పూర్వవైభవం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకుల నిర్లక్ష్యంతో మోడువారిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోయడానికి, ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో 112 టీఎంసీల సామర్థ్యంతో అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న ఎస్సారెస్పీని ఆంధ్రపాలకులతోపాటు తెలంగాణనుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధులు కూడా తీవ్ర నిర్లక్ష్యం చేశారని హరీశ్ విమర్శించారు. ఫలితంగా ప్రాజెక్టులో సాగునీరు కాదుకదా.. కనీసం తాగునీటి అవసరాలకు సరిపడా నీరు కూడా లేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్-1 కింద 9.64 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ప్రకటించినా ఒక్క రోజు కూడా నీరందించలేదని చెప్పారు. ఇందుకు భూపాలపల్లి ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ఈ నియోజకవర్గానికి 58వేల ఎకరాలకు నీరందిస్తామని చెప్పి, ఒక్క ఎకరానికి కూడా ఇవ్వలేకపోయారని హరీశ్ గుర్తుచేశారు. డోర్నకల్‌లోనూ అదే పరిస్థితి ఉందన్నారు. గతంలో తవ్విన కాల్వలు పూడుకుపోయి, నిరుపయోగంగా మారడంతో ఇక నీరు రాదనే భావనతో రైతులు వాటిని తవ్వి పంటపొలాలుగా మార్చుకున్నారని చెప్పారు. ఆంధ్ర ప్రాంతంలో ఉన్న ఆనకట్టలను బరాజ్‌లుగా మార్చుకున్న గత పాలకులు తెలంగాణ ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యంచేశారని విమర్శించారు. ధవళేశ్వరం, విజయవాడ, సుంకేశుల ఆనకట్టలను బరాజ్‌లుగా మార్చుకున్న నాటి ఆంధ్రపాలకులు తెలంగాణలో ఉన్న ఒకే ఒక్క సదర్‌మాట్ ఆనకట్టను కూడా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సదర్‌మాట్‌ను బరాజ్‌గా మార్చడానికి రూ.315 కోట్లను వెచ్చించి, 18వేల ఎకరాలకు సాగునీరందించగలిగామన్నారు. దానితో పాటు ఖానాపూర్, మెట్‌పల్లిలలో ఐదు వేల ఎకరాల పంటపొలాలను స్థిరీకరించగల్గుతున్నామని చెప్పారు. గత పాలకులు మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టుల ద్వారా కనీసం 25 వేల ఎకరాలకు కూడా నీరందించలేకపోయారని మంత్రి అన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు లక్షల ఎకరాలకు నీరందించగలుగుతున్నామని చెప్తూ.. దీనిని ఆరులక్షల ఎకరాలకు పెంచుతామని ప్రకటించారు.

ఇంజినీర్‌లా పనిచేస్తూ.. రైతుకోసం తపిస్తున్న సీఎం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ధ్వంసమైన తెలంగాణ ప్రాంత సాగునీటి రంగాన్ని, నిర్లక్ష్యానికి బలైన వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిరంతరం శ్రమిస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. రైతుల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి.. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, పునరాకృతి కోసం ఇంజినీర్‌కంటే ఎక్కువ శ్రమిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, పథకాలు రైతుల సంక్షేమం చుట్టూనే ఉంటాయన్నారు. గతంలో వ్యవసాయానికి ఆరుగంటలు కరెంట్ ఇవ్వడమే గగనంగా ఉండేదని, ఇప్పుడు 24గంటలు సరఫరా ఉందని చెప్పారు. గతంలో ఎరువులు, విత్తనాల కొరత వార్తలే రోజూ ఉండేవని, కానీ ఈ రోజు మచ్చుకు కూడా ఆ సమస్య లేదని గుర్తుచేశారు. రూ.1024 కోట్లను వెచ్చించి ముందుచూపుతో ప్రతీ మండలంలో గోదాములను నిర్మించడం వల్ల రైతులనుంచి ధాన్యం సేకరణకు ఎలాంటి ఇబ్బంది రాలేదని హరీశ్ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 54 లక్షల టన్నుల వడ్లు వచ్చినా గోదాముల సమస్య లేకుండా ధాన్యం సేకరణ సాఫీగా సాగిందని తెలిపారు. ప్రతి రైతుకు పంటకు అవసరమైన పెట్టుబడికింద ఎకరానికి రూ.8వేలు అందించాలన్న నిర్ణయం వంటి చర్యలు రైతుల సంక్షేమంపై సీఎంకు ఉన్న దృష్టికి నిదర్శనమని హరీశ్ చెప్పారు. ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి నిశిత దృష్టికి చాలా సందర్భాలలో ఇంజినీరింగ్ నిపుణులు సైతం ఆశ్చర్యపోతున్నారని పేర్కొన్నారు.

'మా సమస్యకు దారి చూపండి'

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఉన్న ఫాతిమా ప్రైవేటు వైద్య కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా యాభై మందికిపైగా వైద్య విద్యార్థులు రోడ్డున పడ్డారు. ఇందులో సుమారు పాతికమంది తెలంగాణ విద్యార్థులు కూడా ఉన్నారు. కనీస వసతులు లేని కారణంగా ఫాతిమా ప్రైవేటు వైద్య కళాశాలకు అనుమతి ఇవ్వలేమని, 2014-15 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ప్రవేశాలను రద్దు చేస్తున్నట్లు భారత వైద్య మండలి ప్రకటించింది. కళాశాల యాజమాన్యం తప్పిదానికి తమ భవిష్యత్తును ఫణంగా పెట్టడం బాధాకరమని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. పది రోజులుగా ఢిల్లీలోనే ఉంటూ కేంద్ర వైద్యారోగ్య మంత్రి, మైనారిటీ వ్యవహారాల మంత్రి తదితరులను కలిసి న్యాయం చేయాలని కోరారు. మంగళవారం టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డిని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

కొత్త మార్గదర్శకాలతో బీఈడీ కాలేజీల్లో సమస్యలు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా బీఈడీ, డీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన మార్గదర్శకాలు తెలంగాణలోని విధానాలకు అనుగుణంగా లేనందువల్ల విద్యార్థులు ఏడాదికాలం నష్టపోయే ప్రమాదం ఉన్నదని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర హెచ్చార్డీ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు ఎంపీ మల్లారెడ్డి విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు బీఈడీ, డీఈడీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులతోపాటు మల్లారెడ్డి ఈ అంశాలను హెచ్చార్డీ మంత్రికి వివరించారు. సహజంగా ప్రతిరాష్ట్రంలోని ప్రైవేటు బీఈడీ, డీఈడీ కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు, విద్యార్థుల ప్రవేశాలు ఏప్రిల్-జూన్ మధ్యకాలంలోనే జరుగుతాయని, కానీ, కొత్త మార్గదర్శకాలు జూన్ తర్వాత వచ్చినందువల్ల విద్యార్థులు ఏడాది నష్టపోవాల్సి వస్తున్నదన్నారు. ఎంపీ మల్లారెడ్డివెంట ప్రైవేటు బీఈడీ, డీఈడీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, కే రాందాస్, జీ రాజేశ్, జే నారాయణన్ ఉన్నారు.

84% పీఎల్ఎఫ్ సాధించిన సింగరేణి థర్మల్ ప్రాజెక్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో సింగరేణి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు కీలకపాత్ర పోషిస్తున్నది. గడిచిన నాలుగు నెలల్లో 84 శాతం పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టరీ)ని సాధించింది. ప్రాజెక్టులోని రెండు 600 మెగావాట్ల ప్లాంట్ల నుంచి ఇప్పటివరకు 7,172 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. గత ఫిబ్రవరిలో యూనిట్-2లో వందశాతం, యూనిట్-1లో తొంభై శాతం పీఎల్ఎఫ్ సాధించి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఆదర్శప్రాయంగా నిలిచింది. గత ఏప్రిల్‌లో యూనిట్-1, మేలో యూనిట్-2 నూరుశాతం పీఎల్ఎఫ్‌ను సాధించాయి. నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా, సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేస్తున్నందు వల్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం మెరుగైన పీఎల్ఎఫ్‌ను సాధిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు.

14.88 శాతంవృద్ధి సాధించిన సింగరేణి

సింగరేణి సంస్థ జూలైలో 44 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి గత ఏడాది జూలైలో సాధించిన 38.3 లక్షల టన్నులకన్నా 14.88 శాతం వృద్ధిని నమోదుచేసింది. బొగ్గు రవాణాలో కూడా 21.86 శాతం వృద్ధిని నమోదుచేసింది. ఓవర్ బర్డన్ తొలిగింపులో గత ఏడాది జూలైలో 169.9 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యం సాధించగా ఈ జూలైలో 279.3 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలిగించింది. గతేడాది కంటే ఈసారి 64.39 వృద్ధిని నమోదు చేసింది. మెరుగైన రీతిలో లక్ష్యాల్ని సాధించడంపై సింగరేణి సీఎండీ హర్షం వ్యక్తం చేశారు.

ముహూర్తం



సూర్యోదయం: 5.59 గంటలకు



సూర్యాస్తమయం: 6.45 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, శుక్లపక్షం దశమి మధ్యాహ్నం 2.16 వరకు. తదుపరి ఏకాదశి. నక్షత్రం: అనురాధ మధ్యాహ్నం 3.17 వరకు తదుపరి జ్యేష్ఠ. అమృత ఘడియలు: తె. 3.37 నుంచి 5.13 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.58 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.57 నుంచి 12.48 వరకు, వర్జ్యం: రాత్రి 9.34 నుంచి 11.10 వరకు.

బ్యాంకు ఖాతాల్లోకి 'ఉపాధి' డబ్బులు!

జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం.. సెప్టెంబర్ 10లోగా ప్రక్రియ పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కూలీలకు నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే కూలిడబ్బులు జమచేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ఇందులో భాగంగా జాబ్‌కార్డులను ఆధార్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది. బ్యాంకు ఖాతాలు లేని కూలీలకు కొత్తవి తెరిపించాలని సూచించింది. సెప్టెంబర్ 10లోగా కార్యాచరణను పూర్తిచేయాలని నిర్ణయించారు. అవసరమైతే డిసెంబర్ 31వరకు అవకాశం కల్పించనున్నారు.

- **ప్రతీ మండలంలో అవగాహన సదస్సు:** దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంపీడీవోలకు ఇప్పటికే అవగాహన కల్పించారు. వీరు ఆయా మండలాల్లో ఉపాధి కూలీలతో సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాల్సి ఉంటుంది. సమావేశం నిర్వహించే తేదీ, సమయానికి సంబంధించిన సమాచారాన్ని ముందుగానే కూలీలకు తెలియజేస్తారు. ఒక్కో మండలంలో నాలుగు నుంచి ఐదురోజులు క్యాంపులు కొనసాగుతాయి. కూలీల ముందస్తు అనుమతితోనే జాబ్‌కార్డును ఆధార్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించాలి.
- **దరఖాస్తు చేసుకోవాలి ఇలా..:** మండల కంప్యూటర్ సెంటర్(ఎంసీసీ)లో సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో కూలీ పేరు, జాబ్‌కార్డు, ఆధార్‌నంబర్లు, బ్యాంకుఖాతా సంఖ్యను ఎంటర్‌చేసి ప్రింటెడ్ కాపీని తీసుకోవాలి. దానికి ఆధార్, బ్యాంకు ఖాతా, జాబ్‌కార్డు జిరాక్స్ పత్రాలను జతచేసి ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇవ్వాలి. ఆయితే దరఖాస్తుదారుడు మొబైల్ నంబర్ కలిగి ఉండడం తప్పనిసరి. ఆయా గ్రామాలకు బ్యాంకు ప్రతినిధులు వచ్చి కూలీలనుంచి అనుమతి పత్రాలు, ఆధార్ వివరాలు నమోదు చేసుకొని రశీదు అందజేస్తారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో సేకరించిన బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్లను ఎప్పటికప్పుడు లింక్ చేయాల్సి ఉంటుంది.

7న చేనేత కార్మికులకు సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లకు ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. సచివాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్లతో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేత కార్మికుల ప్రత్యేకతను చాటేలా విద్యార్థులతో ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో మార్నింగ్‌వాక్‌లు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాయంత్రం హైటెక్స్‌లో ఏర్పాటుచేసే కార్యక్రమంలో సినీనటి సమంత ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో ఉంటుందని, అనంతరం మంత్రి కేటీఆర్ చేనేత కార్మికులను సన్మానిస్తారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టెస్కో జీఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్-2017 బైపీసీ సీట్ల కేటాయింపు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల్లో సీట్ల కేటాయింపు ప్రక్రియను మంగళవారం చేపట్టారు. మొత్తం 174 కాలేజీల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయని ఎంసెట్ అడ్మిషన్ కన్వీనర్ ఏ వాణీప్రసాద్ తెలిపారు. ఇందులో 118 బీఫార్మసీ కళాశాలల్లో 6,264 సీట్లు, 54 ఫార్మాడీలో 1,061 సీట్లు, రెండు బయోటెక్నాలజీ కాలేజీల్లో 42 సీట్లు నిండాయన్నారు. ఆగస్టు 9వతేదీ వరకు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కన్వీనర్ పేర్కొన్నారు.



మంగళ వారం హైదరాబాద్‌లోని భాషా సాంస్కృతికశాఖ కార్యాలయం వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'గిఫ్ట్ ఏ హెల్మెట్ 'ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాళేశ్వరం పనుల్లో వేగం పెంచండి

మార్చిలోపు పంపుహౌస్‌ల కరెంటు పనులు పూర్తవ్వాలి

వచ్చే జూన్ నాటికి ఎత్తిపోతల పథకాలకు 12,500 మెగావాట్ల పవర్: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో విద్యుత్ సరఫరా పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. పంపింగ్ స్టేషన్లను వచ్చే ఏడాది జూన్‌కల్లా అందుబాటులోకి (కమిషనింగ్) తీసుకురానున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు 12,500 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని చెప్పారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జలసౌధలో ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి హరీశ్‌రావు మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కాళేశ్వరం పంపుహౌస్‌ల పనులు 2018 మార్చి చివరికల్లా పూర్తి చేయడానికి గడువు పెట్టుకున్నందున విద్యుత్ సంస్థలు తమ పనుల్లో మరింత వేగం పెంచాలి. ప్యాకేజీలవారీగా పంపింగ్ స్టేషన్ల పూర్తికి నిర్ణీత గడువును నిర్దేశించుకొని నీటిపారుదల శాఖ పనిచేస్తున్నది. వచ్చే డిసెంబరుకల్లా ప్యాకేజీ-6 పనులన్నీ పూర్తిచేస్తాం. వివిధ పనులకు డెడ్‌లైన్లను ఖరారు చేశాం. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పంపుహౌజ్‌ల పనులు పుంజుకున్నాయి. వచ్చేఏడాది ఖరీఫ్‌లో సాగునీటిని అందిస్తాం' అని అన్నారు. వీటి పంపులు, మోటర్ల తయారీదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ డిసెంబరుకల్లా ప్యాకేజీ-6, 8లలో పంపుహౌజ్‌ల నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌లతోపాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్లోనూ రిజర్వాయర్ల మీదుగా పోతున్న 220కేవీ, 132 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్లను వెంటనే తరలించాలని మంత్రి ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు హెచ్‌టీ లైన్లు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా రిజర్వాయర్ల పరిధిలోని హెచ్‌టీ లైన్లు, టవర్ల తరలింపు ప్రక్రియను వెంటనే చేపడుతామని ఈ సందర్భంగా ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మంత్రికి తెలిపారు. విద్యుత్ పనుల్లో వేగం పెంచేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని, గడువులోపే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, పంపిణీ లైన్ల ఏర్పాటు పూర్తి చేస్తామని వివరించారు.



కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఇరిగేషన్, విద్యుత్‌శాఖల అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తదితరులు

మరింత సమన్వయంతో ముందుకు...

రానున్న రోజుల్లో ఇరిగేషన్, విద్యుత్ సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. కాళేశ్వరంలోని మూడు బ్యారేజీల పరిధిలోని పంపుహౌస్‌ల నిర్మాణానికి అవసరమైన విద్యుత్ సరఫరా అంశాలపై మంత్రి ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులతో చర్చించారు. 2018 మార్చిలోగా 10 సబ్‌స్టేషన్లు పూర్తిచేయాలని, త్వరితగతిన విద్యుత్ సబ్‌స్టేషన్ల పరీక్షలు పూర్తిచేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీలు-6 నుంచి 12 వరకు పంపింగ్ స్టేషన్ల పురోగతిని మంత్రి సమీక్షించారు. పనుల పర్యవేక్షణ కోసం రెండుశాఖల్లో ఒక బృందాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఈఎన్సీ మురళీధర్‌రావు, ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్, జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం, ఎత్తిపోతల పథకాల ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, ట్రాన్స్‌కో సీఈ ప్రభాకర్, కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ ఎన్ వెంకటేశ్వర్లు, హరిరాం, సీఈలు సునీల్, భగవంతరావు, లింగరాజు, బంగారయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణ తప్పనిసరి

అసెంబ్లీ సీట్ల పెంపుపై ఎంపీలకు తెలిపిన కేంద్రమంత్రి హన్స్‌రాజ్

170వ అధికరణం సవరించకుండా సాధ్యపడదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: రాజ్యాంగంలోని 170వ అధికరణాన్ని సవరించకుండా అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యపడదని కేంద్రం స్పష్టం చేసింది. అసెంబ్లీ సీట్ల పెరుగుదల తాయా లేదా అనే సందేహానికి తెరదించింది. రాజ్యాంగ సవరణ జరుగకుండా అసెంబ్లీ సీట్లు పెరిగే ప్రసక్తే లేదని తెలిపింది. 2026 తర్వాత జరిగే తొలి జనగణన జరిగేంత వరకు ఏ రాష్ట్రంలోనూ అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచడం సాధ్యం కాదని స్పష్టంచేసింది. ఏపీ, తెలంగాణల్లో అసెంబ్లీ సీట్ల పెంపు అంశం పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నప్పటికీ, అందులో 170వ అధికరణానికి అనుగుణంగా జరుగాలని పేర్కొన్నందున, రాజ్యాంగ సవరణ లేకుండా సీట్ల పెంపు సాధ్యపడదని వివరించింది. టీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఎంపీ మురళీమోహన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ గంగారాం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

పెంపు సాధ్యపడదన్న అటార్నీ జనరల్..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 26 ప్రకారం తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లను 134కు, ఏపీలో 175 సీట్లను 225కు పెంచాల్సి ఉండని, అయితే 'రాజ్యాంగంలోని 170వ అధికరణానికి అనుగుణంగా..' అని అందులో స్పష్టంగా ఉందని చెప్పారు. అయితే 170వ అధికరణంలో 2026 తర్వాత జరిగే జనగణన అనంతరం మాత్రమే సీట్ల పెంపు జరుగాలని ఉన్నందున వల్ల ఆ అధికరణాన్ని సవరించకుండా ఈ రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

రాజ్యాంగ సవరణపై దాటవేత..

అయితే రాజ్యాంగ సవరణ చేసి అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచడానికి అనువుగా బిల్లును ప్రవేశపెట్టే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి ఉందా?.. అని కొత్త ప్రభాకర్‌రెడ్డి లేవనెత్తిన ప్రశ్నకు మాత్రం కేంద్ర మంత్రి స్పష్టత ఇవ్వలేదు.

బజాజ్ కమిటీతో నేడు కృష్ణాబోర్డు చైర్మన్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టిసీమ ద్వారా ఆంధ్రప్రదేశ్ కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను మళ్లించడంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ విధి విధానాలను ఖరారు చేసేందుకు కేంద్రం నియమించిన బజాజ్ కమిటీతో కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ బుధవారం భేటీ కానున్నారు. వాస్తవానికి ఈ సమావేశానికి రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లను కూడా చైర్మన్ తీసుకువెళ్లాలి. కానీ, ఆయన ఏపీకి చెందిన ఇద్దరు ఇంజినీర్లను మాత్రమే తీసుకువెళ్లేందుకు నిర్ణయించారు. దీనిపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం తెలుపడంతో వారు వెనుకకు తగ్గారు. దీంతో చైర్మన్ ఒక్కరే బజాజ్ కమిటీని కలువనున్నారు.



భద్రాద్రి ఆలయ తుది నమూనాను పరిశీలిస్తున్న చినజీయర్‌స్వామి, మంత్రి తుమ్మల

భద్రాద్రి ఆలయాభివృద్ధికి బృహత్ ప్రణాళికలు

ఆర్కిటెక్ట్ బృందానికి చినజీయర్‌స్వామి ప్రశంసలు

త్వరలో సీఎం కేసీఆర్ పరిశీలనకు నమూనాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి బృహత్ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలోని బృందం చినజీయర్‌స్వామిని మంగళవారం కలిసి ఆలయ నమూనాలను అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఇదివరకు చెప్పిన మార్పులు చేసినందుకు మంత్రి తుమ్మలను, ఆర్కిటెక్ట్‌లు, శిల్పశాస్త్ర నిపుణులను ప్రశంసించారు. మాస్టర్‌ప్లాన్‌పైన జీయర్‌స్వామి సంతృప్తిని వ్యక్తంచేశారు. మూలవిరాట్టు కొలువై ఉండే మొదటి ప్రాకారాన్ని రాతితో కట్టాలని, రెండు, మూడో ప్రాకారాలను ఇటుకలతో కట్టినా ఫరవాలేదని సూచించారు. ఆలయ ప్రాకారాలను ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం పెంచుతున్నందున కొందరు ఇండ్లు కోల్పోయే అవకాశాలు ఉన్నాయని, వారికి మెరుగైన పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆలయ ఈవోను ఆదేశించారు. వెంటనే ఈ నమూనాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోతామని తుమ్మల పేర్కొన్నారు. ఆయన ఆమోదముద్ర వేయగానే టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. చినజీయర్‌స్వామి ప్రశంసలు అందుకోవడంపట్ల ఆర్కిటెక్ట్ బృందం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వచ్చింది పది టీఎంసీలే!

కృష్ణా బేసిన్‌లో 190 టీఎంసీలు

ప్రాజెక్టులు నింపుకొంటూ వచ్చిన నీటిని గరిష్ఠంగా వినియోగించుకొంటున్న కర్ణాటక

తెలుగు రాష్ట్రాలకు స్వల్పంగానే నీటి విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కృష్ణా బేసిన్‌లో పరిస్థితి గత రెండు, మూడు సంవత్సరాల్లో మాదిరిగానే ఉండేట్లుంది. ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లోలు లేకపోవడం, వచ్చిన మేర కర్ణాటక ప్రాజెక్టుల్లో నింపుకోవడంతో తెలుగు రాష్ట్రాల పరిధిలోని కృష్ణా ప్రాజెక్టులు వరద జలాల కోసం పడిగాపులు కాయవలసిన స్థితి ఏర్పడుతున్నది. కృష్ణా బేసిన్‌కు గత నెల 28 నుంచి మంగళవారం వరకు అన్ని ఇన్‌ఫ్లోల ద్వారా దాదాపు 190 టీఎంసీలు మాత్రమే చేరినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షపాతం బాగానే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసినా కృష్ణా బేసిన్‌లో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎగువ నుంచైనా వరద జలాలు వస్తాయనుకుంటే కర్ణాటక వైఖరి అడ్డుపడుతున్నది. మహారాష్ట్ర నుంచి వచ్చిన వరదజలాలను, తమ రాష్ట్రంలో వర్షాలకు సమకూరిన నీటిని తానే గరిష్ఠంగా వినియోగించుకోవాలని ఆ రాష్ట్రం చూస్తున్నది. వచ్చిన నీటిని వచ్చినట్టే తమ ప్రాజెక్టుల్లో నింపుకుంటున్నది. దిగువ రాష్ట్రాలకు అంతంత మాత్రంగానే వదులుతున్నది. దీంతో జూరాలకు అవుట్‌ఫ్లో గణనీయంగా తగ్గిపోయింది. ఈ సీజన్‌లో ఇప్పటికే వచ్చిన వరద జలాలతో కర్ణాటక ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులను నింపుకోవడంతోపాటు సుమారు 50-60 టీఎంసీల నీటిని నారాయణపూర్ కాల్వల ద్వారా మళ్లించింది. జూరాల నుంచి వచ్చిన అవుట్‌ఫ్లోతో, పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలకు మొత్తంమీద శ్రీశైలం నిండింది. ఆ తర్వాత ఇన్‌ఫ్లోలు లేకపోవడంతో శ్రీశైలం నుంచి దిగువకు చుక్కనీరు రావడం లేదు. ఈ ఏడాది ఇప్పటివరకు కృష్ణా బేసిన్‌లోనే వర్షాలు తక్కువగా నమోదయ్యాయి. కర్ణాటకలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో సుమారు 142 టీఎంసీల మేర వరద జలాలు వచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. దిగువన అంటే ఆల్మట్టి నుంచి నారాయణపూర్ మధ్యలో కేవలం రెండు టీఎంసీల వరకు చేరాయి. అటువైపు ఉజ్జయినిలో సుమారు 35 టీఎంసీల వరకు వరద వచ్చినా తెలుగు రాష్ట్రాలకు దానితో ప్రయోజనం లేదు. వచ్చిన నీటిలో 140 టీఎంసీలను కర్ణాటక ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లో నిల్వ చేసుకున్నది. మిగిలిన ఒకటీ, రెండు టీఎంసీలను గత రెండు, మూడు రోజులుగా కాల్వల ద్వారా మళ్లిస్తున్నది. తెలుగు రాష్ట్రాల పరిధిలో జూరాల మొదలు పులిచింతల వరకు కృష్ణా పరీవాహక ప్రాంతంలో వర్షాల ద్వారా వచ్చిన వరద నామమాత్రంగా ఉంది. జూరాల సెల్ఫ్ క్యాచ్‌మెంట్ ఏరియాలో సుమారు 6 నుంచి 6.50 టీఎంసీలు, జూరాల-శ్రీశైలం మధ్య ప్రాంతంలో 3.5 టీఎంసీల వరకు వచ్చి చేరాయి. శ్రీశైలం-నాగార్జునసాగర్‌లో నైతే ఒక్క టీఎంసీ కూడా చేరలేదు. పులిచింతలకు ఎగువన పరీవాహకం నుంచి దాదాపు మూడున్నర నుంచి నాలుగు టీఎంసీల నీళ్లు వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఎగువన అంటే కర్ణాటక నుంచి 356 టీఎంసీలు తెలుగు రాష్ట్రాలకు రావాలి. వాటిలో ఈ ఏడాదిలో నేటి వరకు దాదాపు కేవలం పది టీఎంసీలే వచ్చాయి.

నీటిపారుదలశాఖ లెక్కల ప్రకారం గత నెల 28వ తేదీ వరకు ఆయా ప్రాజెక్టులకు చేరిన వరద జలాల లెక్కలు ఇలా ఉన్నాయి. (అంకెలు టీఎంసీల్లో)

ప్రాజెక్టు	సొంత పరీవాహకం	ఇతర మార్గాల్లో	మొత్తం ఇన్‌ఫ్లో
కర్ణాటక...			
ఆల్మట్టి	130.90	–	130.9
నారాయణపూర్	1.45	23.57 (ఆల్మట్టి)	25.02
ఉజ్జయిని డ్యాం	33.26	–	33.26
తెలుగు రాష్ట్రాల పరిధి...			
జూరాల	5.940	–	5.94
శ్రీశైలం	3.090	–	3.09
నాగార్జునసాగర్	0.445	2.00 (శ్రీశైలం)	2.45
పులిచింతల	3.100	–	3.10

భూసేకరణపై మరో వ్యాజ్యం

తుది నోటిఫికేషన్ రద్దు చేయాలంటూ పిటిషన్

గెజిట్‌ను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూసేకరణ సవరణ చట్టం-2016కు సంబంధించి భూసేకరణ నిబంధనల అమలుకు ముందు చేపట్టిన చర్యలను వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. నిబంధనలు అమల్లోకి తీసుకువచ్చే ముందు ముసాయిదా నిబంధనల గెజిట్ ప్రచురించారా? ప్రచురిస్తే దాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచారా ? అనే వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో స్పష్టత కోసం ముసాయిదా రూల్స్‌కు సంబంధించిన గెజిట్‌ను తమకు సమర్పించాలని జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవిలతోకూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 8 వ తేదీకి వాయిదా వేసింది. భూసేకరణ సవరణ చట్టం-2016 పేరిట రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరాములు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ చట్టాన్ని అమల్లోకి తేవడానికి ముందు ముసాయిదా రూల్స్ సిద్ధం చేసి గెజిట్ జారీచేయాల్సి ఉంటుందని, ఆ గెజిట్‌ను స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గెజిట్‌ను మే 31 వ తేదీన జారీచేశారని, ముసాయిదా రూల్స్ ఆధారంగా వచ్చిన మూడు నుంచి నాలుగు అభ్యంతరాలను కూడా పరిగణనలోనికి తీసుకున్న తర్వాతే తుది నోటిఫికేషన్ జారీచేసినట్లు వివరించారు. అయితే తెలుగు భాషలో రూల్స్‌ను ప్రచురించలేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోనికి తీసుకున్న ధర్మాసనం. గెజిట్‌లను తమకు నివేదించాలని స్పష్టం చేసింది.

కొండపోచమ్మసాగర్ భూసేకరణపై పిల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ భూసేకరణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సిద్దిపేట జిల్లా మామిడ్యాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ములుగు మండలం తానేదార్‌పల్లి, తండ, మామిడ్యాల, బైలాంపూర్ గ్రామాల్లో భూసేకరణ విషయంలో రైతుల అభ్యంతరాలపై నిర్ణయం తీసుకోకుండానే టెండర్ నోటిఫికేషన్ జారీచేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాజ్యంలో పేర్కొన్న అంశాలను లోతుగా విచారించాలని పేర్కొన్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.



విద్యుత్ సౌధలో విద్యుత్ ఉద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ తదితరులు



టీఆర్‌ఎస్ భవన్ దగ్గర కళింగభవన్ రోడ్డు సర్కిల్‌లో టీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు రాంబాబు తదితరులు



హైదరాబాద్ మింట్‌కాంపౌండ్‌లోని టీఎస్‌ఎస్పీడీసీఎల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

కరెంట్ కార్మికులతో పెట్టుకుంటే షాకే

టీజీవో అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైకోర్టులో పిల్‌కు వ్యతిరేకంగా విద్యుత్ సౌధలో నిరసన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 'కరెంట్ కార్మికులను ముట్టుకున్నారు. షాక్ కొట్టడమే కాదు, భస్మం అయిపోతారు' అని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. క్రమబద్ధీకరణ ద్వారా కాంట్రాక్ట్ వ్యవస్థకు స్వస్తి పలుకాలని తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంటే విపక్ష నేతలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి తట్టుకోలేకనే ఆరోపణలు, వాదనలకు దిగుతున్నారని విమర్శించారు. విపక్షాల తీరును నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగుల సంఘం, ఇంజినీర్లు, కార్మిక సంఘాలు విద్యుత్ సౌధలో మంగళవారం ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంత నాయకత్వంలో భాగంగానే కుట్రలకు పాల్పడుతున్నట్టు అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కోర్టులో పిల్ వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న కుట్రదారులకు తగిన బుద్ధి చెప్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ అన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిందని విద్యుత్ జేఏసీ కన్వీనర్ జానయ్య అన్నారు. అన్నం పెట్టిన కంచాన్ని లాక్కోవడం దారుణమని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ అన్నారు. ప్రతిపక్షాల తీరుతో కార్మికులకు అన్యాయం జరిగితే ఉద్యమాలు చేపడుతామని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ పీ అంజయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో రవి, కమలాకర్‌రావు, వాణి, కరెంట్‌రావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



నితీశ్ కుమార్ మహాకూటమి నుంచి వైదొలిగి బీజేపీతో చేతులు కలుపటం ఆయన అవకాశవాదాన్ని తెలియజేస్తున్నది. ఆయన మాతో కలిసి ఉన్నప్పుడు సంఘ్ ముఖ్త్ భారత్ అన్నాడు. ఇప్పుడు వారితోనే చేతులు కలిపి అధికారపీఠమెక్కాడు. ఇది అధికారదాహం తప్ప మరేమీ కాదు.

లాలూప్రసాద్ యాదవ్, ఆర్జేడీ అధినేత

చైనాతో భారత్‌కు సరిహద్దు సమస్యలేగాక వ్యాపార వైరుధ్యం కూడా ఉన్నది. ఈ క్రమంలో అనేక దఫాలుగా చైనాతో చర్చించాం. వస్తూత్పత్తిలో మనకన్నా మెరుగైన స్థితిలో ఉన్న చైనా నుంచి మన కంపెనీలను రక్షించుకోవటానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం.

నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి



చరిత్రలో నేడు



1932

'పాసిట్రాన్'ను కనుగొన్న కార్ల్‌డేవిడ్ అండర్సన్.

1934



జర్మనీలో సైన్యం, సాయుధ దళాల చీఫ్ కమాండర్‌గా అడాల్ఫ్ హిట్లర్.



1945

స్టాలిన్, హారీ ట్రూమన్, విన్‌స్టన్ చర్చిల్ మధ్య పోట్స్‌డాం సమావేశం.

కేంద్ర ప్రభుత్వం మొత్తం ఆర్థికవ్యవస్థను, ఆర్థిక కార్యకలాపాలను కూడా డిజిటలైజ్ చేయటమే లక్ష్యంగా ముందుకుపోతున్నది. కానీ డిజిటలైజేషన్ మూలంగా మునుముందు పెద్ద ప్రమాదం ఉంటుందని కాన్పూర్ ఐఐటీ హెచ్చరిస్తున్నది. ముఖ్యంగా ఆర్థికరంగంలో డిజిటలైజేషన్ ప్రమాదకరమని చెబుతున్నది. ఇప్పటిదాకా జరిగిన సైబర్ నేరాల్లో 72 శాతం ఆర్థిక నేరాలే. ఈ మధ్యనే వివిధ దేశాలు డెబిట్, కార్డులు హ్యాకింగ్‌కు గురికావటం తో ఎంతగా తల్లడిల్లిపోయాయో చూశాం. కాబట్టి డిజిటలైజేషన్ చేసే ముందు తగు రక్షణ చర్యలు తీసుకోవాలి.

ది న్యూయార్క్ టైమ్స్

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారత్ తన పొరుగు దేశాల్లో అనేకసార్లు సైనిక జోక్యం చేసుకున్నది. ఆధిపత్యంతో వ్యవహరించి పొరుగు దేశాలను అదుపాజ్ఞల్లో ఉంచుకునేందుకు ప్రయత్నించింది. అయినా పాశ్చాత్య మీడియా ఇండియాకు వంతపాడుతున్నది. వలస పాలననుంచి విముక్తి అయిన కాడి నుంచి కూడా ఇండియా ఆ పాశ్చాత్య దేశాల ప్రయోజనాలను పరిరక్షిస్తూ వస్తున్నది. అందుకే వారికి ఇండియా అంటే ప్రేమ. అందుకే డోక్లాం ప్రాంతంలోకి ఇండియా అక్రమంగా చొరబడినా దాన్ని చైనా చొరబాటుగానే చూస్తున్నాయి. భారత్ శాంతి ముసుగులో అశాంతి రేపుతున్నది.

గ్లోబల్ టైమ్స్, చైనా అధికార పత్రిక

విపత్తు నిర్వహణ

ఈశాన్యంలోని అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరంతోపాటు, పశ్చిమాన గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో వరదలు ముంచెత్తి బీభత్సం సృష్టిస్తున్నాయి. తూర్పున బీహార్, ఒడిషా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా వరదలు వచ్చినయి. ఝార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలను కూడా వరదలు ముంచెత్తాయి. ప్రధాని మంగళవారం అసోం రాజధాని గువాహటి చేరుకొని వరద పరిస్థితి సమీక్షించారు. జూన్ మొదలుకొని జూలై రెండవ వారం వరకు అస్సాం వరద తాకిడికి గురై అల్లల్లాడింది. వేల ఎకరాల పంట నష్టంతో పాటు కజిరంగా జాతీయ పార్కు తొంభై శాతం జలమయమైంది. ఈశాన్యంలో వరదలు రావడం ఈ ఏడాది మొదటిసారి కాదు. తరచుగా అసోం అనుభవిస్తున్న దుఃఖం ఇది. ఒక్క అసోంలోనే కాదు, దేశంలోని అన్ని వరద బాధిత ప్రాంతాల ప్రజల దైన్యమిది. గత కొన్ని వారాలలో దేశవ్యాప్తంగా రుతుపవన వానల వల్ల కనీసం ఏడువందల మంది మరణించారు. అయితే అసోంలో వరద బీభత్సం ఉధృతంగా ఉన్నప్పుడు కాకుండా, తగ్గుముఖం పట్టిన దశలో ప్రధాని మోదీ సందర్శించడం, గుజరాత్ వరద ప్రాంతాలను మాత్రం ముందే పర్యటించడం పట్ల విమర్శలు వచ్చాయి. గుజరాత్ ప్రధాని సొంత రాష్ట్రం కావడం, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉండటం వల్ల సహాయ చర్యలు పకడ్బందీగా సాగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కానీ గుజరాత్ అనుభవిస్తున్న విషాదం నేపథ్యంలో ఇటువంటి విమర్శలను పట్టించుకోవలసిన అవసరం లేదు. గుజరాత్‌లో గత నూటా పన్నెండేండ్ల చరిత్రలో ఇంత భారీ వానలు పడలేదని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నా రు. వరదల వల్ల రెండువందల మందికి పైగా మరణించారు. గుజరాత్ పరిస్థితి దృష్ట్యా కొంత ఎక్కువ దృష్టి పెట్టినప్పటికీ, మిగతా రాష్ట్రాల్లోని వరదబాధితులను విస్మరించారనే విమర్శలకు తావు ఇవ్వకూడదు.

జలమయమయ్యే ప్రాంతంలో గోదాములు, నివాసాలు ఉండకూడదు. పరిశ్రమలు, రహదారుల నిర్మాణం వరదలను దృష్టిలో పెట్టుకొని సాగాలె. ప్రతి నీటిపాయ గమనాన్ని నిర్దేశించి, ఉపయోగించుకోగలుగాలె. పారిశ్రామికంగా, సామాజికంగా నష్టం కనిష్ఠ స్థాయిలో ఉండేవిధంగా వ్యూహాలు చేపడితే వరదలు వచ్చినప్పుడు సహాయ చర్యలపై ఇంతగా ఒత్తిడి ఉండదు. విపత్తులు రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం విపత్తుల నిర్వహణలో భాగం కావాలె.

వరదల మూలంగా దేశవ్యాప్తంగా ఏటా వేలాది మంది మరణిస్తున్నారు. గత ఏడాది సాగిన ఒక అధ్యయనం ప్రకారం– కనీసం పదిశాతం జనాభా సామాజిక విధ్వంసానికి గురవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు సంభవించడం వల్ల, రుతుచక్రం మారిపోయి ప్రకృతి బీభత్సాలు సంభవిస్తున్నయి. వరదలు ఎప్పుడో ఒకసారి రావడం కాదు, ఇక ముందు తరచుగా సంభవించే అవకాశాలు ఉన్నాయి. గుజరాత్‌లో ఇప్పటివరకు కరువుతో అల్లాడిన ప్రాంతాల్లోనే ఈసారి భారీ వానలు పడటం విశేషం. ఏడాది మొత్తం కురిసే వానలో మూడువంతులు ఒకేసారి కుంభవృష్టి కురిసింది. భవిష్యత్తులో ఓ ఏడాది కరువు పీడించవచ్చు, ఆ తరువాత వానలు పడితే భారీగా కురిసి, అదొక ప్రకృతి విపత్తుగా మారవచ్చు. అందువల్ల ప్రభుత్వాలు కూడా ఈ భారీ వానలకు, వరదలకు శాశ్వత ప్రాతిపదికన సిద్ధపడటం అవసరం. కానీ ఇప్పటివరకు ఆ దిశగా చెప్పుకోదగిన ముందడుగు పడలేదు. అస్సాం పర్యటన సందర్భంగా ప్రధాని తక్షణ సహాయం కొంత ప్రకటించడంతోపాటు మరో వంద కోట్లు శాశ్వత పరిష్కారం కోసం అధ్యయనం చేయడానికి కేటాయించినట్టు వెల్లడించారు. శాశ్వత పరిష్కారం అనే మాట ప్రధాని నోట రావడం హర్షించదగినదే అయినప్పటికీ, ఈ హామీ ఈశాన్య ప్రాంతానికి మాత్రమే పరిమితమైంది. ఆ బృహత్కార్యం ఇంకా అధ్యయనం సాగి ఆచరణ రూపం దాల్చవలసి ఉన్నది. ఇప్పటి వరకు వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఆహార పొట్లాలు ఇవ్వడం వరద ఉధృతి తగ్గిన తరువాత ఇతరత్రా సహాయాలు చేయడం వరకే ప్రభుత్వాలు పరిమితం అయి ఉన్నాయి. ఇప్పుడు గుజరాత్, ఈశాన్య ప్రాంతాలలో కూడా ఇదే తరహా సహాయ చర్యలు సాగుతున్నయి.

వాతావరణ పరిస్థితులు భారీ మార్పులకు లోనయిన నేపథ్యంలో భారీ వానలు, వరదల వంటి ప్రకృతి బీభత్సాలను ఎదుర్కొనే విధానం కూడా మారాలె. ప్రతి రెండు లేదా మూడేండ్లకు ఒకసారి ఈ జల ప్రళయాలు వస్తాయనే అంచనాతో వ్యూహాలను రూపొందించుకోవాలె. ఒకప్పుడు వరద నష్టం అంటే ప్రాణ నష్టం లెక్కవేసేవారు. పంట నష్టం, ఇతర ఆస్తి నష్టం కూడా పరిగణనలోకి తీసుకునే వారు. కానీ 1980 దశకం నుంచి ఈ అంచనా తీరు మారిపోయింది. పారిశ్రామిక, వ్యవసాయ, సామాజిక మౌలిక వసతులకు కలిగే నష్టాన్ని, జీడీపీ ఎంత శాతం దెబ్బతింటున్నదనే ప్రాతిపదికన అంచనా వేసుకోవాలె. ఉదాహరణకు ఇటీవలి వరదల వల్ల అహ్మదాబాద్‌లోనే 150 కర్మాగారాలు మూతపడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా మూడేండ్లకు ఒకసారి వచ్చే వాన నీటిని కాపాడుకుని కరువు కాలంలో వాడుకోవడానికి జలాశయాలు నిర్మించుకోవాలె. ప్రతి గ్రామాన్ని, ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఎత్తు పల్లాలు, నీటి పారుదల ఆధారంగా నిర్మాణాలు జరుగాలె. జలమయమయ్యే ప్రాంతంలో గోదాములు, నివాసాలు ఉండకూడదు. పరిశ్రమలు, రహదారుల నిర్మాణం వరదలను దృష్టిలో పెట్టుకొని సాగాలె. ప్రతి నీటిపాయ గమనాన్ని నిర్దేశించి, ఉపయోగించుకోగలుగాలె. పారిశ్రామికంగా, సామాజికంగా నష్టం కనిష్ఠ స్థాయిలో ఉండే విధంగా వ్యూహాలు చేపడితే వరదలు వచ్చినప్పుడు సహాయ చర్యలపై ఇంతగా ఒత్తిడి ఉండదు. విపత్తులు రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం విపత్తుల నిర్వహణలో భాగం కావాలె.

జనగళం

అది వేగాన్ని నియంత్రించాలి

వాహనాల మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణమవుతున్నది. రవాణా అధికారులు దీని నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొంతమంది అతివేగంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి వారిపట్ల కఠినంగా వ్యవహరించాలి. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారి లైసెన్సులను రద్దు చేసేందుకు కూడా వెనుకాడవద్దు. వీరివల్ల అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. కాబట్టి అధికారులు ఇలాంటి వాటిని ఏ మాత్రం ఉపేక్షించవద్దు. మద్యం తాగి వాహనాల నడిపే వారి పట్ల కూడా కఠినంగా వ్యవహరించాలి.

- కె.పరమేశ్, హైదరాబాద్

ప్రతిపక్షాల తీరు మారాలె

ఎక్కడైనా ప్రాజెక్టులు కట్టాలని కోరుకుంటారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం ప్రతిపక్ష నేతలు ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్తున్నారు. తీరా కోర్టుల్లోనూ చుక్కెదురైనా గ్రీ ట్రిబ్యునల్‌కు వెళ్లి ప్రాజెక్టుల పనులు ఆపే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే సింగరేణిలో దశాబ్దకాలంగా నిలిచిపోయిన వారసత్వ ఉద్యోగాలను టీఆర్‌ఎస్ ప్రభుత్వం పునరుద్ధరించింది. దీన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారు. కానీ ఇక్కడ మాత్రం ఇచ్చిన వాగ్దానాలను అమలుచేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు కేసుల ద్వారా కుట్రలు పన్నే వారిని ఇక్కడే చూస్తున్నాం. నియామకాలకు సంబంధించి ఏ ప్రకటన వెలువడినా పరీక్షకు ముందుగానో లేదా పరీక్ష అయిపోయాకో మొత్తం ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు నిరాశ నిస్పృహలకు లోనయ్యేలా చేసి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనేది ప్రతిపక్షాల ఉద్దేశం. ప్రజా సంక్షేమం కోసం ఏ కార్యక్రమం చేపట్టినా అడ్డుకోవడమే మా పని అన్నట్టు ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరు ఏవగింపు కలిగిస్తున్నది.

- మొగుళ్ల శ్రీనివాస్, వలిగొండ, భువనగిరి యాదాద్రి జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ

రాష్ట్రంలో మానవీయ పాలన

భారతదేశం రాజ్యాంగబద్ధమైన సంక్షేమ రాజ్యం. సనాతనంగా, ఆధ్యాత్మికంగా ప్రపంచ మానవాళికి ఎన్నో జీవనమార్గ బోధనలు చేసింది. ఆధ్యాత్మిక దేశంగా ప్రసిద్ధి చెందింది. మన దేశ శాంతి, ప్రేమ, సర్వమత సహనం, సమైక్య జీవనం ప్రపంచ మానవాళికి ఆదర్శం. అందుకే ప్రపంచ దేశాల పౌరులు మన దేశాన్ని దర్శించుకోవటానికి ఉత్సాహపడుతుంటారు. అందరూ ఇక్కడి ప్రజల కుటుంబ, సంఘ జీవనం, ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లు, వ్యవహారశైలి, ఆహారపు అలవాట్లను చూసి సంభ్రమాశ్చర్యాలతో మురిసిపోతుంటారు.

ప్రపంచంలో ఎన్నో మతాలు వ్యాప్తిలో ఉన్నాయి. కానీ మన దేశం ధార్మిక చింతనలో ఆదర్శమైంది. సర్వమత సహనానికి ప్రాచీన కాలం నుంచి అన్ని రాచరికాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అక్కడక్కడ బౌద్ధం వ్యాప్తికి వ్యతిరేకంగా, మధ్యయుగంలో రాచరిక వ్యవస్థలో హిందూ మత, వ్యతిరేక మత ఘర్షణలు జరిగాయి. ఆ ఘర్షణలు ప్రజల దుర్మార్గం కంటే పాలకుల దుర్మార్గంగానే జరిగాయని చరిత్ర చెబుతున్న సత్యాలు. ఏదేమైనప్పటికీ భారతదేశం నేటికీ ప్రపంచ దేశాల్లో శాంతి సామరస్యాలకు పాటుపడే దేశంగా ప్రసిద్ధి చెందింది.

కానీ ఆధునిక కాలంలో ఈ దేశం పలురకాల హత్యలు, అఘాయిత్యాలు, ఘర్షణలకు నిలయమై ప్రజలు అభద్రతాభావంతో జీవిస్తున్నారనటంలో సందేహం లేదు. అంబేద్కర్ దూరదృష్టితో రాజ్యాంగంలో పౌరుల హక్కులకు రక్షణలు పొందుపరిచారు. మతాలుగా, కులాలుగా విభజింపబడి నిర్మితమైన సమాజం రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు, రాజ్యాంగస్ఫూర్తితో వ్యవహరించలేకపోతుండటం శోచనీయం.

ప్రజల ధన, మాన, ప్రాణ, రక్షణ కర్తవ్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. అయితే నేటి ప్రభుత్వాలు నేరస్తులపై కఠినంగా వ్యవహరించలేకపోతున్నాయి. ఇది ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలోని లొసుగులు, లోపమని చెప్పక తప్పదు. వీటికితోడు కుల, మత వర్గాలుగా విభజింపబడిన నేటి భారత సమాజం తన సహజ సాంస్కృతిక వారసత్వ లక్షణమైన సమైక్య జీవన ప్రాభవాన్ని వేగంగా కోల్పోతున్నది. భారత సమాజ ఐక్యతకు మూలాధారమైన కుటుంబ వ్యవస్థ విలువలు, గౌరవ మర్యాదలు, సంస్కారం, ప్రేమ, సౌభ్రాతృత్వాలు చాలా వేగంగా పతనమవుతున్నాయి. వీటికి కారణం పెరుగుతున్న అమానవీయ వ్యాపార సంస్కృతిగా భావించవచ్చు. అలాగే ప్రజాస్వామ్య ప్రక్రియ లోపాలు, దూరదృష్టి నిజాయితీలేని పాలన, సిద్ధాంత, విలువలు లేని రాజకీయ పార్టీలు, విలువలు కోల్పోయిన రాజకీయాలు కూడా కారణమే. రాజకీయ నాయకులు సంపాదనే పరమావధిగా కొనసాగుతున్నప్పటికీ భారత సమాజం నేటికీ మనుగడ సాగిస్తున్నదంటే ఆశ్చర్యం అవసరం లేదు. డెబ్బై ఏండ్ల స్వతంత్ర దేశంలో ఇప్పటికీ కూడా సుమారు 40 శాతం అవిద్యావంతులు ఉండటం విషాదం. విద్యావంతుల్లో కూడా విద్యను ఉపయోగించుకునే శక్తి సామర్థ్యాలు లేని వారు కోకొల్లలు. దీనికి అశాస్త్రీయ విద్యావిధానం ఒకటైతే, ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం, నిమ్నకులాల వృత్తుల వారికి నేటికీ ప్రభుత్వ యంత్రాంగంతో స్వయంగా తమకు కావలసిన పనులను చేయించుకునే శక్తిలేని అవగాహనా లోపం ముఖ్యమైనది. తరతరాలుగా కులాల పేరుతో అణచివేతతో ఇప్పటికీ పేద వర్గాలకు చెందిన ప్రజల్లో మానసికంగా తమ కాళ్ళపై తామే నిలబడగల మనోధైర్యం లేకపోవడం సామాజిక లోటుగా చెప్పుకోవచ్చు. సనాతనంగా భారతదేశం సమైక్యంగా కొనసాగినదంటే ప్రజల సమైక్య దృక్పథం, సహనం, త్యాగాలు కారణం తప్ప పాలకుల పాలనాదక్షత, త్యాగం ఎంతమాత్రం కాదని సమాజ స్పృహగల వారికి ఎవరికైనా బోధపడుతుంది. అందుకే ఈ దేశ ప్రజలు ఈ దేశ సాధారణ పౌరులకు, ప్రతి శ్రామికునికి, వృత్తిపని వారికి కృతజ్ఞతలతో వ్యవహరించాలి.

ఈ విధమైన చారిత్రక దృక్పథం, అవగాహనతో సమాజాన్ని పరిశీలించిన కేసీఆర్ తన మూడేండ్ల పాలనలో మానవ విలువలు, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేశారు. వినూత్నమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. సాహసంతో కూడిన సంకల్ప బలం, సమయస్ఫూర్తి, మనోబలం, జ్ఞానంతో కూడిన వ్యవహారశైలి పాలనను కొంతపుంతలు తొక్కిస్తున్నది. ప్రజలపై ప్రేమతో కూడిన కలుపుగోలుతనం, ప్రజాపాలనలో మమకారం, జ్ఞానులను గౌరవించడం, సబ్బండవర్గాలు, వర్ణాలను ఆదరించడంతో పాలన నిజమైన అర్థంలో జనరంజక పాలనగా కొనసాగుతున్నది. మిత్రులను ఆదరించడం, అనాథలను, దిక్కులేని వారికి ఆప్తుడవటం, మానవీయ హృదయంతో స్పందించి రక్షణనివ్వడంతో ప్రజలందరూ భద్రతతో జీవించే స్థితి వచ్చింది. అరువై ఏండ్లు ప్రజలకు జవాబుదారీతనం వహించే మనస్తత్వం, ప్రజల పట్ల నిబద్ధతతో కూడిన ప్రభుత్వ యంత్రాంగం లేని ఫలితంగా ప్రజలకు పాలనాఫలాలు అందలేదు. కానీ రాష్ట్ర సాధన తర్వాత స్వీయపాలనలో కేసీఆర్ పోలీసు యంత్రాంగాన్ని ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ దిశగా అడుగులు వేయించారు. స్త్రీల పట్ల గౌరవం పెంపొందించారు. ప్రజల ఆత్మగౌరవ రక్షణకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు చేపట్టారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లా నీళ్లు సరఫరా చేసి ఆడపడుచులు బిందెలతో బావుల చుట్టూ తిరుగకుండా చేసి వారి కష్టాలను తీర్చారు. శిశు హత్యలను నిరోధించ డం, గర్భిణీ స్త్రీలకు పోషకాహార పథకం, ప్రభుత్వ దవాఖానలో ప్రసవించేవారికి రూ.11,000 సహాయం అందించడం, ఆడ శిశువుకు అదనంగా వెయ్యి రూపాయలివ్వ డం లాంటివి స్త్రీ జాతి సముద్ధరణకు, ఆత్మగౌరవానికి సంబంధించినవే. ప్రసవించిన స్త్రీలకు, శిశువులకు మూడు నెలల కనీస అవసరాలకు సరిపడా అన్ని వస్తువులతో కూడిన కిట్స్‌ను అందించడం భావితరం పట్ల ప్రభు త్వ బాధ్యతను తెలియజేస్తున్నది. వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు పింఛన్లు ఇచ్చే పథకాలు గొప్ప సామాజిక సంక్షేమ పథకాలుగా చరిత్రలో నిలిచిపోతాయి.

సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో సన్నబియ్యం సరఫరా చేయడం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో ఆడబిడ్డల పెళ్లికి రూ.75,000 అందిస్తుండటం అత్యంత మానవీయమైనది. రైతుల ఆత్మహత్యలను ఆపటానికి దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదర్శంగా నాలుగు దఫాలుగా బ్యాంకుల రుణమాఫీ చేయడం, ఎక్కడైనా రైతు ఆత్మహత్య చేసుకుంటే ఆరు లక్ష ల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం లాంటివన్నీ సామాజిక శాంతిని నెలకొల్పి ఉన్నతిని కాపాడేవి. అన్ని కులవృత్తుల వారికి నైపుణ్య పెంపుతో పాటు కావలసిన వృత్తిపరమైన ప్రోత్సాహకాలను అందివ్వడం, గొర్ల కాపరులకు గొర్ల పెంపకాన్ని ప్రోత్సహించడం, ముదిరాజులకు, బెస్త వారికి చెరువుల, కుంటలపై అధికారంతో పాటు చేపల పెంపకం ప్రోత్సహించడం, నేతన్నలకు పింఛన్‌తో పాటు కో–ఆపరేటివ్ సంఘాల ద్వారా కావలసిన ముడి సరుకులను సమకూర్చడం లాంటివన్నీ కులవృత్తుల పరిరక్షణకు ఎంతో ఉపకరిస్తాయి. నాయీబ్రాహ్మణులకు గ్రామాల్లో క్షౌర శాలలను నిర్మించడం, చాకలివారికి దోభీ ఘాట్స్ నిర్మించడం, ముస్లింలకు, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచడం మొదలగు కార్యక్రమాలు ప్రభుత్వాన్ని మానవీయ విలువలతో నడుపడంలో భాగంగానే రూపుదిద్దుకున్నవి. ఇలాంటి అనేకానేక మానవీయ సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల జీవనవిధానాన్ని ఔన్నత్యంతో కూడిన దిశగా కేసీఆర్ రూపుదిద్దుతున్నారు.

అయినప్పటికీ ప్రతిరోజు ఏదో మూలన సామాజిక హింస చోటుచేసుకుంటున్న ఘటనలు కనిపిస్తూనే ఉన్నాయి. తండాల్లో ఆడపిల్లల అమ్మకాలు ఇప్పటికీ జరుగుతుండటం శోచనీయం. అయితే ఇలాంటి సామాజిక సమస్యలు, రుగ్మతలను రూపుమాపటం కోసం కేసీఆర్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తున్న తీరు అమోఘంగా ఉన్నది.

కేసీఆర్‌లాంటి సమర్థవంతుడి నాయత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా ముందుకుసాగుతున్నది. ఈ తరుణంలో సామాజిక బాధ్యత, నిబద్ధత కలిగిన ప్రతి పౌరుడూ కేసీ ఆర్ చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలకు అండగా నిలువాలి. అభివృద్ధి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలుకావటం కోసం ప్రతి ఒక్క రూ తమవంతు కర్తవ్యంగా వాటిలో భాగస్వాములు కావాలి.

ప్రభుత్వ దవాఖానలలో మంచి నాణ్యమైన వైద్యం పేదలందరికీ అందించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నది ప్రభుత్వం. ఈ క్రమంలో వైద్యాధికారులతో పాటు వైద్యులు, వైద్య సహాయక సిబ్బంది మానవీయంగా ప్రజలకు సేవలందించాలి. అత్యవసర సర్వీసులైన వైద్యం, ప్రత్యేక పాలనాపరమైన విభాగాలన్నింటినీ మానవీయంగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం.

కేసీఆర్‌లాంటి సమర్థవంతుడి నాయత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా ముందుకుసాగుతున్నది. ఈ తరుణంలో సామాజిక బాధ్యత, నిబద్ధత కలిగిన ప్రతి పౌరుడూ కేసీ ఆర్ చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలకు అండగా నిలువాలి. అభివృద్ధి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలుకావటం కోసం ప్రతి ఒక్క రూ తమవంతు కర్తవ్యంగా వాటిలో భాగస్వాములు కావాలి. ఎన్నో ఆశ లు, ఆకాంక్షలతో, అనన్య త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని సస్య శ్యామల తెలంగాణగా తీర్చిదిద్దుకోవాలి. హింస, రోదనలేని తెలంగాణ సమాజంగా నిర్మించుకోవాలి. దీనికిగాను కేసీఆర్ ఆలోచనల్లో, అడుగు జాడల్లో నడువటమే నేటి తెలంగాణ ప్రజలందరి బాధ్యత.

బాధిత రాష్ట్రం బాధలు పట్టవా?

తెలంగాణం



సల్లా విజయకుమార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతవాసులకు గత ఆరు దశాబ్దాలుగా కృష్ణా నదీజలాల కేటాయింపుల్లోని వాడకంలో జరిగిన అన్యాయాలను సరిదిద్దాలన్నది. అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం,1956లోని సెక్షన్–3 కింద కేంద్ర ప్రభుత్వానికి 2014 జూలైలో ఫిర్యాదు చేసింది. ఆ చట్ట ప్రకా రం, కేంద్రం తన విధ్యుక్త ధర్మంగా ఏడాదిలోగా సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించి, పరిష్కరించలేకపోతే ట్రిబ్యునల్‌కు నివేదించాలి. అయితే చట్టప్రకారం కేంద్ర ప్రభుత్వం తన కర్తవ్యాన్ని నిర్వహించనందున రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రజల హక్కులను కాపాడాలని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టును జూలై 2015లో ఆశ్రయించింది. తెలంగాణ కృష్ణానది అంతర్రాష్ట్ర జలవివాదాన్ని ట్రిబ్యునల్‌కు వెంటనే నివేదించే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టును అర్థించింది. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉన్నది.

తెలంగాణకు నదీజలాల విషయంలో జరిగిన అన్యాయాలు సొంత రాష్ట్రంలో సరిదిద్దబడుతాయనేది తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలలో ఒకటి. అయితే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 తెలంగాణనైతే ఏర్పరిచింది. కానీ, దానిలో భవిష్యత్ తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలు లేవు. దాంట్లోని సెక్షన్–89 కింద కృష్ణా ట్రిబ్యునల్ (బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్)కు నివేదించిన అంశాల పరిధి చాలా సంకుచితమైంది. కాబట్టితమకు న్యాయం చేయాలని అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం, 1956లోని సెక్షన్–3 కింద కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ కోరింది. అయితే కేంద్రం తెలంగాణ ఫిర్యాదుకు స్పందించలేదు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలను సంప్రదించలేదు. కొత్త ట్రిబ్యునల్‌కు గానీ, ఇప్పుడున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు గానీ ఫిర్యాదును నివేదించలేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో 2015 జూలైలో, తన రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడాలని, చట్ట ప్రకారం వెంటనే ట్రిబ్యునల్‌కు నివేదించమని కేంద్రాన్ని ఆదేశించాలని తెలంగాణ రాష్ట్రం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

ఈ విషయంలో కేంద్రం ధోరణి తెలంగాణ మేధావుల్లో ఆవేదనను పెంచింది. కేంద్రం తన స్వల్ప నిడివి గల 2015, డిసెంబర్ 8 అఫిడవిట్‌లో, తెలంగాణ పిటిషన్‌కు సంబంధించిన అంశం ఇప్పటికే బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించామని, కర్ణాటక, మహారాష్ట్రల వాటాలకు భంగం కలుగకుండా ఏపీ, తెలంగాణలకు నీటి పంపిణీ చేయాలని సుప్రీంకోర్టుకు నివేదించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్–89 ప్రకారం బ్రిజేశ్ ట్రిబ్యునల్ రెండు రాష్ట్రాల మధ్య నిర్ణయం చేస్తుందని పేర్కొన్నది. నిజానికి సెక్షన్–89 పరిధి చాలా పరిమితమైనది. కాబట్టి ట్రిబ్యునల్ తెలంగాణకు న్యాయం చేయడం సాధ్యం కాదు. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తనకు 2014 సెప్టెంబర్‌లో నివేదించిన అంశాన్ని కూలంకషంగా పరిశీలించి, స్పష్టంగా తెలంగాణ సెక్షన్–3 కింద చేసిన ఫిర్యాదును ట్రిబ్యునల్‌కు రిఫర్ చేయాలని సిఫార్సు చేసింది. తదనంతరం 2015 డిసెంబర్ మొదటి వారంలో జరిగిన నాటకీయ పరిణామాల మధ్య ఆ నిర్ణయం మారిపోయి, ట్రిబ్యునల్‌కు రిఫర్ చేయాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రం తనకు రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను సరిగా నిర్వర్తించడం లేదని తెలంగాణ బుద్ధిజీవులు బాధపడుతున్నారు.

ఒక రాష్ట్రం తనకు అంతర్రాష్ట్ర నదీజలాల విషయంలో అన్యాయం జరిగినప్పుడు తనకు న్యాయం జరుగాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించడానికి అవకాశం అంతర్రాష్ట్ర నదీవివాదాల చట్టంలోని సెక్షన్ 3 ద్వారా పార్లమెంటు కల్పించింది. ఇది రాజ్యాంగ నిర్మాతలు మన ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలకు కల్పించిన హక్కు. ఫెడరల్ వ్యవస్థలోని అంగాలైన రాష్ట్రాలకు అంతర్గతంగా సార్వభౌమాధికారాలుంటాయి, అట్లాగే ఆయా రాష్ట్రాల మధ్య భిన్న అంశాల్లో విభేదాలు ఏర్పడటం సహజమే. దేశంలోని యూనియన్ బలంగా ఉండాలంటే ఫెడరల్ వ్యవస్థ బలంగా నిలబడాలంటే, రాష్ట్రాల మధ్య ఏర్పడే విభేదాలను పరిష్కరించేందుకు అవసరమైన న్యాయపరమైన నియమాలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను నివారించేందుకు కావలసిన నిబంధనలు ఉండాలి. ఆ కారణంగానే అంతర్రాష్ట్ర నదీజలాల వినియోగానికి సంబంధించిన విభేదాలను నివారించేందుకు, పరిష్కరించేందుకు రాజ్యాంగంలో ఆర్టికల్ 262 ద్వారా చట్టం ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ, జల వివాదాలను పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు కూడా లేకుండా ఏర్పరుచవచ్చని స్పష్టంచేశారు. పార్లమెంటు ఆర్టికల్ 262 ఆధారంగా అంతర్రాష్ట్ర నదీవివాదాల చట్టం 1956 ఏర్పాటు చేసింది.

దేశంలోని ఒక సార్వభౌమ రాష్ట్రంగా ఏర్పడాలని తెలంగాణ ప్రాంతం కోరుకున్నదే తమకు జరిగిన వివక్షను సరిదిద్దుకోవాలని. ఒకవేళ ఒక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఫెడరల్ వ్యవస్థలోని ఒక అంగంగా ఆ కొత్త రాష్ట్రం తనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దమని కోరే అవకాశం లేకపోతే ఆర్టికల్ 3 ప్రయోజనం నెరవేరినట్లు కాదు. అట్లాగే ఆర్టికల్ 262 ఏర్పాటు, ఫెడరల్ వ్యవస్థను పటిష్టపరిచి రాష్ట్రాల మధ్య, కేంద్ర–రాష్ట్రాలకు మధ్య సంబంధాల్లో ఘర్షణ తగ్గించడానికి అని గ్రహించి విస్తృత ప్రాతిపదికతో చూడాలి.

నదీజలాల కేటాయింపులు, వినియోగాలపరంగా తెలంగాణకు న్యాయం జరుగాలంటే, కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్-89 ద్వారా కాకుండా అంతర్రాష్ట్ర నదీజల వివాదాల చట్టం, 1956లోని సెక్షన్-3 ద్వారా తెలంగాణకు ఒక రాష్ట్రంగా గల హక్కులను గౌరవిస్తూ ఒక కొత్త ట్రిబ్యునల్‌కు గానీ, ఇప్పుడున్న ట్రిబ్యునల్‌కు గానీ తెలంగాణ ఫిర్యాదును నివేదించాలి.

ఇప్పుడు బ్రిజేశ్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ఒక రాష్ట్రంగా, ట్రిబ్యునల్‌కు తగు గౌరవమిస్తూ, సుప్రీంకోర్టులో తమ సెక్షన్–3 పిటిషన్‌కు ఏ విధమైన ఆటంకం కలుగనంత వరకేనన్న అభ్యర్థనను చేర్చి, తన స్టేట్‌మెంట్ ఆఫ్ కేసును నివేదించింది. ఆంధ్రప్రదేశ్ కూడా తన స్టేట్‌మెంట్ ఆఫ్ కేసును నివేదించింది. తమ కౌంటర్ స్టేట్‌మెంట్లు, రిజాయండర్లు, ఇరు రాష్ట్రాలు నివేదించాయి. రెండు రాష్ట్రాలు సమర్పించిన అంశాలలో పరిష్కరించాల్సిన అంశాలను ట్రిబ్యునల్ ఖరారుచేసింది. వాటిపై ట్రిబ్యునల్ ఎదుట అసలైన వాద, ప్రతివాదనలు సెప్టెంబర్‌లో మొదలవుతాయి. వాటి పరిధి సెక్షన్–89కి సంబంధించినది. పరిమితమైంది మాత్రమే.

నదీజలాల కేటాయింపులు, వినియోగాలపరంగా తెలంగాణకు న్యాయం జరుగాలంటే, కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్–89 ద్వారా కాకుండా అంతర్రాష్ట్ర నదీజల వివాదాల చట్టం, 1956లోని సెక్షన్–3 ద్వారా తెలంగాణకు ఒక రాష్ట్రంగా గల హక్కులను గౌరవిస్తూ ఒక కొత్త ట్రిబ్యునల్‌కు గానీ, ఇప్పుడున్న ట్రిబ్యునల్‌కు గానీ తెలంగాణ ఫిర్యాదును నివేదించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర ఇంజినీర్స్ జేఏసీ సెక్రెటరీ)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పనగారియా రాజీనామా



- ఈ నెల 31 తర్వాత అమెరికా వెళ్లి తిరిగి అధ్యాపకుడిగా పాఠాలు చెబుతా
- ప్రధానికి నీతిఆయోగ్ వైస్‌చైర్మన్ లేఖ

న్యూఢిల్లీ: నీతిఆయోగ్ వైస్‌చైర్మన్ పదవికి అరవింద్ పనగారియా రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ప్రధాని మోదీకి పంపినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 31లోగా తనను నీతిఆయోగ్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించాలని ఆ లేఖలో పేర్కొన్నట్లు చెప్పారు. మంగళవారం పనగారియా విలేకరులతో మాట్లాడుతూ తన సెలవు పొడిగింపునకు అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ ఒప్పుకోలేదని ఈ నేపథ్యంలో నీతిఆయోగ్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గత రెండు నెలల కిందటే ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని వివరించారు. 40 ఏండ్ల వయస్సులో ఎక్కడైనా ఉద్యోగం సంపాదించడం సులువని, కానీ తనకు 64 ఏండ్లు ఉన్నాయని, ఈ వయస్సులో కొలంబియా యూనివర్సిటీ లాంటి సంస్థలో ఉద్యోగం సంపాదించడం కష్టమని చెప్పారు. నీతిఆయోగ్‌ను ఏర్పాటు చేసిన కొత్తలో కొన్ని ఇబ్బందులు ఉండేవని తర్వాత కార్యకలాపాలు చాలా సులువుగా సాగాయని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థలో నీతిఆయోగ్ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.



ఉష్ణతాపం.. రైతుకు శాపం

వాతావరణ మార్పులతో పెరుగుతున్న అన్నదాతల ఆత్మహత్యలు

30 ఏండ్లలో 59 వేలమంది బలవన్మరణం.. 2050 నాటికి పరిస్థితి మరింత క్లిష్టం

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

లాస్‌ఏంజిల్స్: వాతావరణ మార్పులు భారతదేశంలో రైతులపాలిట మృత్యువుగా మారుతున్నాయని అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నిర్వహించిన అధ్యయనంలో వెల్లడయింది. వాతావరణ మార్పుల కారణంగా దేశంలో గత 30 ఏండ్లలో 59వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్టు తేలింది. దేశవ్యాప్తంగా భౌగోళిక ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున రైతుల బలవన్మరణాలు మరిన్ని ఎక్కువ కావొచ్చని హెచ్చరించింది. రైతులు వ్యవసాయంలో దిగుబడులు లేక పేదరికంలో మగ్గుతున్నారని విశ్వవిద్యాలయ పరిశోధకుల సర్వేలో బయటపడింది. సాగు సీజన్‌లో సాధారణంగా 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఒకడిగ్రీ పెరిగితే దేశవ్యాప్తంగా ఒక్కరోజులో సగటున సుమారు 65 మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పరిశోధకులు తెలిపారు. ఒకవేళ రోజులో ఐదు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగితే దాని ప్రభావం ఐదింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. 'వేల మంది ప్రజలు ఇలాంటి విషాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ, తమ ప్రాణాలే తామే తీసుకుంటున్న తీరు బాధాకరం. ఆర్థిక కష్టాలతో నిరాశలో కొట్టుమిట్టాడుతున్న రైతుల కోసం ఏదో ఒకటి చేయాలి. సరైన విధానాల అమలుతో వేల మంది ప్రాణాలను కాపాడొచ్చు' అని పరిశోధకులు టమ్మా కార్లెటన్ పేర్కొన్నారు. సాగుకాలంలో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షాలు ఉంటే వార్షిక ఆత్మహత్యల రేటు ఎక్కువగా నమోదవుతున్నదని, వ్యవసాయ సీజన్ కానిసమయంలో ఆత్మహత్యల రేటుపై ఈ ప్రభావం ఉండటంలేదని సర్వేలో తేలింది. నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జర్నల్ ప్రొసీడింగ్స్‌లో ఈ అధ్యయన అంశాలను ప్రచురించారు. 1980 నుంచి ఆత్మహత్యల రేటు దాదాపు రెట్టింపుకాగా, మొత్తం 1.3 లక్షలమంది తమ ప్రాణాలు కోల్పోయినట్టు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే 75 శాతానికి పైగా చోటుచేసుకుంటుండగా, ఇందులో 1/5వ వంతు భారత్‌లోనే నమోదవుతున్నాయని చెప్పారు. 2050 నాటికి ఉష్ణోగ్రతలు మరో మూడు డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భారత్‌లో మృతుల సంఖ్య మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉన్నదని అధ్యయనం ద్వారా తేలింది. రైతు ఆత్మహత్యల నివారణ కోసం ఇప్పటికే భారతప్రభుత్వం రూ. 8,331 కోట్ల (130 కోట్ల డాలర్ల)తో పంట బీమాను తీసుకొచ్చిందని, బలవన్మరణాల తగ్గింపుపై ఇది ప్రభావం చూపుతుందా? అనే విషయం తెలియదని పరిశోధకులు చెప్పారు. కరవు పరిస్థితుల్లోనూ దేశంలోని సగానికి పైగా జనాభా వర్షాధార పంటలపై ఆధారపడి ఉపాధి పొందుతున్నదని, 1/3వ వంతు కార్మికులు అంతర్జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని పేర్కొన్నారు. అధ్యయనం కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1967 నుంచి 2013 వరకు వాతావరణ మార్పులు, సాగు విస్తీర్ణం, ఆత్మహత్యలు వంటి పూర్తి వివరాలను సేకరించినట్టు కార్లెటన్ వివరించారు.

లష్కరే టాప్ కమాండర్ ఖతం

అబూ దుజానా కాల్చివేత ■ పుల్వామా ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది హతం ■ నాలుగు గంటలపాటు సాగిన ఆపరేషన్

న్యూఢిల్లీ/శ్రీనగర్, ఆగస్టు 1:

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లష్కరే తాయిబా (ఎల్ఈటీ) టాప్ కమాండర్ అబూ దుజానా మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. పుల్వామా జిల్లాలోని హక్రిపోరా వద్ద మంగళవారం ఉదయం మిలిటెంట్లకు, భద్రతాదళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్ జాతీయుడైన అబూ దుజానా(27)తోపాటు మరో మిలిటెంట్ చనిపోయాడు. ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తుండగా ఓ ఇంట్లో మిలిటెంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో అబూ దుజానా, ఆయన అనుచరుడు ఆరిఫ్ భట్ హతమయ్యారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిత్-బాల్టిస్థాన్ ప్రాంతానికి చెందిన అబూ దక్షిణ కశ్మీర్‌లో జరిగిన పలు మిలిటెంట్ దాడుల వెనుక ప్రధాన సూత్రధారి. కశ్మీర్‌లోయలో పేరుమోసిన టెర్రరిస్టు నాయకుల్లో ఒకడైన అబూ.. లష్కరే తాయిబా చీఫ్ అబూ ఖాసీం చనిపోయిన తర్వాత దాని బాధ్యతలు చేపట్టారు.

ఫోన్ సిగ్నల్‌తో గుర్తింపు.. రాత్రంతా ఆపరేషన్

గత కొంతకాలంగా కశ్మీర్‌లోయలోని పలు ఫోన్‌నంబర్లపై నిఘా పెట్టిన సాంకేతిక బృందాలు.. సోమవారం అర్ధరాత్రి అబూ దుజానా ఫోన్ యాక్టివ్ కావడంతో అప్రమత్తమయ్యాయి. లోకేషన్‌ను గుర్తించాయి. హక్రిపొరాలోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు మాటు వేశారని, వారిలో లష్కరే తాయిబా టాప్ కమాండర్ కూడా ఉన్నట్లు సమాచారం చేరవేయడంతో భద్రతాదళాలు అప్రమత్తమయ్యాయి. వెనువెంటనే 182, 183 బెటాలియన్ల సీఆర్‌పీఎఫ్‌తోపాటు సైన్యానికి చెందిన 55 రాష్ట్రీయరైఫిల్స్ బలగాలు, స్పెషల్ ఆపరేషన్ గ్రూపులు తెల్లవారుజామున 4గంటలకు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. గతంలో 12సార్లు తప్పించుకున్న అబూ దుజానాకు ఈసారి అలాంటి అవకాశం ఇవ్వవద్దని భావించిన భద్రతా బలగాలు 4.30గంటల ప్రాంతంలో కార్డన్ సెర్చ్ ప్రారంభించాయి. లోపల నిజంగానే అబూ ఉన్నాడా అన్న అనుమానం ఉన్నప్పటికీ ఎలాంటి అవకాశం ఇవ్వవద్దని అధికారులు భావించారు. ఆయనకు స్థానికుల నుంచి బలమైన మద్దతు ఉన్నందున మరోసారి నిఘావర్గాలతో మాట్లాడి సమాచారాన్ని సరిచూసుకున్నారు. అప్పటికీ అబూ ఫోన్ యాక్టివ్‌లో ఉన్నట్లు గుర్తించిన టెక్నికల్ ఇంటలిజెన్స్ వర్గాలు అదే విషయాన్ని స్పష్టంచేశాయి. దీంతో దక్షిణ కశ్మీర్ డిప్యూటీ ఐజీ స్వయంప్రకాశ్ పాణి నేతృత్వంలో ఆపరేషన్ మొదలైంది. ముందుగా స్థానికులను అక్కడి నుంచి పంపించి ఆ ప్రాంతాన్ని నిర్మానుష్యం చేశారు. అనంతరం ఆ నివాస సముదాయంలో ఉన్నవారిని ఒక్కొక్కరుగా బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. కాల్పులను కొనసాగిస్తూనే ఎస్‌వోజీ బృందాలు ఆరుగురిని బయటకు తీసుకు వచ్చాయి. అనంతరం ఉగ్రవాదుల్ని లొంగిపోవాలని హెచ్చరించినా వినకపోవడంతో వారు తలదాచుకున్న ఇంటికి నిప్పంటించారు. ఊహించినట్లుగానే కాల్పులు జరుపుతూ బయటకు వస్తున్న ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడం పోలీసులకు సులువైంది. మంగళవారం ఉదయం 6.30కు ఆపరేషన్ పూర్తయ్యింది. కాల్పుల అనంతరం ఉగ్రవాదుల మృతదేహాలను బట్టి చనిపోయిన ఇద్దరు అబూ దుజానా, ఆయన అనుచరుడు పుల్వామాకు చెందిన ఆరిఫ్ నబీ దార్ భట్‌గా గుర్తించారు. ఏ-ప్లస్ ప్లస్ కేటగిరీ ఉగ్రవాది అయిన అబూపై రూ. 15 లక్షల నగదు రివార్డు కూడా ఉన్నది.





పుల్వామా జిల్లా హక్రిపోరాలో ధ్వంసమైన ఉగ్రవాదులు తలదాచుకున్న ఇల్లు.. ఇన్‌సెట్‌లో హతుడు అబూ దుజానా

విలాసాల కోసమే దుజానా వచ్చేవాడు: లెఫ్టినెంట్ జనరల్

అబూ దుజానా విలాసాల కోసమే కశ్మీర్‌కు వచ్చేవాడని ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సాంధూ మంగళవారం నాటి మీడియా సమావేశంలో తెలిపారు. 'అబూ దుజానా కొద్దిరోజులుగా ఏ ఆపరేషన్‌లోనూ పాల్గొనలేదు. ఒకరకంగా చెప్పాలంటే న్యూసెన్స్‌గా తయారయ్యాడు. ఆయనకు పనేమీ లేదు. అందుకే వినోదం కోసం ఇక్కడకు వచ్చేవాడు' అని సాంధూ పేర్కొన్నారు. 'ఆయన భార్యను కలిసేందుకు వచ్చాడు. ఇంతకు ముందు కూడా రెండుసార్లు ఆ ఇంటికి వచ్చినా, బలగాలు చేరుకునేలోపు వెళ్లిపోయాడు' అని సాంధూ వెల్లడించారు. పాకిస్థాన్‌లో ఉగ్రనేత సయ్యద్‌సలావుద్దీన్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపే దుజానా, కశ్మీర్‌లోని పలువురు యువతులతో సంబంధాలు నెరిపేవాడని నిఘా బృందాలు గుర్తించాయి. కొద్దినెలల క్రితం అబూ వాడిన ఐ-ఫోన్‌ను ఓ కారు నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులకు ఉగ్రవాద సంస్థల సమాచారం పుష్కలంగా దొరికింది. దీని ఆధారంగానే భద్రతాదళాలు బషీర్ లష్కరీని హతమార్చగలిగాయి.

అల్లరి మూకల రాళ్లదాడి.. కాల్పుల్లో ఒకరి మృతి

పుల్వామా ఎన్‌కౌంటర్ పూర్తికాకముందే, ఘటనాస్థలం వద్దకు చేరుకున్న అల్లరిమూకలు భద్రతాదళాల పైకి రాళ్లురువ్వడం ప్రారంభించాయి. సుమారు వందమందికి పైగా యువకులు అక్కడికి చేరుకుని నినాదాలు చేస్తూ రాళ్లు రువ్వడం ప్రారంభించారు. దీంతో వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయుగోళాలను పోలీసులు ప్రయోగించారు. అప్పటికీ ఆందోళనకారులు వెనక్కితగ్గకపోగా, అబూ దుజానా హతమయ్యాడని తెలుసుకొని రాళ్లు రువ్వడం మరింత తీవ్రంచేశారు. దీంతో భద్రతా బలగాలు పెల్లెట్లతో కాల్పులు ప్రారంభించాయి. ఈ క్రమంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పుల్వామా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే ఫిర్దౌస్ అహ్మద్ అనే యువకుడు మృతిచెందారని వైద్యులు తెలిపారు. మిగిలిన ఇద్దరు జహంగీర్ అహ్మద్, ముదాసిర్ అహ్మద్ అనే వ్యక్తులకు పెల్లెట్ గాయాలయ్యాయని వైద్యులు వెల్లడించారు. మరోవైపు ఎన్‌కౌంటర్ తర్వాత దక్షిణ కశ్మీర్‌లోని పలుచోట్ల నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. శ్రీనగర్‌లోనూ ఆందోళనకారులు రాళ్లురువ్వారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కశ్మీర్‌లోయలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది.

సైన్యానికి ఫరూక్ అబ్దుల్లా, కిరెణ్ రిజిజు అభినందన

అబూ దుజానాను హతమర్చడం గొప్ప విజయమని కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు పేర్కొన్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించినందుకు వారు సైన్యానికి అభినందనలు తెలిపారు.

17 ఏండ్లకే ఉగ్రవాదిగా..



అబూ దుజానా కోసం సైన్యం ఏడేండ్లుగా వెతుకుతున్నది. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌కు చెందిన 27 ఏండ్ల అబూ ఎక్కువకాలం కశ్మీర్‌లోనే గడిపాడు. 17వ ఏటనే లష్కరేతాయిబాలో చేరాడు. ఆయన ప్లానింగ్, అమలు చేసే పద్ధతి నచ్చి ఖాసింకు అబూను డిప్యూటీగా నియమించారు. ఖాసిం మరణించిన తర్వాత దుజానానే దక్షిణ కశ్మీర్‌లో లష్కరే బాధ్యతలు చేపట్టాడు. కశ్మీర్ లోయలో సగటున ఒక మిలిటెంట్ తుపాకీ పట్టడం ప్రారంభించాక రెండేండ్లలో హతమవుతుంటాడు. కానీ, 2010లో యాక్టివ్ అయిన అబూ ఏడేండ్లుగా భద్రతాదళాలకు చిక్కలేదు. స్థానికుల మద్దతుతో దక్షిణ కశ్మీర్‌లో లష్కరేను బలోపేతం చేశాడు. సైన్యం చేతిలో సబ్జార్ భట్ హతమైన తర్వాత కశ్మీర్‌లో ఆల్‌ఖైదా ఆపరేషన్ చీఫ్ జకీర్ మూసాతో అబూ భేటీ కావడంతో ఇంటలిజెన్స్ వర్గాలు అప్రమత్తమయ్యాయి. నిఘాను తీవ్రం చేశాయి. అయితే, లష్కరే తాయిబాలోని మిగిలిన సహచరులకు అబూ దూకుడు నచ్చలేదు. పలు బ్యాంకు దోపిడీలు చేయించడం, లష్కర్‌కు నమ్మకస్తుడైన వ్యక్తిని డబుల్ ఏజెంట్ పేర హతమార్చడం వంటివి అబూపై ఆంక్షలకు కారణమయ్యాయి.

లొంగిపోవాలని భార్య వారించినా వినకుండా..

భార్య రుఖైయా, ప్రేయసి షాజియా కోసం అబూ దుజానా తరుచూ పుల్వామా జిల్లాకు వచ్చేవాడని తెలుసుకున్న ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ రెండు ఇండ్లపైనా నిఘాను పెట్టాయి. సోమవారం అర్ధరాత్రి ఆయన భార్య రుఖైయా ఇంట్లో ఉన్నారన్న సమాచారమేరకే ఆపరేషన్ జరిగింది. ఆ సమయంలో ఇంట్లో రుఖైయాతోపాటు ఆమె తల్లిదండ్రులు కూడా ఉన్నారు. వారిని బయటకు వెళ్లాల్సిందిగా భద్రతా బృందాలు సూచించాయి. అబూ దుజానాను, మరో మిలిటెంట్‌ను లొంగిపోవాలని రుఖైయా పదే పదే అభ్యర్థించారు. అయినప్పటికీ దుజానా వినలేదు. గంటన్నరపాటు కొనసాగిన కాల్పుల తర్వాత అబూ దుజానా, ఆరిఫ్ హతమయ్యారు.

మోస్ట్‌వాంటెడ్-12లో ముగ్గురు హతం



జునైద్ మట్టూ, బషీర్ అహ్మద్

కశ్మీర్ లోయలో గడిచిన ఏడు నెలల్లో 110 మంది మిలిటెంట్లు హతమయ్యారు. 12మంది మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాను ఆర్మీ గత మేలో విడుదల చేసింది. ఈ జాబితాలో ఇప్పటివరకు ముగ్గురిని సైన్యం మట్టుబెట్టింది. వారిలో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే కమాండర్ జునైద్ మట్టూ జూన్ 16న అనంత్‌నాగ్‌లో జరిగిన కాల్పుల్లో హతమయ్యారు. ఇక లష్కరే మరో కమాండర్ బషీర్ అహ్మద్ వనీని జూలై1న డియాల్గావ్ జిల్లాలో తలదాచుకున్న ఓ ఇంటిని పేల్చిసి హతమార్చారు. ప్రస్తుతం అబూ దుజానాను కాల్చిచంపారు. వీరు ముగ్గురిని మినహాయిస్తే, ఇంకా ఆ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో హిజ్బుల్ ముజాహిద్దీన్, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ గ్రూపులకు చెందిన 9మంది ఉన్నారు. పుల్వామా జిల్లా కమాండర్ షౌకత్ తక్ అలియాస్ హుజైఫా, షోపియన్ కమాండర్ వసీంఅహ్మద్ అలియాస్ ఒసామా, మరో ఉగ్రవాది జీనత్-ఉల్-ఇస్లాం, అబూ దుజానా సహచరుడు పాకిస్థానీ ఉగ్రవాది అబూ హమాస్, జకీర్ మూసా, రియాజ్ నైకూ, కుల్గావ్ జిల్లా హిజ్బుల్ కమాండర్ అల్తాఫ్ దార్ అలియాస్ కచ్రూ మరో ఇద్దరు కీలక ఉగ్రవాదుల పేర్లు జాబితాలో మిగిలాయి. వీరిలో జకీర్ మూసా, రియాజ్ నైకూ ప్రస్తుతం చురుగ్గా ఉన్నారు. ఆదివారం పుల్వామాలో జరిగిన ఓ మిలిటెంట్ అంత్యక్రియల్లోనూ నైకూ పాల్గొన్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి.


2018 వరకు కిలో 2కు గోధుమలు, కిలో 3కు బియ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: దేశంలోని 81 కోట్ల మందికి రూ.3కు కిలో బియ్యం, రూ.2కు కిలో గోధుమల పథకాన్ని 2018 వరకు కొనసాగిస్తామని ప్రభుత్వం తెలిపింది. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం ప్రతి మూడేండ్లకోసారి ఆహార ధాన్యాల ధరలను సమీక్షించాల్సి ఉంటుందని ఆహార వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాంవిలాస్‌పాశ్వాన్ మంగళవారం లోక్‌సభలో చెప్పారు. ప్రస్తుత పథకాన్ని 2018 వరకూ కొనసాగించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ పథకం కింద గోధుమలను కిలో రెండు రూపాయలకు, బియ్యాన్ని కిలో రూ.3కు, ముతక ధాన్యాలను కిలో ఒక్క రూపాయికి సరఫరా చేస్తున్నామని చెప్పారు.



పార్లమెంట్‌కో బాక్

జీతాల పెంపుదలకు ప్రజాప్రతినిధులు అర్హులేనా?



న్యూఢిల్లీ, ఆగస్టు 1: చట్టసభల సభ్యులు సొంతంగా తమ జీతాలను పెంచుకోవడాన్ని బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ తప్పు పట్టారు. అలాగే ఆధార్ వంటి ముఖ్యమైన బిల్లులపై తీవ్రమైన చర్చ జరుగకుండా, వాటిని పార్లమెంట్ స్థాయీ సంఘానికి పంపకుండా ఆమోదించడంపై అభ్యంతరం తెలిపారు. మంగళవారం జీరో అవర్‌లో వరుణ్ మాట్లాడుతూ, ఎంపీలు, ఎమ్మెల్యేల జీతాల పెంపును నిర్ణయించేందుకు వేరే సంస్థను నియమించాలని సూచించారు. ఓవైపు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, ఎంపీలు జీతాలు పెంచాలని తరచూ డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. గత దశాబ్ద కాలంలో బ్రిటన్‌లో ఎంపీల జీతాలు 13 శాతం పెరుగగా, ఇక్కడ 400 శాతం పెరిగాయని, అందుకు వారు అర్హులేనా అని నిలదీశారు. 'గత ఏడాది కాలంలో 18వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తమిళనాడు రైతులు రుణ మాఫీ కోసం ఢిల్లీకి వచ్చి వారి మూత్రం వారే తాగి ఆందోళన చేస్తుండగా, ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలు తమ జీతాలను రెట్టింపు చేసుకున్నారని అన్నారు. సభా సమావేశాలు తగ్గిపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. 1952లో లోక్‌సభ ఏడాదికి 123 రోజులు సమావేశమైతే అది 2016లో 75 రోజులకు తగ్గిపోయిందని గుర్తు చేశారు.

గ్యాస్ ధర పెంపుపై స్తంభించిన పార్లమెంట్

- రాజ్యసభ వాయిదా.. లోక్‌సభలో విపక్షం వాకౌట్
- యూపీఏ నిర్ణయాన్నే అమలు చేస్తున్నామన్న మంత్రి



రాజ్యసభలో వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాల సభ్యులు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: వంటగ్యాస్ ధరను క్రమంగా పెంచుతూ, మార్చి నాటికి సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయాలన్న ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు మంగళవారం పార్లమెంట్‌లో పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి. రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులందరూ ఐక్యమై గందరగోళం సృష్టించడంతో సభ మధ్యాహ్నం వరకు వాయిదా పడింది. లోక్‌సభలో సైతం సభ్యులు జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. సబ్సిడీపై సరఫరా చేస్తున్న వంటగ్యాస్ ధరను ప్రతీనెలా పెంచుతూ మార్చి నాటికి సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం సోమవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభలో కాంగ్రెస్, సమాజ్‌వాది, తృణమూల్, బీఎస్పీ, వామపక్షాల సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణిస్తూ, 2010లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్నే తాము అమలు చేస్తున్నామని చెప్పారు. సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసేలా చిన్న మొత్తాల్లో ధరలు పెంచాలని యూపీఏ ప్రభుత్వమే నిర్ణయించిందని అన్నారు. లోక్‌సభలో జీరో అవర్ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రభుత్వవైఖరిని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులందరూ వాకౌట్ చేశారు.

నోట్ల రద్దుపై నిలదీసిన ప్రతిపక్షం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: నోట్ల రద్దుపై ప్రతిపక్షాలు మంగళవారం లోక్‌సభలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించాయి. అనుబంధ డిమాండ్లపై జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, ఇప్పటివరకు రద్దయిన పెద్ద నోట్లు బ్యాంకుల్లో ఎన్ని డిపాజిట్ అయ్యాయని, కొత్తగా ఎన్ని నోట్లు ముద్రించారని, నల్లధనం ఏ మేరకు బయటపడిందని ప్రశ్నించారు. నోట్ల రద్దు నిర్ణయం 'వేగంగా వెళుతున్న కారు టైరును తుపాకీతో కాల్చినట్టు'గా ఉందని ఆయన అభివర్ణించారు.

కంపెనీలు ఆహార ప్యాకెట్లపై 'బెస్ట్ బిఫోర్' ముద్రించాలి

కొద్దికాలం మాత్రమే నిల్వ ఉండగల ఆహార పదార్థాల ప్యాకెట్లపై 'బెస్ట్ బిఫోర్ (నిర్దిష్ట తేదీలోగా తినాలి)' అన్న హెచ్చరికను కంపెనీలు ముద్రించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ వస్తువులు) నిబంధనలు 2011లో కొత్త నిబంధనను చేర్చామని వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రి సీఆర్ చౌదరి లోక్‌సభకు తెలిపారు. దేశంలో 2014 నుంచి 2016 మధ్యకాలంలో 288 పరువు హత్యలు జరిగాయని ప్రభుత్వం తెలిపింది. అలాగే 2016లో దేశవ్యాప్తంగా 35 దేశద్రోహం కేసులు నమోదయ్యాయని పేర్కొంది. వీటిలో అత్యధికంగా హర్యానాలో 12, ఉత్తరప్రదేశ్‌లో ఆరు, కర్నాటక, కేరళల్లో మూడు చొప్పున తెలంగాణ, మహారాష్ట్రలో ఒక్కో కేసు నమోదైందని తెలిపింది. దేశంలో పలు సామాజిక మాధ్యమాలకు చెందిన 652 వెబ్‌సైట్లను రద్దు చేశామని ప్రభుత్వం తెలిపింది.

సిలిండర్‌పై రూ.2 వడ్డింపు

ఆగస్టు నెలకు ధర సవరించిన కేంద్రం

న్యూఢిల్లీ: గ్యాస్‌బండ మరింత భారం కానున్నది. సబ్సిడీలను ఎత్తివేయాలని భావిస్తున్న కేంద్రం 14.2కిలోల వంటగ్యాస్ సిలిండర్ల ధరను ఇకనుంచి ప్రతినెలా రూ.4 చొప్పున పెంచనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో తాజాగా మంగళవారం సిలిండర్ ధరను రూ.2 పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. క్రమంగా సబ్సిడీలను కుదిస్తూ వచ్చే మార్చ్ వరకు పూర్తిగా ఎత్తివేయాలని భావిస్తున్న ప్రభుత్వం ఇప్పటికే నెలకు రూ.2 చొప్పున ధర పెంచాలని ఆయిల్ కంపెనీలను ఆదేశించింది.ఆ ప్రకారం గత ఏడాది జూలై నుంచి ఎల్పీజీ సిలిండర్ దర ప్రతినెలా రెండు రూపాయలు పెరుగుతూ వచ్చింది. ఇకపై దానిని నాలుగు రూపాయలకు పెంచనున్నది. ఇదే విషయాన్ని సోమవారంనాడు లోక్‌సభలో స్పష్టంచేసిన ప్రభుత్వం మంగళవారం ఆగస్టు నెల ధరను సవరించింది. సిలిండర్‌పై రూ.2 పెంచుతున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్‌నుంచి ధర సవరణ రూ.4గా పెరుగనున్నది. పెరిగిన ధరల భారం 18.11 కోట్లమంది గ్యాస్ వినియోగదారులపై పడనుంది.

నితీశ్ ఓ పల్టూరామ్!

- అధికారం కోసం అర్రులు చాస్తున్నారు
- నితీశ్‌పై ఆర్జేడీ చీఫ్ లాలూ ఫైర్



న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌పై ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ మరోసారి నిప్పులు చెరిగారు. ఫిరాయింపుల్లో నితీశ్ మాస్టర్ అని, తన ప్రయోజనం కోసం ఒక శిబిరం నుంచి మరో శిబిరానికి కప్పదాట్లు చేస్తుంటారని పేర్కొంటూ.. ఆయనో పల్టూరామ్ అని లాలూ ఎద్దేవా చేశారు. 'నితీశ్ ఫిరాయింపుదారు. ఆయన రాజకీయ ద్రోహి కూడా. ఆయన ఇప్పటికే అనేకసార్లు పార్టీలు మార్చారు. అధికారం కోసం ఆయన కేంద్రానికి విధేయత చూపుతున్నారు' అని లాలూ మంగళవారం మీడియాతో తెలిపారు. మహాకూటమికి గండికొట్టి ప్రధాని నరేంద్రమోదీతో చేతులు కలుపడమే ఇందుకు తాజా ఉదాహరణ అని పేర్కొన్నారు. చాలా కాలంగా ఇలా పార్టీలకు వెన్నుపోటు పొడుస్తున్న కారణంగా నితీశ్ ప్రజల విశ్వాసాన్ని క్రమేణా కోల్పోతున్నారని లాలూ చెప్పారు. ఇదిలావుండగా 'రాష్ట్రంలో ఇసుక మాఫియాకు లాలూ ప్రసాద్ ఏవిధంగా సహకరించారు. ఇసుక మాఫియా నుంచి ఆయన పార్టీకి ఏ విధంగా నిధులు అందాయి. తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తా' అని బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ అన్నారు.

నితీశ్ కేసులో వాదనలు వింటాం: సుప్రీం

న్యూఢిల్లీ: బీహార్ సీఎం నితీశ్‌కుమార్ శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వాదనలను వింటామని సుప్రీంకోర్టు తెలిపింది. 1991లో జరిగిన బార్హ్ లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు సీతారాం సింగ్ హత్యకు గురయ్యాడని, మరో నలుగురు గాయపడ్డారని పిటిషనర్ తరపు న్యాయవాది ఎంఎల్ శర్మ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ హత్యలో నితీశ్‌కుమార్ ప్రమేయం ఉన్నదని, ఈ నేపథ్యంలో ఆ కేసు తిరుగతోడాలని కోరారు. నితీశ్‌కుమార్‌పై కేసు నమోదు చేసేలా సీబీఐని ఆదేశించాలన్నారు.



పాక్ ప్రధానిగా అబ్బాసీ ఎన్నిక

ఇస్లామాబాద్, ఆగస్టు 1: పాకిస్థాన్ ప్రధానమంత్రిగా షాహిద్ ఖఖ్వాన్ అబ్బాసీని ఆ దేశ జాతీయ అసెంబ్లీ ఎన్నుకున్నది. పనామా పత్రాల లీక్ (అక్రమాస్తుల) కేసులో ప్రధానిగా నవాజ్‌షరీఫ్‌పై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేయడంతో ఆయన స్థానే అబ్బాసీ ప్రధాని ఎన్నికయ్యారు. మంగళవారం జాతీయ అసెంబ్లీలో ప్రధాని పదవికి జరిగిన ఎన్నికలో అధికార పాకిస్థాన్ ముస్లిం లీగ్ (పీఎంఎల్ – ఎన్) పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అబ్బాసీకి 221 ఓట్లు, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అభ్యర్థి నవీద్ ఖామర్‌కు 47, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్‌కు 33, జమాత్ ఏ ఇస్లామీ అభ్యర్థిని తారిఖుల్లాకు కేవలం నాలుగు ఓట్లు వచ్చాయి. ప్రధానిగా సభనుద్దేశించి మాట్లాడాలని అబ్బాసీని స్పీకర్ సాదిఖ్ కోరారు. ఈ సందర్భంగా అబ్బాసీ మాట్లాడుతూ షరీఫ్‌పై సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టారు. షరీఫ్ ఇంటి బాట పట్టాల్సి వచ్చినా.. ఇప్పటికీ ప్రజల ప్రధానేనని అభివర్ణించారు. తర్వాత అధ్యక్ష నివాసంలో ప్రధానిగా అబ్బాసీతో దేశాధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ప్రమాణం చేయించారు.

శెహబాజ్ షరీఫ్ వచ్చేవరకే అబ్బాసీ

పంజాబ్ సీఎం, నవాజ్ షరీఫ్ సోదరుడు శెహబాజ్ షరీఫ్ జాతీయ అసెంబ్లీకి సభ్యుడిగా ఎన్నికయ్యే వరకు మాత్రమే అబ్బాసీ తాత్కాలిక ప్రధానిగా ఉంటారు. ఆ తర్వాత శెహబాజ్‌ను పాక్ జాతీయ అసెంబ్లీ ప్రధానిగా ఎన్నుకోనున్నది.

'నోటా'పై దద్దరిల్లిన రాజ్యసభ

ఈసీ నిర్ణయంపై విపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ: రాజ్యసభకు జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేల కోసం 'నోటా' ఆప్షన్ ఇవ్వడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిరాయింపుదారుల సౌలభ్యం కోసమే కేంద్రం ఒత్తిడి మేరకు ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నదని కాంగ్రెస్, ఇతర పక్షాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ ఈ అంశాన్ని లేవనెత్తారు. 'ఇది ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడమే అవుతుంది. పెద్దల సభకు జరిగే ఎన్నికల్లో ఏకపక్షంగా 'నోటా' ఆప్షన్ పెట్టేశారు. రాజ్యాంగాన్ని సవరించకుండా, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించకుండా ఎలా చేస్తారు?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ సమాధానమిస్తూ.. 'నోటా అమలుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. మా ప్రభుత్వం ఏర్పడడానికన్నా ముందే ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి' అని తెలిపారు.



ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టిన పెనాల్టీ పాయింట్ల విధానం గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం మొదలైంది. ఇందులో భాగంగా ఇందిరాపార్క్ సమీపంలోని అశోక్‌నగర్ చౌరస్తాలో హెల్మెట్ లేకుండా వాహనంపై వెళ్తున్న వారి ఫొటో తీస్తున్న ఓ ట్రాఫిక్ పోలీస్.

ఫొటో: జీ భాస్కర్

జీరో పాయింట్లతో వెళ్లండి.. హీరోగా ఉండండి

వాహనదారులకు ట్విట్టర్‌లో డీజీపీ అనురాగ్‌శర్మ సూచన





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై మంగళవారం నుంచి పోలీసులు అమలుచేస్తున్న 12 పాయింట్ల పెనాల్టీ విధానంపై డీజీపీ అనురాగ్‌శర్మ స్పందించారు. ట్విట్టర్‌లో వాహదారులకు సందేశం ఇచ్చారు. నిబంధనలు పాటిస్తూ 'జీరో పాయింట్లతో వెళ్లండి.. హీరోగా ఉండండి'.. అంటూ తన సందేశంలో సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు ఉల్లంఘనలపై పాయింట్లతో కొలమానం మొదలుపెట్టారు. నిబంధనల ఉల్లంఘనలతో 12 పాయింట్లు దాటితే లైసెన్స్ రద్దు చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ ఉల్లంఘనల్లో 13 అంశాలను ప్రధానంగా తీసుకున్నారు. ఉల్లంఘన తీవ్రతను బట్టి పాయింట్లను నిర్ణయించారు. ఉల్లంఘనలతో రెండేండ్లలో 12 పాయింట్లు దాటిన వాహనదారుడిపై చర్యలు తీసుకుంటారు. వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటించేందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు. డీజీపీ తన సందేశంలోనూ ఇదే విషయాన్ని వెల్లడించారు. 'జీరో పాయింట్లు మెయింటేన్ చేస్తూ హీరోగా ఉండండి.. 12 పాయింట్ల పెనాల్టీ విధానం ఈ రోజు నుంచి అమలులోకి వచ్చింది' అని పేర్కొన్నారు.

ఆకలితో ఉన్నవారికి.. అన్నపూర్ణే!

- రూ.5 భోజన పథకంపై ఏపీ అధికారుల ప్రశంస



జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో సమావేశమైన ఏపీ అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో విజయవంతంగా అమలవుతున్న రూ.5 భోజన పథకం 'అన్నపూర్ణ'పై అధ్యయనం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అధికారుల బృందం మంగళవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి చేరుకొని కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డితో సమావేశమైంది. తిరుపతి, విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, శ్రీకాకుళం, కడప, ఒంగోలు తదితర నగరాల మున్సిపల్ కమిషనర్లు ఈ బృందంలో ఉన్నారు. ఏపీలో కూడా వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇటువంటి పథకాన్ని అమలుచేసేందుకు తమ ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకే ఇక్కడ అమలవుతున్న అన్నపూర్ణ పథకాన్ని అధ్యయనం చేసేందుకు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో 150 కేంద్రాలు కొనసాగుతున్నాయని, వేలమంది భోజనం చేస్తున్నారన్నారు. ఈ పథకానికి జీహెచ్‌ఎంసీ రూ.39 కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం అధికారుల బృందం నగరంలో అమలవుతున్న భోజన కేంద్రాలను, హరే కృష్ణ ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు.

'స్వచ్ఛ' పోటీ విజేత హసీనాబేగం

- చెత్తను వేరు చేసినందుకు రూ.లక్ష బహుమతి
- ఆన్‌లైన్ డ్రాలో ఎంపికచేసిన జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెత్తను తడి, పొడిగా వేరుచేసే గృహిణులకు ప్రోత్సాహకంగా అందించే రూ.లక్ష నగదు బహుమతిని మొట్టమొదటిసారిగా సంతోష్‌నగర్ సర్కిల్‌లోని తలాబ్‌చెంచలం ప్రాంతానికి చెందిన హసీనాబేగం దక్కించుకున్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన ఆన్‌లైన్ డ్రాలో ఆమె ఎంపికయ్యారు. నగర పరిధిలో తడి, పొడి చెత్తను విడదీసేవారికి ప్రతినెలా ప్రోత్సాహకంగా రూ.లక్ష ఇస్తామని జీహెచ్‌ఎంసీ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా స్వచ్ఛదూత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రతిరోజూ తడి, పొడి చెత్తను విడదీసి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 2,903 మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, వీరిలో 968 మంది తడి, పొడి చెత్తను విడదీసి ఫొటోలను అప్‌లోడ్ చేశారని అధికారులు పేర్కొన్నారు. జూలై నెలలో అప్‌లోడ్ అయిన ఫొటోల్లో నుంచి ఆన్‌లైన్లో డ్రా తీయగా హసీనాబేగం ఎంపికయ్యారు. దీంతో ఈ పోటీలో ఆమె మొట్టమొదటి విజేతగా నిలిచారు. డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్ హసీనాబేగంకు ఫోన్‌చేసి బహుమతి గెల్చుకున్న విషయాన్ని చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్, కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను విడదీయడంవల్ల దాదాపు 75 శాతం చెత్త పునర్వినియోగమవుతుందన్నారు. ఈ దిశగా గృహిణులను ప్రోత్సహించేందుకే ప్రతినెలా ఒకరిని ఎంపికచేసి రూ.లక్ష బహుమతి ఇస్తున్నట్టు వారు వివరించారు.

ఆస్తిపన్ను చెల్లించినవారికి బహుమతులు

ప్రస్తుత ఏడాదిలో బకాయిలు లేకుండా ఆస్తిపన్ను చెల్లించినవారిలో 140 మందిని డ్రా ద్వారా ఎంపికచేశారు. కూకట్‌పల్లికి చెందిన ఎం రామసూర్య ప్రకాశం రూ.50 వేల బంపర్ బహుమతిని, అదే ప్రాంతానికి చెందిన కే జితేంద్రకుమార్ రూ.25 వేల ప్రథమ బహుమతిని గెలుచుకోగా, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్‌కు చెందిన పుష్పమ్మ, సరస్వతి తృతీయ బహుమతి కింద రూ.12,500 చొప్పున గెలుచుకున్నారు. వీరితోపాటు ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించినవారిలో 25 మందిని రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులకు ఎంపికచేశారు.

నకిలీ పత్రాలతో బ్యాంక్‌కు 31 కోట్లు టోకరా

ఇద్దరిని అరెస్ట్ చేసిన చందానగర్ పోలీసులు

చందానగర్, నమస్తే తెలంగాణ: నకిలీ పత్రాలతో సంస్థలను స్థాపించి బ్యాంక్‌ను బురిడీ కొట్టించిన వ్యవహారంలో ఫోర్జరీకి పాల్పడ్డ ఇద్దరిని హైదరాబాద్‌లోని చందానగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, సాయికిరణ్ స్నేహితులు. దుర్గాప్రసాద్ ఐఎన్జీ వైశ్య బ్యాంక్‌లో, సాయికిరణ్ సీటీవో కార్యాలయంలో బ్రోకర్‌గా పని చేస్తున్నారు. ఈ ఇద్దరూ మహేందర్ ఖత్రి అనే వ్యక్తితో జత కలిశారు. ఈ ముగ్గురూ కలిసి ఇతరుల పేరు మీద రెంటల్ అగ్రిమెంట్లను సృష్టించారు. వాటి ద్వారా పలు సంస్థలను ఏర్పాటు చేశారు. ఆ సంస్థల పేరిట చందానగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఖాతాలను తెరిచారు. ఆ ఖాతాల ద్వారా మహేందర్ ఖత్రి దాదాపు రూ.31.06 కోట్లు రుణంగా తీసుకుని, వాటిని విదేశాలకు తరలించాడు. ఈ వ్యవహారంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు మహేందర్ ఖత్రిని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అతనికి సహకరించి నకిలీ పత్రాలను సృష్టించిన అభియోగాలపై దుర్గప్రసాద్, సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు దుర్గాప్రసాద్, సాయికిరణ్

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

మణికొండ/అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ: నగరంలోని వేర్వేరు చోట్ల గంజాయి విక్రయిస్తున నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా కార్వాన్ లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన నెక్కిల్లొల్ల మల్లేశ్(25) గండిపేట మండలం కిస్మత్‌పురలో ఉంటున్నాడు. లంగర్‌హౌస్ లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన ఓంప్రకాష్ పండిత్(28)తో కలిసి కొన్నిరోజులుగా గంజాయి విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం బండ్లగూడ కింగ్స్ బార్ ఫీరం చెరువు రహదారి పక్కన గంజాయి విక్రయిస్తుండగా దాడి చేసి నిందితులిద్దరినీ పట్టుకున్నారు. విచారణ నిమిత్తం నార్సింగి పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారి నుంచి రూ.92,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు, 1,700 గ్రాముల గంజాయి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ఘటన సనత్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ 1267కు చెందిన మహ్మద్ జహంగీర్, శక్తి రాజేశ్వరి దంపతులను సనత్‌నగర్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సనత్‌నగర్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పూల వ్యాపారం చేసుకునే జహంగీర్, శక్తి రాజేశ్వరి కొంత కాలంగా గంజాయి సరఫరా చేస్తున్నారు. ఈ వ్యాపారంలో రాజేశ్వరి కుమారుడు(12) సోమవారం గంజాయి అమ్ముతుండగా పోలీసులు అరెస్ట్ చేసి జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపర్చి బాల నేరస్తుల కేంద్రానికి పంపించారు. పరారీలో ఉన్న జహంగీర్, రాజేశ్వరిని మంగళవారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.



సనత్‌నగర్‌లో గంజాయి నిందితులు జహంగీర్, రాజేశ్వరిని మీడియాకు చూపుతున్న దృశ్యం

మట్కా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మట్కా, గుడుంబా దందాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న పాత నేరస్తుడు కుక్కల మహేశ్‌పై మంగళవారం రాచకొండ సీపీ మహేశ్‌భగవత్ పీడీ యాక్ట్‌ను విధించారు. మహేశ్‌పై ఇప్పటి వరకు మొత్తం 11 కేసులు నమోదయ్యాయి. చాలా కేసుల్లో అతను జైలుకు వెళ్లినా, పలు కేసుల్లో శిక్షను అనుభవించినా ప్రవర్తనలో మార్పురాలేదు. దీంతో అతనిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు.



కుక్కల మహేశ్

గ్రేటర్‌లో డబుల్ జోరు

99 స్థలాల్లో 68,720 ఫ్లాట్ల నిర్మాణమే లక్ష్యం.. 2018 జూన్ నాటికి పూర్తి.. 25 స్థలాల్లో వేగంగా కొనసాగుతున్న పనులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/ మేడ్చల్, నమస్తే తెలంగాణ/ మన్సూరాబాద్:

గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నది. లక్ష ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటికే 99 స్థలాల్లో 68,720 ఫ్లాట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్‌నాటికి నిరుపేదలు గృహప్రవేశం చేయనున్నారు. గ్రేటర్‌లో డబుల్ ఇండ్ల కోసం 106 స్థలాల్లోని 428.02 ఎకరాలను గుర్తించి, వాటిలో 85 స్థలాలు అనుకూలంగా ఉన్నట్టు తేల్చారు. వీటికి అదనంగా రెవెన్యూశాఖ 15 స్థలాలను ఇచ్చింది. 13 రైల్వే స్థలాలు సహా మరో 25 స్థలాల కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. కొన్ని బస్తీల్లో నివసిస్తున్న వారికి అక్కడే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు బస్తీవాసులను ఖాళీ చేయించే ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఇండ్ల నిర్మాణం కొనసాగుతున్న ప్రాంతాలు

సింగం చెరువు, సయ్యద్‌సాబ్‌కాబాడ, జంగమెట్, ఎరుకల నాంచారమ్మ కాలనీ, కిడికిబూద్‌ఎలిసా, జీవైరెడ్డి కాంపౌండ్, బండమైసమ్మ, చిత్తారమ్మ బస్తీ, ఇందిరానగర్ (ఖైరతాబాద్), లంబాడితండా, అంబేద్కర్‌నగర్(రాంగోపాల్‌రావుపేట), గోడెకి ఖబర్/కట్టెలమండి, అహ్మద్‌గూడ, డీ పోచంపల్లి, కైతలాపూర్, బహదూర్‌పల్లి, చిలకలగూడ, దోబీఘాట్, ఏసీఎస్ నగర్, మురహరిపల్లి, శ్రీరాంనగర్, చైతన్యనగర్, బాగ్‌హయత్‌నగర్, అమీన్‌పురా, గాజులరామారం. వీటిలో సింగంచెరువు తండాలో నిర్మాణాలను 2017 అక్టోబర్ నాటికి, ఎరుకల నాంచారమ్మనగర్, సయ్యద్‌సాబ్‌కాబాడ ప్రాంతంలో 2018 జనవరి నాటికి పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నారు. మిగిలినవాటిని 2018 జూన్ నాటికి పూర్తి చేయనున్నారు.

నాంచారమ్మకాలనీలో వేగంగా..

నాగోల్ డివిజన్ ఎరుకల నాంచారమ్మ కాలనీలో మన్సూరాబాద్ నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తాకు వెళ్లే మార్గంలో 1.1 ఎకరాల్లో 288 ఫ్లాట్లు నిర్మించనున్నారు. వీటిని 9 అంతస్తులుగా, రెండు బ్లాకులుగా ప్లాన్ చేశారు. ఏ బ్లాక్‌లో 218, బీ బ్లాక్‌లో 72 వంతున ఫ్లాట్లు ఉన్నాయి. ఏ బ్లాక్‌లో సెల్లార్‌పైన స్లాబ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడు రోజుల్లో సెల్లార్ స్లాబ్ పూర్తికానున్నది. బీ బ్లాక్‌లో పిల్లర్ల నిర్మాణం కొనసాగుతున్నది. ఒక్కో ఇల్లు 560 చదరపు అడుగులు ఉండి, కిచెన్, రెండు బాత్‌రూమ్‌లు, రెండు టాయ్‌లెట్లు ఉండనున్నాయి. వెంటిలేషన్ కోసం 6 మీటర్ల చొప్పున సెట్‌బ్యాక్‌ను వదులుతున్నారు. ఎరుకల నాంచారమ్మకాలనీకి చెందిన 168 కుటుంబాలకు ఇందులో ఇండ్లు కేటాయించనున్నారు.

మేడ్చల్ నియోజకవర్గంలో జోరుగా..

మేడ్చల్ నియోజకవర్గంలో డబుల్ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో మొదటి దశలో 2016-17 సంవత్సరంలో 1,050 ఇండ్లు మంజూరయ్యాయి. మేడ్చల్ మండలానికి 148, శామీర్‌పేటకు 280, కీసరకు 140, ఘట్‌కేసర్ (మేడిపల్లి, బోడుప్పల్‌తో కలిపి) 482 ఇండ్లను కేటాయించారు. ప్రస్తుతం ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రెండో విడుత 2017-18లో వెయ్యి ఇండ్లు మంజూరు కాగా అందులో మేడ్చల్‌కు 228, శామీర్‌పేటకు 240, కీసరకు 200, ఘట్‌కేసర్‌కు 234, మేడిపల్లికి 98 ఇండ్లను కేటాయించారు. శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో నాలుగు ఎకరాల్లో 40 ఇండ్లు నిర్మిస్తుండగా, అందులో 9 ఇండ్లు చివరి దశకు చేరుకున్నాయి. కీసరలో జీ+1 అంతస్తుతో రెండెకరాల్లో నిర్మిస్తున్న 50 ఇండ్లు, చీర్యాలలో రెండు ఎకరాల్లో 50 ఇండ్లు, యాద్గార్‌పల్లిలో రెండెకరాల్లో 40 ఇండ్ల పనులు జరుగుతున్నాయి. మేడ్చల్ నగర పంచాయతీ పరిధిలోని కిష్టాపూర్ వద్ద నాలుగెకరాల్లో జీ+1 అంతస్తుతో నిర్మిస్తున్న 120 ఇండ్లకు పిల్లర్లు వేస్తుండగా, మండలంలోని సోమారం గ్రామంలో రెండెకరాల్లో నిర్మిస్తున్న 28 ఇండ్లకు కూడా పిల్లర్ల పనులు నడుస్తున్నాయి. బోడుప్పల్‌లో ఎకరం స్థలంలో 74 ఇండ్లను జీ+2 అంతస్తులతో నిర్మించే ఇండ్లు ప్రాథమిక దశలో ఉండగా ఫిర్జాదిగూడలో ఎకరం స్థలంలో 74 ఇండ్లను జీ+2 అంతస్తులుగా నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్టలో ఎకరం స్థలంలో 50 ఇండ్లను జీ+2 అంతస్తులతో నిర్మించడానికి భూమి పూజ జరిగింది. మేడిపల్లి మండలంలోని పర్వతాపూర్‌లో ఎకరన్నర స్థలంలో 40 ఇండ్లను జీ+1గా నిర్మించడానికి భూమి పూజచేశారు.





ఇండ్ల పురోగతి ఇలా..

	స్థలాలు	ఫ్లాట్లు
ప్రతిపాదన	99	68,720
టెండర్లు పూర్తయినవి	88	59,464
టెండర్ దశలో ఉన్నవి	11	9,256
పనులు జరుగుతున్నవి	25	14,048

నాగోల్ డివిజన్ నాంచారమ్మకాలనీలో నిర్మాణంలో ఉన్న ఏ-బ్లాక్.. (ఇన్‌సెట్) మేడ్చల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ఇండ్ల పనులు

రియల్ బ్రోకర్ల బరితెగింపు

స్థల యజమానులు చనిపోయినట్టు నకిలీ పత్రాలు సృష్టించి భూములకు డబుల్ రిజిస్ట్రేషన్.. 9 మంది అరెస్ట్





ఎల్‌బీనగర్‌లో ముఠా వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్.. (ఇన్‌సెట్) బాధితులు నాగేశ్‌రావు, జ్యోతి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ముఠా ఒకటి బరితెగించింది. తొమ్మిది మంది కుమ్మక్కై స్థల యజమానులు బతికుండగానే చనిపోయారని నకిలీ పత్రాలు సృష్టించారు. అందులో ఒకడిని వారసుడని పేర్కొంటూ నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ సంపాదించి 200 గజాల స్థలాన్ని అమ్మేశారు. ఆ స్థలం అసలు యజమాని తన ప్లాట్‌ను చూసేందుకు వెళ్లగా.. ఇది ఎప్పుడో అమ్మేశారని స్థానికులు చెప్పడంతో ఖంగుతిన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి సెర్చ్ ఈసీ తీయగా తాను, తన భార్య చనిపోయారంటూ నమోదైన పత్రాలను చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే విషయాన్ని రాచకొండ సీపీ దృష్టికి తీసుకురావడంతో మొత్తం డొంక కదిలింది. ఈ కేసులో 9 మంది ముఠా సభ్యులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంపు కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూర్‌లోని సర్వే నం-242, 245, 246,247లోని ప్లాట్ నం.261లో 200 గజాల స్థలాన్ని కస్టమ్స్ విభాగానికి చెందిన మాజీ సూపరింటెండెంట్ వీ నాగేశ్‌రావు 1989లో కొనుగోలు చేసి తన భార్య జ్యోతి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. కుంట్లూర్‌లో ప్రస్తుతం భూముల ధరలు పెరుగడంతో రియల్ బ్రోకర్ల కన్ను జ్యోతికి చెందిన స్థలంపై పడింది. 2015లో కుంట్లూర్‌కు చెందిన బ్రోకర్లు బాల్‌రాజు, సురేశ్ సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో రియల్ ఎస్టేట్ ఏజెంట్ శ్రీధర్‌రెడ్డిని కలిశారు. జ్యోతితోపాటు ఆమె భర్త చనిపోయారని, ప్రస్తుతం ఆ స్థల యజమానులు ఎవరూ లేరని చెప్పారు. ప్లాట్‌కు సంబంధించిన జిరాక్స్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని, నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ అమ్మి ఆదాయాన్ని పంచుకోవాలని ప్లాన్ చేశారు. స్థల యజమాని జ్యోతి, ఆమె భర్త నాగేశ్‌రావు డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను తీసుకురావాలని శ్రీధర్‌రెడ్డి సూచించాడు. దీంతో సురేశ్, బాల్‌రాజు జీహెచ్‌ఎంసీ సర్కిల్-9 బిల్ కలెక్టర్ వినయ్‌కుమార్‌ను సంప్రదించి విషయం వివరించారు. వారితో చేతులు కలిపిన వినయ్‌కుమార్.. 2006 మే 6న జ్యోతి, 2004 ఆగస్టు 15న నాగేశ్‌రావు చనిపోయినట్టు నకిలీ డెత్ సర్టిఫికెట్లను తయారు చేశాడు. వీరి వారసుడిగా సురేశ్ పేరుమీద ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను కూడా రూపొందించాడు. శ్రీధర్‌రెడ్డి ఈ సర్టిఫికెట్లతో హయత్‌నగర్ ఎస్‌ఆర్‌వో ఆఫీసులో దరఖాస్తు చేసి స్థలానికి సంబంధించిన సర్టిఫైడ్ కాపీలను తీసుకున్నాడు. ఈ కాపీలతో శ్రీధర్‌రెడ్డి, బాలరాజ్, సురేశ్, వినయ్‌కుమార్ కలిసి 'లడ్డు' పేరు మీద ఓ జీపీఏను సృష్టించారు. శ్రీధర్‌రెడ్డి ఈ జీపీఏ ద్వారా మధ్యవర్తి భూపాల్‌రెడ్డి సాయంతో సంజీవ్‌కుమార్ సింగ్ అనే వ్యక్తికి రూ.5 లక్షలకు ప్లాట్‌ను అమ్మేశారు. ఈ డబ్బును పైన పేర్కొన్న నలుగురితోపాటు, డాక్యుమెంట్ రైటర్, సాక్షులుగా సంతకాలు పెట్టిన వారు పంచుకున్నారు. నాగేశ్‌రావు ఫిర్యాదుమేరకు రంగంలోకి దిగిన పోలీసులు చల్లా శ్రీధర్‌రెడ్డి, మొగల్పు సురేశ్, ఆస్కా వినయ్‌కుమార్, కుంచలంటి లడ్డు, చిత్రాల జగదీశ్, ముత్యాల గోపీనాథ్, హరికృష్ణ, బద్దం భూపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. సురేశ్, వినయ్‌కుమార్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉన్నారు. వీరిద్దరిపై గతంలో పలు ఫోర్జరీ కేసులు ఉన్నాయి. మిగతా ఏడుగురిని మంగళవారం జైలుకు పంపారు. ఈ ముఠా ఇదే సర్వే నంబర్‌లో మరో రెండు ప్లాట్లను కూడా ఇదేవిధంగా డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ ముఠా చేసిన రిజిస్ట్రేషన్లు రద్దు కానున్నాయి. ఈ ముఠాకు సబ్‌రిజిస్ట్రార్‌కు ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలోనూ విచారిస్తున్నామని సీపీ చెప్పారు. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు.

డ్రగ్స్ ప్రభావం.. నివారణపై అవగాహన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించుకోవటం, అలవాటును వదిలించుకోవడం ఎలాగో వివరించేందుకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) 'ప్రివెన్షన్ ఆఫ్ డ్రగ్ అబ్యూస్' పేరుతో బుధవారం నుంచి మూడ్రోజులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. బంజారాహిల్స్ రోడ్ నంబర్-3లోని ఏఎస్‌సీఐ ఆడిటోరియంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్, తెలంగాణ ప్రభుత్వం సహకారంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన టీచింగ్ ఫ్యాకల్టీకి నిపుణులు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ టీ పాపిరెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఏ వాణీప్రసాద్, కాకతీయ వర్సిటీ వీసీ కే సాయన్న, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొంటారని ఏఎస్‌సీఐ సెంటర్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బీ లక్ష్మి తెలిపారు.

5న ఓయూలో ఎన్టీపీసీ ఎలక్ట్రాన్ క్విజ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 5న ఎలక్ట్రాన్ క్విజ్-2017ను నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) నిర్వహించనున్నది. కార్పొరేట్ బిజినెస్, న్యూస్ ఈవెంట్లు, జీకే, సినిమాలు, ఎంటర్‌టైన్‌మెంట్, క్రీడలు అనే అంశాలపై దక్షిణ భారతదేశంలోని ఇంజినీరింగ్ కళాశాలలు, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూళ్లు, ప్రొఫెషనల్ కేంద్రాలు తమ రెండుజట్లను పోటీలకు పంపవచ్చు. విజేతల జట్టుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.30 వేలు, రూ.20 వేలు, రూ10వేలు అందజేస్తారు. ఆసక్తి ఉన్న సంస్థలు elbertc10@gmail.comకి వివరాలను పంపించాలి. సంప్రదించాల్సిన నంబర్ 9440918123.



హెచ్‌ఎండీఏ అధికారులతో హరితహారం ప్రత్యేక అధికారి ప్రియాంక వర్గీస్ సమీక్ష

ఔటర్‌కు హరిత సోయగం

- 15 సెగ్మెంట్‌లుగా 158 కి.మీ. మార్గం
- ఒక్కో అధికారికి సెగ్మెంట్ బాధ్యత

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: గ్రేటర్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా మొక్కలు పెంచాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఔటర్‌పై ప్రయాణించిన సీఎం.. రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 158 కి.మీ. పొడవునా పచ్చదనం ఫరిడవిల్లాలని, రంగురంగుల పూలమొక్కలు ప్రయాణికులను అలరించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు హరితహారం ప్రత్యేక అధికారి ప్రియాంక వర్గీస్ మంగళవారం హెచ్‌ఎండీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 158 కి.మీ. ఔటర్‌ను పది కి.మీల చొప్పున 15 సెగ్మెంట్లుగా విభజించాలని నిర్ణయించారు. ఒక్కో సెగ్మెంట్‌లో ఒక్కో అధికారిని పర్యవేక్షకునిగా నియమించాలని ఆదేశించారు. పర్యవేక్షకులుగా నియమితులైన వారు పచ్చదనం ఎలా పెంపొందిస్తారనే విషయంపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి రెండు రోజుల్లోగా సమర్పించాలని సూచించారు. 15 రోజుల్లోగా ఔటర్ చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. రింగ్ రోడ్డు వెంట మూడు వరుసల్లో మొక్కలు నాటాలని, రెండు మీటర్ల కన్నా తక్కువ ఎత్తున్న మొక్కలను నాటొద్దని స్పష్టం చేశారు.

కెనడాలో హైదరాబాదీ దుర్మరణం

తల్లిదండ్రుల కండ్ల ముందే జలపాతంలో జారిపడ్డ యువకుడు

అంబర్‌పేట, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని బాగ్‌అంబర్‌పేటకు చెందిన యువకుడు కెనడాలోని ఓ జలపాతంలో పడి దుర్మరణం చెందారు. తల్లిదండ్రులతో కలిసి విహారానికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలుజారి జలపాతంలో పడిపోయారు. బాగ్‌అంబర్‌పేట జంజం మసీదు వద్ద నివాసముండే జబ్బార్ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయన కుమారుడు అబ్దుల్ ఖాదిర్(33) కెనడాలో ఉద్యోగం చేస్తున్నారు. జబ్బార్ దంపతులు జూలై 6న మనుమడిని చూడటానికి కుమారుడి వద్దకు వెళ్లారు. జూలై 30న ఖాదిర్ తన స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్ర కోసం ఎల్బోఫాల్స్ వద్దకు వెళ్లారు. అక్కడ ఫొటోలు దిగుతుండగా అతడి స్నేహితుడు నీళ్లలోకి జారాడు. అతనిని రక్షించేక్రమంలో ఖాదిర్ కాలుజారి ప్రవాహంలో పడి కొట్టుకుపోయి చనిపోయారు. ఈ విషయం మంగళవారం అంబర్‌పేటలో ఉన్న వారి బంధువులకు తెలియడంతో విషాదంలో మునిగిపోయారు. మృతుడికి భార్య, రెండునెలల కుమారుడు ఉన్నారు.



అబ్దుల్ ఖాదిర్(ఫైల్)

నమస్తే తెలంగాణ
జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
బుధవారం 2 ఆగస్టు 2017
WWW. NTNEWS.COM



సోదరి, సోదరులు.. ఓ హెల్మెట్!



'నేను నీకు రక్షా.. నువ్వు నాకు రక్ష.. మన బంధానికి ఈ రాఖీ రక్ష'.. అంటూ కోటి తారకలు కోలాహలం చేయగా.. అక్కాచెల్లెండ్లు ఆత్మీయతలు పంచే పండుగ రక్షాబంధన్! అన్నలందించే ఆశీర్వాదం.. తమ్ముండ్లు పంచే ఆత్మీయతల కోసం.. రంగూమెరుపులద్దుకొని 'రాఖీ' బంధనమై పుట్టింటికొచ్చే పండుగ రక్షాబంధన్! ఇప్పుడు 'అన్నలారా.. తమ్ములారా.. జర పైలమే.. అంటూ వస్తున్నది. ! ఓ చెల్లెకొచ్చిన ఆలోచన.. సరికొత్త ఒరవడి సృష్టిస్తూ.. సందేశాత్మకమై అన్నదమ్ములకు వరంగా మారనున్నది.

రాఖీ పండుగ వచ్చిదంటే చాలు.. అక్క అమెరికాలో ఉన్నా సరే.. అల్వాల్‌లో ఉన్న తమ్ముడి కోసం ఫ్లైట్ టిక్కెట్లు బుక్ చేసుకుంటుంది. ఇంగ్లాండ్‌లో ఉన్న అన్న కోసం ఇబ్రహీంపట్నంలో ఉన్న చెల్లె రాఖీ పోస్టులోనైనా పంపుతుంది. అంతటి బంధం అన్నాచెల్లెల్లది.. అక్కాతమ్ముళ్లది. తోడబుట్టిన బంధానికి బాధలోనూ నీకు తోడు నేనున్నా అని చెప్పేందుకు.. ప్రేమను పంచి ఆనందాన్ని పెంచేందుకు ఎన్నడూ వెనుకాడరు సోదరీసోదరీమణులు. అలాంటి వారి ప్రేమానురాగాల పండుగ రాఖీ ఈ ఏడాది సరికొత్త సామాజిక బాధ్యతనూ కట్టుకుంది.

నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఈ రాఖీ పండుగకు 'మీ సోదరునికి రాఖీతో పాటు, హెల్మెట్ కూడా ఇవ్వండి. డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ పెట్టుకొమ్మని ప్రేమగా చెప్పండి. తోడబుట్టిన బంధాన్ని కాపాడుకోవడం చెల్లెల్లుగా, అక్కలుగా మన బాధ్యత' అంటూ ఓ క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ నెల 7న రానున్న రాఖీ పండుగ నాడు అక్కలు, చెల్లెల్లు తమ సోదరులకు రాఖీ కట్టి హెల్మెట్ బహుమతిగా ఇవ్వాలనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన అన్న ఐటీ శాఖామంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం ప్రారంభిస్తూ 'తెలంగాణలో, భారతదేశంలో ఉన్న అన్నదమ్ములందరూ హెల్మెట్ తప్పక ధరించాలి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపడం వల్ల, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలే కోల్పోవాల్సి వస్తుంది. అదే హెల్మెట్ ఉంటే ప్రాణాలతో బయటపడొచ్చు. అందుకే అందరూ హెల్మెట్ ధరించండి. మన అన్నాదమ్ములకు హెల్మెట్ గిఫ్టుగా ఇచ్చి ప్రాణాలు కాపాడుదాం, మనకు అండగా ఉండమని చెప్తూ రాఖీ కడుదాం' అన్నారు. 20 నుంచి 30 వయసు యువతే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. హెల్మెట్ లేనందుకు జరిగిన ప్రాణనష్టమే అందులో ఎక్కువగా ఉండడం ఆలోచించాల్సిన విషయం. తల మీద వెంట్రుకలు రాలిపోతున్నాయన్న కారణంతో హెల్మెట్ పెట్టుకోడానికి నిరాసక్తి చూపిస్తున్నారు చాలామంది యువకులు. 'ఇప్పుడు వెంట్రుకలు ఊడిపోతున్నాయని హెల్మెట్ పెట్టుకోకపోతే ఎన్నడో ఒకనాడు ప్రాణాలే పోతాయి. వెంట్రుకలు ముఖ్యమా? ప్రాణాలు ముఖ్యమా? అంటూ చేస్తున్న ఈ క్యాంపెయిన్‌కి మంచి స్పందన వస్తున్నది. సానియా మిర్జా, గుత్తాజ్వాల, పీవీ సింధు లాంటి ప్రముఖ క్రీడాకారిణులతో పాటు సినిమా తారలు కూడా ఈ క్యాంపెయిన్‌లో పాలు పంచుకోడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ రాఖీ పండుగ సందర్భంగా మొదలైన ఈ కార్యక్రమం ద్వారా వచ్చే రక్షాబంధన్ వరకు హెల్మెట్ లేకుండా టూవీలర్ నడిపే అన్నలు, తమ్ముళ్లను చూడకుండా ఉండాలని నా కోరిక అంటున్నారు కవిత.

హెల్మెట్ సురక్ష..

హెల్మెట్ ధరించకుండా బైక్ నడిపి ప్రాణాలు పోగొట్టుకున్న ఎంతోమంది అన్నలు.. ఈ రాఖీ పండుగకు తమ సోదరీమణులకు దుఃఖాన్నే మిగిల్చారు. పది వేలు పెట్టి కొన్న మొబైల్ పగులకుండా గట్టి ప్యానెల్ వేయిస్తాం. స్క్రీన్ మీద మరకలు, గీతలు పడకుండా స్క్రీన్ గార్డ్ వేయిస్తాం. అలాంటిది బైక్ నడిపేటప్పుడు అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే నిండు ప్రాణాలు కాపాడే రక్షణా కవచం ధరించడానికి ఎందుకు ఆలోచిస్తున్నాం? మనం ఆలోచించాల్సింది హెల్మెట్ పెట్టుకోవాలా? వద్దా? అని కాదు. హెల్మెట్ పెట్టుకోకపోతే జరిగే ప్రమాదం గురించి, ఆ ప్రమాద తీవ్రత గురించి. మన కుటుంబసభ్యులకు మిగిల్చే క్షోభ గురించి. వేర్ హెల్మెట్.



ఈ లెక్క తగ్గాలి..

దేశంలో సగటున గంటకు 17 మంది రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారు. రోజుకు 400 మంది చనిపోతున్నారు. ఇది కేంద్ర హోంశాఖ నివేదిక. ప్రతి గంటకు 52 రోడ్డు ప్రమాదాలు జరిగితే అందులో ద్విచక్ర వాహ ప్రమాదాలే ఎక్కువగా ఉంటున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయనేది అందరికీ తెలిసిన విషయమే. తెలంగాణలో ఈ ఏడాది జరిగిన 64 వేల 141రోడ్డు ప్రమాదాల్లో 24 వేల 746 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారికంగా లెక్కలు చెబుతున్నాయి. ఇందులో బైక్ యాక్సిడెంట్లే అధికం. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ తొమ్మిదో స్థానం.. నగరాల వారిగా హైదరాబాద్ పదో స్థానంలో ఉన్నాయి. ఒక్క హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 30 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయంటే, బైక్ యాక్సిడెంట్ల విషయంలో ఈ గణాంకాలను నమ్మకతప్పదు.

'సిస్టర్స్ ఫర్ ఛేంజ్' అన్న నినాదంతో మా అన్న రామన్న పుట్టిన రోజు సందర్భంగా ఇచ్చిన పిలుపునకు మంచి స్పందన వచ్చింది. ఒక్క తెలంగాణలోనే కాదు.. దేశవ్యాప్తంగా చాలామంది స్పందిస్తున్నారు. సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు విప్ జ్యోతిరాదిత్య సింధియా, మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్, స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్, గుత్తా జ్వాలతో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు కూడా రాఖీ దినోత్సవం సందర్భంగా అన్నదమ్ముల ప్రాణాలకు రక్ష ఇద్దామన్న తెలంగాణ జాగృతి పిలుపునకు స్పందించారు. ముంబై, కోల్‌కతా, ఢిల్లీతోపాటు అస్సోంకు చెందిన వారు కూడా స్పందించారు. దేశవ్యాప్తంగా చూస్తే రోడ్డు ప్రమాదాల్లో 25 శాతం మంది యువకులు బైక్ యాక్సిడెంట్లలోనే చనిపోతున్నారు. గత సంవత్సరం 40 వేల మంది యువకులు రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్లుగా లెక్కలు చెబుతున్నారు. ఇది అత్యంత హృదయవిదారకరమైన అంశం. అందుకే మేం ఈ నినాదం తీసుకున్నాం. ఒక్క రాఖీ పండుగతోనే ఇది అయిపోదు. రాఖీ పండుగ తర్వాత కూడా కొనసాగుతుంది. సిస్టర్స్ ఫర్ చేంజ్ అన్న పేరుతో ఒక వెబ్‌సైట్ కూడా రూపొందించాం. ఇది ఇకపై నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. హెల్మెట్ పెట్టుకుంటే ఎంతో ఉపయోగం. బైక్ మీద వెళ్లే సమయంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో హెడ్ ఇంజ్యూరీస్ అత్యధికంగా అవుతున్నాయి. వీటిని నివారించవచ్చు. ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఇప్పుడు రోడ్లు మెరుగుపడ్డాయి. రోడ్లు బాగుండడంతోపాటు ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌లు కూడా వచ్చాయి. దీంతో ప్రమాదాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. వంశీ అనే యువకుడి ఆలోచనల నుంచే ఈ కార్యక్రమాన్ని రూపొందించాం. హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడుతుందన్న భయం కూడా వ్యక్తం చేస్తున్నారు. మనం బతికి ఉంటేనే జుట్టు, దాని అందం కాపాడుకోగలం. ప్రాణాలను మించింది లేదు. అందుకే ప్రాణాన్ని కాపాడుకునే హెల్మెట్‌ను పెట్టుకుందాం అని పిలుపు ఇచ్చాను. ఇది ఓ సామాజిక చైతన్య కార్యక్రమం. అందరూ కల్సి రావాలని కోరుతున్నాను. బైక్‌లు కాకుండా కార్లు వాడేవారు సీటు బెల్టు పెట్టుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటుంటారు. దీన్ని కూడా చెబుతున్నాం. అన్నదమ్ములకు అక్కచెల్లెలు చెప్తేనే హత్తుకుంటుంది. అందుకే ఈ పిలుపు అని నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత చెప్పారు.

పండుగ తర్వాత కూడా ..





స్ఫూర్తినిచ్చిన 'రక్షా'బంధన్

ఒక చెల్లె.. ఇద్దరు అన్నలు. రాఖీ పండుగ వచ్చిదంటే ఆ చెల్లె ఇద్దరన్నలకూ రాఖీ కడుతుంది. అన్నలు కూడా ఒకరికి ఒకరు పోటీ పడి చెల్లెకు కట్నాలు పెడుతారు. ఈసారి రాఖీ పండుగ ఎప్పట్లానే వచ్చింది. కానీ రాఖీ కట్టించుకోడానికి పెద్దన్న లేడు. రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆ చెల్లె అన్న ప్రాణాలు పోవడానికి కారణమేంటో తెలుసుకున్నది. మిగిలిన చిన్నన్న ప్రాణాలు కాపాడాలనుకున్నది. అందుకే ఈ సారి రాఖీతో పాటు అన్నకు హెల్మెట్ కూడా బహుమతిగా ఇచ్చింది. ఇదీ రక్షాబంధన్ అనే షార్ట్‌ఫిలిం సారాంశం. ఈ ఆరునిమిషాల షార్ట్‌ఫిలింలో ఒక్క డైలాగ్ కూడా లేదు. కానీ మనసుకు హత్తుకుంది. హెల్మెట్ ప్రాముఖ్యాన్ని చెప్తూ దర్శకుడు వంశీకృష్ణ తీసిన షార్ట్‌ఫిలిం మనసును హత్తుకుంది.

వంశీకృష్ణ గురించి..

రక్షాబంధన్ షార్ట్‌ఫిలిం గురించి చెప్పుకున్నప్పుడు దాని దర్శకుడు వంశీకృష్ణ గురించి కూడా చెప్పుకోవడం తప్పనిసరి. వంశీది వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామం. ఎస్వీ యూనివర్సిటీలో బీఏ ఫ్‌ఏ చదివాడు. వీధిబాలల మీద, పోలీసు వ్యవస్థ మీద సలాం పోలీస్ అనే షార్ట్ ఫిలిం తీసి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బెస్ట్ షార్ట్‌ఫిలిం అవార్డులు అందుకున్నాడు. సామాజిక అంశాల మీద షార్ట్‌ఫిలింలు తీయడంతో వంశీ శైలి ప్రత్యేకం. ఫిలింమేకర్‌గా ఉంటూనే తెలంగాణ జాగృతిలో సభ్యునిగా పనిచేస్తున్నాడు. గతేడాది చిత్రీకరించిన రక్షబంధన్ షార్ట్‌ఫిలిం కేవలం రెండురోజుల్లోనే పూర్తి చేశాడు. ఈ సినిమా చూసి అభిప్రాయం తెలుపాలని జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కవితను కలిశాడు. అప్పుడు రాఖీపండుగకు రెండు రోజులే ఉన్నది. అంతకు ముందు రోజు షార్ట్ ఫిలిం చూసిన కవిత అర్ధరాత్రి వంశీకి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. ఈ సినిమా గురించి కవిత మాట్లాడితే ఎక్కువ మందికి తెలిసే అవకాశం ఉందని ఆమెను కోరగా, వీడియో రూపంలో తన అభిప్రాయాన్ని చెప్పారు కవిత. 'సమయం లేకపోవడం వల్ల ఏమీ చేయలేకపోతున్నా.. వచ్చే ఏడాది ఏదైనా మంచి కార్యక్రమం చేద్దాం' అని హామీ ఇచ్చారు. వంశీకృష్ణ 'రక్షబంధన్' షార్ట్ ఫిలింలో కీలకంగా చెప్పిన అంశాన్ని ఆమె నిర్వహిస్తున్న 'సిస్టర్ ఫర్ చేంజ్' క్యాంపెయిన్‌కు కారణమని కవిత చెప్పారు కూడా. ప్రస్తుతం వంశీకృష్ణ ఇంటర్నేషనల్ షార్ట్‌ఫిలిం ఫెస్టివల్స్ కోసం రెండు చిల్డ్రన్స్ షార్ట్ ఫిలిమ్స్‌ను తీస్తున్నాడు.



ఇప్పుడూ మందులు వాడాలా?

అడుగండి చెబుతా



నా వయసు 27 సంవత్సరాలు. నాకు గత పది సంవత్సరాలుగా మూర్ఛవ్యాధి ఉంది. దీనికి వాల్టారిన్ అనే మందు వాడుతున్నాను. మందులు వాడితే ఫిట్స్ రావడం లేదు. ఇప్పుడు నేను మూడు నెలలు గర్భవతిని. నేను మందులు వాడితే బిడ్డకు ఏదైనా ప్రమాదమా? నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరంగా తెలుపగలరు.

వేదవతి, బెల్లంపల్లి

మూర్ఛ వ్యాధి ఉన్నవారు కచ్చితంగా మందులు వాడాల్సిందే. అయితే ఫిట్స్ మందులు మన కడుపులోని బిడ్డ కొన్ని లోపాలతో పుట్టే ప్రమాదం ఉంటుంది. ఆ విధంగా జరుగకూడదనుకుంటే గర్భం దాల్చడానికి ముందే ఫోలేట్ అనే మందును తీసుకుంటూ ఉండాలి. ఒకసారి గర్భం దాల్చిన తర్వాత ఈ మందులతో పెద్దగా ఉపయోగం ఉండదు. ఇప్పుడు మీకు మూడోనెల అంటున్నారు కాబట్టి ఒకసారి స్కానింగ్ చేసి బిడ్డలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో చూసుకోండి. అదే మందును కొనసాగించవచ్చు. లేదా మీ డాక్టర్‌ను సంప్రదించి మందు మార్చుకోవచ్చు కూడా. మందులు మాత్రం ఎట్టిపరిస్థితుల్లో మానకూడదు. ఈ సమయంలో మీకు ఫిట్స్ వస్తే చాలా ప్రమాదం. కాబట్టి మందులు వాడుతూ, తరచుగా స్కానింగ్ చేసి బిడ్డ ఆరోగ్యాన్ని కూడా పరిశీలిస్తూ, పోషకాహారం తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



డాక్టర్ మురళీధర్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం.నమస్తే తెలంగాణ – అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్)
మా అడ్రస్ : #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

పాతిక దాటినా పసిదానిలా..

చాలామంది వయస్సు పెరిగితే అందం తరిగిపోతుందని, చిన్న వయస్సులోనే పెద్దవాళ్లలా కనిపిస్తామని బాధపడుతుంటారు. ముఖ్యంగా 25 సంవత్సరాలు దాటితే ముఖంలో తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వీటి నుంచి విముక్తి పొందవచ్చంటున్నారు బ్యూటీ నిపుణులు.



- పాలమీగడలాంటి నునుపైన చర్మానికి పైపై నగిషీలు ఎన్ని పెట్టినా సరిపోవు. పోషకాహారమే దానికి మేలైన మార్గం. ఎన్ని పోషకాలు అందితే అంతగా చర్మం మెరిసిపోతుంది. ముఖ్యంగా యాంటీఆక్సిడెంట్ ఆహారంలో ఉండాలి.
- శరీరంలో వ్యర్థాలు పేరుకొనేకొద్దీ క్రమంగా ముఖంలో కాంతి సన్నగిల్లుతుంది. అందుకే ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించే డీటాక్సిఫికేషన్ ప్రక్రియ అవసరం. ఉదయాన్నే కప్పు కొత్తిమీర, కప్పు పుదీనా, కప్పు కరివేపాకు తీసుకొని గ్రీన్ చట్నీ చేసుకొని టిఫిన్‌కు జతగా తింటే బరువు తగ్గడంతో పాటు వ్యర్థాలు తొలుగుతాయి.
- ఏ వయసు వారికయినా వృద్ధాప్య లక్షణాలు నివారించడానికి సన్‌స్క్రీన్ వాడకం తప్పనిసరి. ముందుగా సన్‌స్క్రీన్ రాసుకొని ఆ తర్వాతే అలంకరణ చేసుకోవాలి.
- రోజంతా కాలుష్యపూరిత వాతావరణంలో తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత అలానే నిద్రపోవడం కాకుండా... ముందుగా ముఖంపై పేరుకొన్న మురికిని శుభ్రం చేయాలి. రాత్రిళ్లు అయితే టోనర్‌ను రాసుకొని పడుకోవాలి. తెల్లారి ముఖం తాజాగా ఉంటుంది.
- తీవ్రమైన ఎండలో తిరగడం వల్ల ముఖంలో టాన్ ఏర్పడుతుంది. దీని వల్ల ముఖంలో పిగ్మెంటేషన్ సమస్య తీవ్రమై క్రమంగా మచ్చలుగా మారుతాయి. పండిన అరటిపండు, బొప్పాయి... ఏదయినా సరే ఆ పండు గుజ్జు తీసుకొని ఎండకి గురై నల్లగా మారిన ప్రాంతంలో పదినిమిషాల పాటు రుద్దితే టాన్ తొలుగుతుంది.

వాట్సప్!

ట్వీట్

కాజల్ అగర్వాల్
@MsKajalAggarwal



కాజల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

493,986



రాధా ప్రపంచం మొత్తం ప్రేమతో నిండిపోయి ఉంది. ఆ ప్రేమను మీకు కూడా చూపించాలనుకుంటున్నాను. ఆగస్టు 11 వరకు ఆగండి. ఆ ప్రపంచంలోకి వెళ్లి సేదతీరుదాం.

సమ్‌థింగ్ స్పెషల్



ఇటు చూడు తల్లి.. ఆపు నీ ఫోన్ లొల్లి!

కామన్‌మ్యాన్ వాయిస్

మారిన జీవన విధానం వల్ల ఉమ్మడి కుటుంబాలు కాస్త చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురవుతుంటే తాతమ్మలతో, తాతయ్యలతో మనువలు,మనువరాండ్లు సమయం గడిపే అవకాశాలు తక్కువయితున్నయి.

Dileep Konatham

ఎవరినీ రోడ్డుమీద పడ్డ కాగితంలా చూడకండి. రేపది గాలి పటమై ఎగిరితే మనం కూడా దాని వంక తలెత్తి చూడాల్సి వస్తుంది.

Thirupathi Bandari

తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు. దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు. తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు. సినీ హీరో ఫ్యాన్స్‌లో లాజిక్కు కోరరాదు.

JS Chaturvedi

వైరల్ వీడియో



యుద్ధం శరణం సినిమాకు సంబంధించిన టీజర్ యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది. దీనికి అప్పుడే ఒక మిలియన్ వ్యూస్ వచ్చాయి.

Yuddham Sharanam Teaser | Chay Akkineni | Srikanth | Lavanya Tripathi | Krishna RV Marimuthu

Total views : 1,037,813+

Published on Jul 31, 2017

షేరింగ్

మనుషుల్లో మానవత్వం గురించి అబ్దుల్ కలాం చివరి సారి చెప్పిన కథ

తండ్రీకొడుకులు గుడికి వెళ్లారు. ముఖద్వారంలో ఉన్న స్తంభాలపై చెక్కిన సింహం ముఖాలను చూసిన కొడుకు జడుసుకుంటాడు. భయంతో 'నాన్నా పరిగెత్తు.. సింహం మనల్ని చంపేస్తుంది' అని కేకలు పెట్టాడు.

అప్పుడు తండ్రి కొడుకుని దగ్గరగా తీసుకొని, 'అలా భయపడకు బాబూ..అవి కేవలం శిల్పాలు మాత్రమే అవి మనల్ని ఏమీ చేయవు' అని చెప్పాడు.

ఆ కుర్రాడు బేలగా 'శిల్ప రూపంలో ఉన్న సింహం మనల్ని ఏమీ చేయనప్పుడు దేవుడు మనకు ఎలా మేలు చేస్తాడు?' అని అడిగాడు.

ఆ మాటలు విన్న తండ్రి తన డైరీలో ఇలా రాసుకున్నాడు.

– ఆ రోజు నుంచి ఈ రోజు వరకు నా దగ్గర వాడి ప్రశ్నకు సమాధానం లేదు. కానీ అప్పటి నుంచి దేవుడిని శిల్పాల్లో కాకుండా మనుషుల్లో వెతుకడం ప్రారంభించా.. దేవుడు కనిపించలేదు. కానీ, మానవత్వం కనిపించింది.

ఓ వాట్సప్ మెసేజ్



బాలకృష్ణ

అభిమానులకు స్కాలర్‌షిప్స్

బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రం 'పైసా వసూల్'. పూరి జగన్నాథ్ దర్శకుడు. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనందప్రసాద్ నిర్మిస్తున్నారు. బాలకృష్ణ నటిస్తున్న 101వ చిత్రమిది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చిత్ర నిర్మాణ సంస్థ భవ్య క్రియేషన్స్ సినిమా విడుదల సమయంలో బాలకృష్ణ అభిమానులు, వారి కుటుంబ సభ్యులకు స్కాలర్‌షిప్స్‌ను అందివ్వాలని నిర్ణయించింది. ఉభయ తెలుగు రాష్ర్టాల్లోని 101 మంది పేద విద్యార్థినీ, విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు. ఈ ఉపకార వేతనం అర్హత పొందేందుకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆయా జిల్లాల్లోని బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులకు ఇవ్వాల్సి వుంటుందని భవ్య క్రియేషన్స్ సంస్థ తెలిపింది. ఎంపికైన విద్యార్థులకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తారు.

కిరీటం కాదు కృతజ్ఞత!

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జవాన్'. 'ఇంటికొక్కడు' అని ఉపశీర్షిక. బి.వి.ఎస్.రవి దర్శకుడు. మెహ్రీన్ కథానాయిక. దిల్‌రాజు సమర్పణలో అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కొంతమంది కలిస్తే అది కుటుంబం అవుతుంది. కొన్ని లక్షలమంది కుటుంబాలు కలిస్తే దేశం అవుతుంది. దేశభక్తి అనేది కిరీటం కాదు కృతజ్ఞత' అంటూ చెప్పిన డైలాగ్‌లు ఆలోచనాత్మకంగా వున్నాయని చెబుతున్నారు. ఈ టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. సందేశాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయిధరమ్‌తేజ్‌ని కొత్త కోణంలో ఆవిష్కరిస్తున్నాం. ఆయన పాత్ర చిత్రణ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా సాగుతుంది. తమన్ సంగీతం, కె.వి. గుహన్ ఛాయాగ్రహణం హైలైట్‌గా నిలుస్తాయి. దేశానికి జవాన్ ఎంత అవసరమో ప్రతి ఇంటికి మా కథానాయకుడి వంటి యువకుడు అంతే అవసరమని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం. సమస్యల్లో చిక్కుకున్న తన కుటుంబాన్ని ఓ యువకుడు తన బుద్ధిబలంతో ఎలా కాపాడుకున్నాడనేది ఆసక్తిని పంచుతుంది. తమిళ నటుడు ప్రసన్న విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. జయప్రకాష్, ఈశ్వరీరావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: బ్రహ్మ కడలి, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, సహనిర్మాతలు: కల్యాణ్‌వర్మ దండు, సాయికృష్ణ వంశీ బలపనూరి, కథ, మాటలు, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం: బి.వి.ఎస్.రవి.



సాయిధరమ్‌తేజ్



ఆర్. నారాయణమూర్తి

అన్నదాత సుఖీభవ

తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి సంక్షేమ పథకాలతో రైతులకు చక్కటి నీటి వసతుల్ని కల్పిస్తున్నది. ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి ఎరువులు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మార్కెట్ వసతుల్ని కల్పిస్తున్నది' అని అన్నారు ఆర్.నారాయణమూర్తి. స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మిస్తున్న తాజా చిత్రం 'అన్నదాత సుఖీభవ'. ఈ నెల 4న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'రైతే రాజు, రైతు దేశానికి వెన్నెముక, రైతు లేనిదే దేశం లేదని, అన్నదాత సుఖీభవ అంటూ పెద్దలు చెప్పారు. ప్రస్తుతం అది అన్నదాత దుఃఖీభవగా మారింది. రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, దేశానికి వెన్నెముకగా ఉండాల్సిన రైతు వెన్నెముక ఎందుకు విరిగిపోతున్నది? రాజుగా ఉండాల్సిన రైతు ఎందుకు బికారీగా మారుతున్నాడనేది ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. ప్రపంచాన్ని బతికిస్తున్న రైతు సుఖంగా ఉన్నప్పుడు దేశం సుభిక్షంగా ఉంటుంది. జీవితం దేవుడు ఇచ్చిన గొప్ప వరం, రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీరు పండించిన పంటలతోనే అందరూ బతుకుతున్నారు. రైతులు బ్రతకాలి. అందరిని బతికించాలన్నదే ప్రధానాంశంగా 'అన్నదాత సుఖీభవ' సినిమాను తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో వరి బాగా పండే రాష్ర్టాల్లో తెలంగాణ ఒక్కటే ఉన్నది. కేసీఆర్ ప్రకటిస్తున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలతో పాటు వర్షాలు బాగా కురవడం అందుకు కారణం. రైతుల కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్న కేసీఆర్ గిట్టుబాటు ధరను కల్పించాలి. దేశంలో అరవై వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దీనిని జాతి విపత్తుగా భావించి కేంద్రం పరిష్కార మార్గం చూపాలి. దేశంలోని రైతులు 44 శాతానికి పైగా అప్పుల్లో కూరుకుపోతున్నారని కేంద్రమంత్రి స్వయంగా ప్రకటించారు. పగలు, రాత్రి, సెలవులు, పండుగలు లేకుండా ఆరుగాలం కష్టపడే రైతు రెండు వేలకు మించి సంపాదించలేకపోతున్నాడు. గుమస్తాలు యాభై వేలు సంపాదిస్తున్నారు. వారికి ఉద్యోగభద్రత, పెన్షన్ ఉంటే రైతులకు మాత్రం ఎలాంటి భద్రత లేదు. దళారీ వ్యవస్థ వల్ల రైతులు చాలా నష్టపోతున్నారు. దీనిని నివారించేలా ప్రభుత్వాలు కృషిచేయాలి. గోరటి వెంకన్న, వంగపండు ప్రసాద్‌రావు, గద్దర్, సుద్దాల అశోక్‌తేజ సినిమా కోసం చక్కటి పాటలు రాశారు. ఈ నెల 4న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఏకధాటిగా చిత్రీకరణ జరిపి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.

నా హీరో చాలా గ్రేట్!



సమంత

మిగతా కథానాయికలతో పోలిస్తే చెన్నై సోయగం సమంత సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా వుంటుంటారు. సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిగత విషయాలతో పాటు తన సినిమాలకు సంబంధించిన సరికొత్త వివరాల్ని ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటున్న విషయం తెలిసిందే. తనకు కాబోయే భర్త నాగచైతన్య గురించి, అతనిపై వున్న ప్రేమను వ్యక్తంచేస్తూ పలు ఆసక్తికరమైన ట్వీట్‌లు చేసే సమంత తాజాగా అలాంటి ట్వీట్‌నే తన అభిమానులతో పంచుకుంది. నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'యుద్ధం శరణం'. లావణ్య త్రిపాఠి కథానాయకగా నటిస్తున్నది. హీరో శ్రీకాంత్ ఇందులో విలన్‌గా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆర్.వి.కృష్ణ దర్శకత్వంలో రజనీ కొరపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను ఈ సోమవారం చిత్ర బృందం విడుదల చేసింది. ఈ టీజర్‌ను నాగచైతన్య ట్విట్టర్ ద్వారా తన అభిమానులతో పంచుకుంటూ 'శత్రువులు ద్రోహం చేసినా... ఆశలు ఆవిరైనా... నా గూడు చెదిరినా నేను ధైర్యంగా జీవించగలను' అని ట్వీట్ చేశారు. దీన్ని సమంత రీట్వీట్ చేస్తూ 'నా హీరో చాలా గ్రేట్' అని పోస్ట్ చేయడం విశేషం. కాగా అంతర్జాలంలో 'యుద్ధం శరణం' చిత్ర టీజర్‌కు అనూహ్య స్పందన లభిస్తున్నది. యూట్యూబ్ ట్రేడింగ్‌లో ఈ టీజర్ ట్రేడింగ్‌లో నం.1 స్థానంలో వుండటం విశేషం.

'లవర్స్ క్లబ్'లో ఏం జరిగింది?



పావని, అవినాష్

అవినాష్, పావని, ఆర్యన్, పూర్ణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లవర్స్ క్లబ్'. ధృవ శేఖర్ దర్శకుడు. ప్రవీణ్ గాలిపల్లి సమర్పణలో భరత్ అవ్వారి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఐఫోన్‌తో చిత్రీకరించిన ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఈ ఏడాది భారీ చిత్రాలు ఏ స్థాయిలో సూపర్‌హిట్‌లుగా నిలిచాయే అదే స్థాయిలో చిన్న సినిమాలు కూడా విజయాల్ని సొంతం చేసుకుని కంటెంట్ ఈజ్ ద కింగ్ అని నిరూపించాయి. ఆ సినిమాలు అందించిన ధైర్యంతోనే మా చిత్రాన్ని నిర్మించాం. అర్థవంతమైన కథ, కథనాలతో అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుంటుంది. నటీనటులంతా కొత్తవారైనా దర్శకుడు చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'లవర్ క్లబ్‌లో ఏం జరిగింది? ప్రేమికులకు అండగా నిలబడే ఓ యువకుడి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది అనేదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది' అన్నారు. ధీరజ్, చిత్రం బాషా, వైజాగ్ ప్రసాద్, అజయ్ రత్నం తదితరులు నటిస్తున్నారు.

వంట చిట్కాలు

- క్యారెట్స్ బాగా ఉడుకాలంటే ముందుగా వాటిని కొద్దిసేపు గోరువెచ్చని నీటిలో ఉంచాలి.
- గోధుమలపై వేపాకు, ఉప్పు చల్లితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. పురుగు పట్టదు.
- ఉప్పు, పసుపు కలిపి అల్లం వెల్లుల్లి పేస్టు రుబ్బితే ఎన్ని రోజులైనా పాడవకుండా ఉంటుంది.
- కాకరకాయ ముక్కలకు కొంచెం ఉప్పురాసి, నీళ్లు చల్లి గంట సేపు ఉంచితే చేదు పోతుంది.
- వెల్లుల్లి పాయను మెత్తగా దంచి కొద్దిగా నీటితో కలిపి బొద్దింకలు వచ్చే చోట ఉంచితే, ఆ ప్రాంతానికి అవి రావు.
- డ్రై ఫ్రూట్స్‌ను కట్ చేసే ముందు వాటిని ముందుగా గంట సేపు ఫ్రిజ్‌లో ఉంచి తీయాలి. తరిగే ముందు చాకును వేడి నీటిలో ముంచి తీయాలి.



పాలు ఎప్పుడు తాగొద్దంటే



- నువ్వులు, ఉప్పుతో చేసిన పదార్థాలను తిన్న తర్వాత పాలు తాగకూడదు. ఒకవేళ తాగాలనుకుంటే కనీసం రెండు గంటల తర్వాత తాగొచ్చు.
- మినుములు, బొబ్బర్లు తిన్న తర్వాత పాలు తీసుకోకూడదు. తీసుకుంటే కడుపు ఉబ్బరం పెరిగి.. అనారోగ్యానికి దారి తీస్తుంది.
- ఆరెంజ్, బత్తాయి, నిమ్మ వంటి పండ్లను తిన్న వెంటనే పాలు తీసుకోకూడదు. ఒకవేళ తీసుకుంటే కడుపులో పాలు విరిగిపోయి.. విరేచనాలు అయ్యే ప్రమాదం ఉంది.
- చేపలు తిన్న తర్వాత కూడా పాలు తీసుకోకూడదు.
- ఆసక్తికర విషయం ఏమిటంటే.. పెరుగు తిన్న తర్వాత కూడా పాలు తాగకూడదంట.

సలహా

రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు హోమియోచికిత్స

రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఒక ఆటోఇమ్యూన్ సమస్య. శరీరంలోని సొంత నిరోధక వ్యవస్థ కీళ్ల కణజాలం మీద దాడి చేయడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. మనదేశంలో సమారు 7 మిలియన్ల ప్రజలు రుమాటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. అందులో పురుషుల కంటే స్త్రీలలో మూడు రెట్లు అధికంగా కనిపిస్తుంది.

అధునాతన హోమియో వైద్యంతో ఈ వ్యాధిని సమర్థవంతంగా నయం చెయ్యవచ్చు. సూక్ష్మీకరణ పద్ధతిలో తయారు చేసిన హోమియోమందులు ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా పూర్తిగా నయం చేస్తాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్ చాలా నెమ్మదిగా పెరిగే సమస్య. ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ కీళ్లలో కనబడుతుంది. మొదట చిన్న కీళ్లలో, తర్వాత పెద్దకీళ్లలో సమస్య మొదలవుతుంది. కీళ్లలోని సైనోవియల్ పొర తర్వాత నెమ్మదిగా కార్టిలేజ్ దెబ్బతింటుంది. ఫలితంగా కీళ్ల ఆకారం, అమరిక కోల్పోయి విపరీతమైన నొప్పి కలుగుతుంది. ఈ వ్యాధి కొందరిలో కీళ్లు మాత్రమే కాదు ఇతర అవయవాల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, రక్తనాళాలు, చర్మం వంటి వాటి మీద దుష్ప్రభావాలు కనిపిస్తాయి.

ఎవరిలో..

కీళ్ల వాతం చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ వయసు వారికైనా రావచ్చు. కానీ, సాధారణంగా పెద్దవారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. చిన్న పిల్లలో వచ్చే ఈ వ్యాధిని జువైనల్ ఆర్థరైటిస్ అంటారు.

కారణాలు

మన శరీరంలోని వ్యాధినిరోధక వ్యవస్థ పనితీరు సరిగ్గా లేకపోవడం వల్ల కొన్ని కణాలు వ్యతిరేకంగా పనిచేసి ఆరోగ్యవంతమైన కణాలపై దాడి చేస్తాయి. ముఖ్యంగా కీళ్లలోని సైనోనియం పొరపై ప్రభావితం చేయడం వల్ల వస్తుంది. సాధారణంగా మన శరీరంలో తెల్లరక్తకణాలు వ్యాధి నిరోధక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్.. ఇతర పరదీయ పదార్థాల నుంచి నిత్యం కాపాడుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ రోగులలో తెల్ల రక్తకణాలు కీళ్ల చుట్టూ ఉండే సైనోవియంలోకి వెళ్లి ప్రొటీన్లు విడుదల చేయడం వల్ల సైనోవియం పొర మందంగా మారి క్రమంగా కీళ్ల లోపలి ఎముకలు, కార్టిలేజ్ ఇన్‌ఫ్లమేషన్‌కు గురికావడం వల్ల కీళ్ల అమరికలో మార్పు వచ్చి అది వైకల్యానికి దారి తీస్తుంది.

జన్యుపరమైన, జీవన శైలి పరమైన కారణాల వల్ల కూడా రుమటాయిడ్ ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉంది.

లక్షణాలు

కీళ్ల వాపు, నొప్పి, చేతితో తాకితే వేడిగా ఉండడం, ఉదయం లేవగానే కీళ్ల కదలికలు బాధాకరంగా ఉండడం, బిగుసుకు పోవడం ఈ లక్షణాల తీవ్రత ఎప్పుడూ ఒకే తీరుగా కాకుండా పెరుగుతూ తగ్గుతూ ఉండవచ్చు. అంతేకాకుండా రెండు వైపులా ఒకే రకం కీళ్లు ప్రభావితం కావడం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. వీటికి తోడు రక్తహీనత, ఆకలి సరిగా లేకపోవడం నిసత్తువ, బరువు తగ్గడం, కొద్దిపాటి జ్వరం, మోచేయి, మణికట్టు వంటి కీళ్లలో చర్మం కింద చిన్నచిన్న బుడిపెలు (రుమటాయిడ్ నాడ్యూల్స్) ఏర్పడవచ్చు.

నిర్ధారణ

సీబీపీ, ఈఎస్ఆర్, ఆర్ఏ ఫ్యాక్టర్, ఏఎన్ఏ, యాంటి సీపీసీ, ఎక్స్‌రే, ఎమ్ఆర్ఐ, మొదలైన పరీక్షలు వ్యాధి నిర్ధారణకు తోడ్పడుతాయి.

హోమియోకేర్ చికిత్స

చాలా రకాల ఆటోఇమ్యూన్ జబ్బులు సైకోసొమాటిక్ డిజార్డర్స్ కిందకి వస్తాయి. అన్ని రకాల సైకోసొమాటిక్ డిజార్డర్స్‌కి హోమియోలో చక్కని పరిష్కారం లభిస్తుంది. అందులో ఒకటైన రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కి కూడా హోమియోలో సంపూర్ణ చికిత్స ఉంది. ఇతర చికిత్సా విధానాల్లో కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభ్యమవుతుంది. కానీ హోమియోపతిలో పూర్తి చికిత్స అందుబాటులో ఉంది. అయితే ఈ మందులను రోగి వ్యక్తిగత లక్షణాలు, స్వరూప స్వభావాల ఆధారంగా నిపుణుల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది.

డా. శ్రీకాంత్ మోర్లావార్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
టోల్ ఫ్రీ 1800 1081212
ఉచిత కన్సల్టేషన్
955 000 1188/99
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళ నాడు



బార్క్‌లో డిప్లొమా

ముంబైలోని బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) రేడియాలజికల్ ఫిజిక్స్‌లో డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

బార్క్ అనేది డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తుంది.. భారత ప్రభుత్వం 1954 జనవరి 3న అణుపరిశోధన కోసం అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్, ట్రాంబే అనే సంస్థను స్థాపించింది. 1966లో భారతదేశ అణుశక్తి పితామహునిగా పేరు గాంచిన డాక్టర్ హోమీ జహంగీర్ బాబా జ్ఞాపకార్థంగా ట్రాంబేను 'బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్'గా పేరు మార్చారు.

- **కోర్సు పేరు:** డిప్లొమా ఇన్ రేడియాలజికల్ ఫిజిక్స్
- **మొత్తం సీట్లసంఖ్య:** 30
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. డిగ్రీ స్థాయిలో బీఎస్సీ ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 60 శాతం మార్కులను సాధించాలి.
- **వయోపరిమితి:** 2017 అక్టోబర్ 1 నాటికి 26 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** కామన్ ఎంట్రెన్స్, ఇంటర్వ్యూ
- **స్టయిఫండ్:** రూ. 9,300
- **అప్లికేషన్ ఫీజు:** రూ.200/-. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.barc.gov.in

ఎయిమ్స్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పీహెచ్‌డీ -2017 జులై ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఎయిమ్స్ కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ పరిధిలో పని చేస్తుంది.

- **కోర్సు:** ఎయిమ్స్ – పీహెచ్‌డీ ప్రోగ్రామ్ (జులై 2017 సెషన్)
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా
- **పరీక్షతేదీ:** సెప్టెంబర్ 8
- **పరీక్ష కేంద్రాలు:** ఢిల్లీ/ఎన్‌సీఆర్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఆగస్టు 3 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** ఆగస్టు 17
- **వెబ్‌సైట్:** www.aiimsexams.org

ఐఐఎఫ్‌టీలో ఎంబీఏ(ఐబీ)



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) అర్హులైన అభ్యర్థుల నుంచి ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

2018-20 విద్యా సంవత్సరానికి ఇంటర్నేషనల్ బిజినెస్‌లో రెండేండ్ల ఎంబీఏ కోర్సులో ప్రవేశాలు.

- **కోర్సు పేరు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ)
- **విభాగాలు:** ఇంటర్నేషనల్ బిజినెస్
- **అడ్మిషన్ పొందే ప్రదేశం :** న్యూఢిల్లీ, కోల్‌కతా, కాకినాడ.
- **కోర్సు వ్యవధి:** రెండేండ్లు
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీలో 55 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ పీహెచ్‌సీ అభ్యర్థులు 45 శాతం) ఉత్తీర్ణత. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** గరిష్ఠ వయో పరిమితి లేదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1550/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 775/-)
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నంతో సహా దేశ వ్యాప్తంగా మొత్తం 20 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తారు.
- **ఎంపిక:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, రైటింగ్ స్కిల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.

ముఖ్యమైన తేదీలు:

- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 8
- **రాత పరీక్ష:** నవంబర్ 26
- **వెబ్‌సైట్:** http://tedu.iift.ac.in/iift

ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) వివిధ ట్రేడ్ విభాగాలలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మెన్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఐటీబీపీని 1962 అక్టోబర్ 24న ప్రారంభించారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 303
- **పోస్టు పేరు:** కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మెన్)
- **విభాగాలు:** టైలర్, గార్డెనర్, కాబ్లర్, వాటర్ క్యారియర్, సఫాయి కర్మచారి, కుక్, వాషర్ మెన్, బార్బర్
- **విభాగాలవారీగా ఖాళీలు..**
- టైలర్-19 పోస్టులు. వీటిలో పురుషులకు-16 పోస్టులు (జనరల్-4, ఓబీసీ-2, ఎస్సీ-3, ఎస్టీ-7), మహిళలకు-3 పోస్టులు (జనరల్-2, ఓబీసీ-1)
- గార్డెనర్-38 పోస్టులు. వీటిలో పురుషులకు-32 పోస్టులు (జనరల్-16, ఓబీసీ-8, ఎస్సీ-5, ఎస్టీ-3), మహిళలకు-6 పోస్టులు (జనరల్-2, ఓబీసీ-1, ఎస్సీ-1, ఎస్టీ-1)
- కాబ్లర్-27 పోస్టులు. వీటిలో పురుషులకు-23 పోస్టులు (జనరల్-12, ఓబీసీ-6, ఎస్సీ-3, ఎస్టీ-2), మహిళలకు-4 పోస్టులు (జనరల్-2, ఓబీసీ-1, ఎస్సీ-1)
- వాటర్ క్యారియర్-95 పోస్టులు. వీటిలో పురుషులకు-81 పోస్టులు (జనరల్-41, ఓబీసీ-22, ఎస్సీ-12, ఎస్టీ-6), మహిళలకు-14 పోస్టులు (జనరల్-7, ఓబీసీ-4, ఎస్సీ-2, ఎస్టీ-1)
- సఫాయి కర్మచారి-33 పోస్టులు. వీటిలో పురుషులకు-28 పోస్టులు (జనరల్-14, ఓబీసీ-8, ఎస్సీ-4, ఎస్టీ-2), మహిళలకు-5 పోస్టులు (జనరల్-3, ఓబీసీ-1, ఎస్సీ-1)
- కుక్-55 పోస్టులు. వీటిలో పురుషులకు-47 పోస్టులు (జనరల్-24, ఓబీసీ-13, ఎస్సీ-7, ఎస్టీ-3), మహిళలకు-8 పోస్టులు (జనరల్-4, ఓబీసీ-2, ఎస్సీ-1, ఎస్టీ-1)
- వాషర్‌మెన్-25 పోస్టులు. వీటిలో పురుషులకు-21 పోస్టులు (జనరల్-11, ఓబీసీ-6, ఎస్సీ-3, ఎస్టీ-1), మహిళలకు-4 పోస్టులు (జనరల్-2, ఓబీసీ-1, ఎస్సీ-1)
- బార్బర్-11 పోస్టులు. పురుషులకు-9 పోస్టులు (జనరల్-5, ఓబీసీ-2, ఎస్సీ-1, ఎస్టీ-1), మహిళలకు-2 పోస్టులు (జనరల్-1, ఓబీసీ-1)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి/ మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణత. టైలర్, గార్డెనర్, కాబ్లర్ పోస్టులకు పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ చేసి ఉండాలి. రెండేండ్ల వరకు అనుభవం ఉండాలి. ఏడాది లేదా రెండేండ్ల డిప్లొమా లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 సెప్టెంబర్ 7 నాటికి టైలర్, గార్డెనర్, కాబ్లర్ పోస్టులకు 18 నుంచి 23 ఏండ్లు, మిగతా పోస్టులకు 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్ :** రూ. 21,700-69,100 (7వ వేతన పే స్కేల్ ప్రకారం)
- **శారీరక ప్రమాణాలు:**
- పురుషులు – 167.5 సెంటీమీటర్ల ఎత్తు, ఛాతీ – 80 సెం.మీ. గాలి పీల్చినప్పుడు 85 సెం.మీ.వరకు వ్యాకోచించాలి.
- మహిళా అభ్యర్థులు – 157 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి.
- **వాటర్ క్యారియర్, సఫాయి కర్మచారి, కుక్, వాషర్‌మెన్, బార్బర్ పోస్టులకు**
- పురుషులు – 162.5 సెంటీమీటర్ల ఎత్తు, ఛాతీ-77 సెం.మీ. గాలి పీల్చినప్పుడు 82 సెం.మీ.వరకు వ్యాకోచించాలి.
- మహిళా అభ్యర్థులు – 152.5 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి.
- **పీఈటీ టెస్ట్:** పురుషులు 7.30 నిమిషాల్లో 1.6 కి.మీ, మహిళలు 4.45 నిమిషాల్లో పరుగు పూర్తిచేయాలి.
- **లాంగ్ జంప్:** పురుషులు 11 అడుగులు , మహిళలు 9 అడుగులు, (3 అవకాశాల్లో)
- **హై జంప్:** పురుషులు 3 1/2 అడుగులు, మహిళలు 3 అడుగులు (3 అవకాశాల్లో)
- **బరువు:** వైద్య ప్రమాణాల ప్రకారం ఎత్తు, వయస్సుకు దామాషాగా ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/-, ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళా అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ట్రేడ్ టెస్ట్ ద్వారా
- రాతపరీక్షను 60 నిమిషాల్లో పూర్తిచేయాలి
- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరి తేదీ:** సెప్టెంబర్ 7
- **వెబ్‌సైట్:** www.recruitment.itbpolice.nic.in

రాతపరీక్ష సిలబస్:

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
జనరల్ అవేర్‌నెస్/ జనరల్ నాలెడ్జ్	15	15
నాలెడ్జ్ ఆఫ్ ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్	10	10
అనలిటికల్ ఆప్టిట్యూడ్ అండ్ ఎబిలిటీ	15	15
టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్/హిందీ నాలెడ్జ్	10	10

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ట్రేడ్స్‌మెన్లు

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ పరిధిలో పనిచేస్తున్న ఫీల్డ్ ఆర్డినెన్స్ డిపో, ఫీల్డ్ అమ్యునిషన్ డిపో, యూనిట్లలో ఖాళీగా ఉన్న మెటీరియల్ అసిస్టెంట్, ఫైర్‌మెన్, ట్రేడ్స్‌మెన్ (మేట్) తదితర పోస్టుల భర్తీకి కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విభాగలైన ఎఫ్ఓడీ, ఎఫ్ఏడీ, ఐఎన్ఎఫ్ డీఓయూ, ఎంటీఎన్ డీఓయూ, ఏఎంఎన్ సీఓవై యూనిట్లలో ఈ పోస్టులు భర్తీచేస్తారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 142 పోస్టులు
- మెటీరియల్ అసిస్టెంట్-6 పోస్టులు (జనరల్-3, ఓబీసీ-3)
- లోయర్ డివిజన్ క్లర్క్-1 పోస్టు
- ఫార్మాసిస్ట్-1 పోస్టు
- టెలిఫోన్ ఆపరేటర్-1 పోస్టు
- ఫైర్‌మ్యాన్-36 పోస్టులు (జనరల్-18, ఓబీసీ-10, ఎస్సీ-3, ఎస్టీ-5)
- ట్రేడ్స్‌మెన్ (మేట్)-94 పోస్టులు (జనరల్-49, ఓబీసీ-27, ఎస్సీ-8, ఎస్టీ-10)
- మల్టీ టాస్కింగ్ స్టాఫ్-1 పోస్టులు
- దోబీ-1 పోస్టు
- టైలర్-1 పోస్టు
- **వయస్సు:** 18 – 25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీలకు 30 ఏండ్ల వరకు, ఓబీసీలకు 28 ఏండ్ల వరకు, పీహెచ్‌సీలకు 35 ఏండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అర్హత:** పదోతరగతి/మెట్రిక్యులేషన్. ఫార్మసీ, ఇంటర్/డిప్లొమా, డిగ్రీలో ఉత్తీర్ణత. ఈ పోస్టులకు ఫిజికల్ టెస్ట్/ఎండ్యూరెన్స్ టెస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఫైర్‌మ్యాన్‌కు మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు కనీసం 165 సెం.మీ. ఎత్తు, ఛాతీ – 81.5 సెం.మీ. -85 సెం.మీ., బరువు కనీసం 50 కేజీలు ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 5,200 – 20,200 + గ్రేడ్ పే రూ. 1,800/- (ఫైర్‌మెన్‌కు గ్రేడ్ పే రూ.1900/-)
- **ఎంపిక:** ఫిజికల్ టెస్ట్, ఆబ్జెక్టివ్ రాత పరీక్ష ద్వారా.
- రాత పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. దీనికి కేటాయించిన సమయం రెండు గంటలు.
- ఆబ్జెక్టివ్ రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్-25 మార్కులు, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ -25 మార్కులు, జనరల్ ఇంగ్లిష్-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్-50 మార్కులు వస్తాయి.
- రాత పరీక్ష కేవలం ఇంగ్లిష్/హిందీ భాషలో ఉంటుంది.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను సంబంధిత పర్సనల్ అధికారికి పంపించాలి.
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన తేదీ నుంచి 21 రోజుల్లోగా పంపాలి. పూర్తి వివరాల కోసం ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www. indianarmy.nic.in

ఐఐఎస్సీలో ఇన్‌స్ట్రక్టర్స్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.



వివరాలు:

ఐఐఎస్సీ దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటి. సైన్స్ పరిశోధనలకు ఐఐఎస్సీ పేరుగాంచింది.

- **పోస్టు:** ఇన్‌స్ట్రక్టర్స్
- **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎన్విరానమెంటల్ సైన్సెస్ అండ్ మెటీరియల్స్.
- ఖాళీల సంఖ్య – 7
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ కోర్సు పూర్తిచేసి, రెండేండ్ల అనుభవం ఉన్నవారు.
- **వయస్సు:** 2017, ఆగస్టు 11 నాటికి 35 ఏండ్ల మధ్య ఉన్నవారు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** సీవీని ఈ మెయిల్ (recruitment@admin.iisc.ernet.in) చేయాలి.
- **చివరితేదీ:** ఆగస్టు 11
- **వెబ్‌సైట్:** http://www.iisc.ac.in

హైదరాబాద్ ఎస్‌పీఎంసీఐఎల్‌లో ఆఫీసర్లు

సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్) రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

SECURITY PRINTING AND MINTING CORPORATION OF INDIA LIMITED

వివరాలు:

ఇది మినీ రత్న కంపెనీ. ఇది డిజైనింగ్, తయారీ భద్రతా పత్రాలు, ప్రింటింగ్ కరెన్సీ అండ్ బ్యాంక్ నోట్స్, పాస్‌పోర్ట్స్, నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్స్, నాణెంల ముద్రణ, తపాలా స్టాంప్‌లను తయారుచేస్తుంది.

- మొత్తం పోస్టులు:12
- పోస్టు పేరు: ఆఫీసర్
- ఫైనాన్స్ విభాగంలో 9 పోస్టులు (జనరల్-3, ఓబీసీ-3, ఎస్సీ-4), హెచ్‌ఆర్ విభాగంలో 3 పోస్టులు (జనరల్-2, ఎస్సీ-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఫైనాన్స్ విభాగానికి సీఏ/ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ(ఫైనాన్స్)లో ప్రథమశ్రేణి, మేనేజ్‌మెంట్‌లో పీజీడిప్లొమా లేదా ఎంబీఏ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. హెచ్‌ఆర్ విభాగానికి మాస్టర్ డిగ్రీ (పీఎం అండ్ ఐఆర్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ(హెచ్‌ఆర్)లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత లేదా మేనేజ్‌మెంట్‌లో పీజీడిప్లొమా ఉత్తీర్ణత. ఎల్‌ఎల్‌బీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయస్సు:** 2017 ఆగస్టు 28 నాటికి గరిష్ఠంగా 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్ :** రూ.16,400-40,500/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 400/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/-)
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ
- రాతపరీక్ష 150 మార్కులకు ఉంటుంది. దీనిలో ప్రొఫెషనల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి ప్రశ్నలను ఇస్తారు.
- మొత్తం 120 ప్రశ్నలను 120 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 28
- **ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ రాత పరీక్ష:** అక్టోబర్‌లో
- వెబ్‌సైట్:www.spmcil.com.

బెల్‌లో ఇంజనీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఒక నవరత్న కంపెనీ.

BHARAT ELECTRONICS
QUALITY. TECHNOLOGY. INNOVATION

- మొత్తం పోస్టులు-10 పోస్టులు
- డిప్యూటీ జనరల్ మేనేజర్/మేనేజర్-3, సీనియర్ ఇంజినీర్-6, డిప్యూటీ ఇంజినీర్-1
- **అర్హత:** సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్. సంబంధిత విభాగంలో అనుభవం.
- **వయస్సు:** 32 ఏండ్లకు మించరాదు .
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:**www. bel-india.com

ఎయిర్‌ఫోర్స్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

- **చాలెంజింగ్ కెరీర్, మంచి జీతభత్యాలు**
- **డిగ్రీ, పీజీ చేసినవారికి అవకాశం**
- **ఆన్‌లైన్‌లో దరఖాస్తు**
- **చివరితేదీ ఆగస్టు 28**

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో కమిషన్డ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

భారత రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో ఎయిర్‌ఫోర్స్ పని చేస్తుంది.

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ, మెట్రాలజీ బ్రాంచీలో కోర్సు. 2018, జూలైలో ఈ కోర్సు ప్రారంభమవుతుంది.
- **నోట్:** ఈ పోస్టులకు పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఫ్లయింగ్ బ్రాంచీ:
- **అర్హతలు:** ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ సీ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత లేదా బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018, జూలై 1 నాటికి 20 -24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు – 162.5 సెం.మీ., కాళ్ల పొడవు – కనీసం -99 సెం.మీ., గరిష్ఠం – 120 సెం.మీ. ఉండాలి.
- ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) మెట్రాలజీ:**
- మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, జాగ్రఫీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, అప్లయిడ్ ఫిజిక్స్, ఓషనోగ్రఫీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెట్రాలజీ, అగ్రికల్చరల్ మెట్రాలజీ, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, జియోఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ బయాలజీ. పై ఏదైనా ఒక సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత. అదేవిధంగా డిగ్రీస్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018, జూలై 1 నాటికి 20 – 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** పురుషుల కనీస ఎత్తు 157.5 సెం.మీ, మహిళలు అయితే 152 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- పీసీ ఆఫీసర్స్‌గా ఎంపికైన పురుష అభ్యర్థులకు పర్మినెంట్ కమిషన్ కింద పోస్టులు ఇస్తారు. అదే విధంగా షార్ట్ సర్వీస్ కమిషన్ కింద పురుష, మహిళా అభ్యర్థులకు ఫ్లయింగ్ బ్రాంచీలో 14 ఏండ్ల కాలపరిమితికి ఉద్యోగం ఇస్తారు. మొదట పదేండ్లు తర్వాత నాలుగేండ్లు పొడిగింపు చేస్తారు.
- **ఎంపిక:** దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను డెహ్రాడూన్, మైసూర్, గాంధీనగర్, వారణాసిల్లోని ఏదైనా ఒక ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డుల్లో టెస్టింగ్ కోసం పిలుస్తారు.
- మూడుదశల్లో ఎంపిక జరుగుతుంది.
- స్టేజ్ -1లో మొదటిరోజు ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పీపీఏ, డిస్కషన్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ఈ దశ స్క్రీనింగ్ టెస్ట్‌లాంటిది. దీనిలో అర్హత సాధించినవారికి మాత్రమే రెండో దశకు అనుమతిస్తారు.
- స్టేజ్ – 2లో సైకాలజికల్ టెస్ట్, గ్రూప్ టెస్టులు, ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. తర్వాత ఐదురోజులపాటు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచీ కోసం పైలట్ సెలక్షన్ సిస్టం/పీఏబీటీని నిర్వహిస్తారు. ఇది జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే నిర్వహించే టెస్ట్.
- **శిక్షణ:** జూలై 2018 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. ఫ్లయింగ్ బ్రాంచీకి 74 వారాలు, మెట్రాలజీ విభాగానికి 52 వారాలు శిక్షణ ఉంటుంది.
- **పే అండ్ అలవెన్స్‌లు:** పే మ్యాట్రిక్స్ ఆఫ్ 7 పే కమిషన్ ప్రకారం పే లెవల్ 10 జీతభత్యాలు ఇస్తారు. డీఏ, కిట్ మెయింటెనెన్స్, టీఏలను అదనంగా చెల్లిస్తారు. వీటికి అదనంగా వసతి, వైద్యం, క్యాంటీన్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఆగస్టు 5 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.careerairforce.nic.in

నేషనల్ టెస్ట్ హౌస్‌లో ఎంటీఎస్‌లు

నేషనల్ టెస్ట్ హౌస్ (ఎన్‌టీహెచ్) దేశవ్యాప్తంగా తన కార్యాలయాల్లో టెక్నికల్, ఎలక్ట్రిక్ వెల్డర్ విభాగాల్లో ఖాళీగా ఉన్న మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఎన్‌టీహెచ్ అనేది వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం& ప్రజా పంపిణీ మంత్రిత్వశాఖ పరిధిలో పని చేస్తుంది.

- **పోస్టు పేరు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 51 పోస్టులు (జనరల్-30, ఓబీసీ-11, ఎస్సీ-7, ఎస్టీ-2, ఎక్స్ సర్వీస్ మెన్-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డ్/సంస్థ నుంచి సైన్స్ సబ్జెక్ట్‌తో మెట్రిక్యులేషన్/పదోతరగతి, ఎలక్ట్రిక్ వెల్డర్ పోస్టులకు పదోతరగతి+ సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 5,200 – 20,200 + గ్రేడ్ పే రూ.1,800/- (ఎలక్ట్రిక్ వెల్డర్‌కు గ్రేడ్ పే రూ. 1900/-)
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా
- రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిగా నింపి అవసరమైన సర్టిఫికెట్లను జతపరిచి సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన 30 రోజుల్లోగా పంపాలి.
- **వెబ్‌సైట్:** http://www.nth.gov.in

పవర్‌గ్రిడ్‌లో

పవర్‌గ్రిడ్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

పవర్‌గ్రిడ్ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది ఒక నవరత్న కంపెనీ.

- డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) – 3, డిప్యూటీ మేనేజర్ (ఎలక్ట్రికల్) – 4, సీనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) – 3, విజిలెన్స్ ఆఫీసర్ – 1, ఆఫీసర్ (కంపెనీ సెక్రటరీ) – 1, అసిస్టెంట్ ఆఫీసర్ (అకౌంట్స్) – 5 ఖాళీలు ఉన్నాయి.
- ఎంపిక: దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** https://www.powergridindia.com


సుకుమార్

మూసధోరణికి భిన్నంగా సృజనాత్మక కథాంశాలతో సినిమాల్ని తెరకెక్కిస్తుంటారు దర్శకుడు సుకుమార్. తను చేసే ప్రతి సినిమాలో కొత్తదనం ఉండాలని తపిస్తుంటారాయన. దర్శకుడిగా తను నమ్మిన పంథాలోనే సినిమాలు చేస్తున్న ఆయన మరోవైపు తన అభిరుచులు, ఆలోచనలకు అద్దం పడుతూ నవతరంలో దాగివున్న ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో సుకుమార్ రైటింగ్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థపై సుకుమార్ నిర్మిస్తున్న తాజా చిత్రం ‘దర్శకుడు’. హరిప్రసాద్ జక్కా దర్శకుడు. అశోక్, ఇషా జంటగా నటిస్తున్నారు. ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సుకుమార్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...

నా సీన్ కొట్టేశావని తిట్టుకుంది!

• ‘దర్శకుడు’ సినిమా చూశారా?

నిర్మాతగా కాకుండా ప్రేక్షకుడిగా సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. కొన్నిసార్లు ఫలితం ముందే తెలిసిపోతుంది. ఈ సినిమా విషయంలో అదే జరిగింది. విజయవంతమవుతుందనే నమ్మకముంది.

• మీ శైలిలోనే ఈ సినిమా ఉంటుందా?

నా తరహా కథ కాదిది. వినూత్న ప్రేమ కథతో దర్శకుడు హరిప్రసాద్ సినిమా చేశారు. చాలా అందంగా ఉంటుంది.

• మీరు సెట్స్‌లో ఎలా ఉండేవారో అదే రీతిలో సినిమాలో అశోక్ పాత్ర కనిపిస్తుందని అంటున్నారు. నిజమేనా?

తను బాగా దగ్గర నుంచి చూసిన దర్శకుడిని నేనే. నాతోనే ఎక్కువ ట్రావెల్ అయ్యాడు. దర్శకుడి పాత్ర చేస్తున్నాడు కాబట్టి సెట్స్‌లో నా బాడీలాంగ్వేజ్‌ను అనుకరించే ప్రయత్నం చేశాడు.

• ఏ నమ్మకంతో అతడిని హీరోగా అంగీకరించారు?

ఓ సందర్భంలో హరిప్రసాద్ వినిపించిన కథ నాకు బాగా నచ్చింది. మంచి మార్కెట్ ఉన్న హీరోతో సినిమా చేద్దామని అతడితో అన్నాను. బయటి వారికి కథలు వినిపించడం కంటే అశోక్‌తోనే ఈ సినిమా చేస్తే బాగుంటుందని హరిప్రసాద్ చెప్పారు. నెమ్మదస్తుడు, తక్కువ మాట్లాడుతాడు, చిన్నప్పటి నుంచి నాకు తెలుసు కాబట్టి హీరోగా వద్దన్నాను. కానీ హరి ప్రసాద్ మాత్రం అశోక్‌తో నేను ఎలాగైనా ఈ సినిమా చేయించుకుంటానన్నాడు.

• అశోక్ నటనను తెరపై చూసుకుంటే ఏమనిపించింది?

భావోద్వేగభరిత సన్నివేశాల్లో చక్కగా నటించాడు. అనుభవమున్న నటుడిగా తన పాత్రలో ఇమిడిపోయాడు. అతడి ముఖంలో నిజమైన ఎమోషన్స్ కనిపించాయి. కోపం, బాధ, అవేశం లాంటి భావోద్వేగాల్ని సహజంగా పలికించాడు.

• దర్శకుడిగా అగ్ర నటులతో సినిమాలు చేస్తూ మరోవైపు నిర్మాతగా కొనసాగడం ఒత్తిడిగా అనిపించడం లేదా?

కథ మనదే అయినపుడు ఎక్కువ బాధ్యతలు ఉంటాయి. రాయడం, ప్రతిదీ దగ్గరుండి చూసుకోవడం చేయాల్సివస్తుంది. కానీ ఈ సినిమా కథ నాది కాదు. హరిప్రసాద్ సిద్ధం చేశాడు కాబట్టి ఎలాంటి టెన్షన్స్ లేవు. నా అనుభవాన్ని ఉపయోగించి కొన్ని చిన్న చిన్న సలహాలు మాత్రమే ఇచ్చాను. నిర్మాణ విషయంలో కొంత వరకే పట్టించుకుంటాను. ఎక్కువ తలకు ఎక్కించుకుంటే మనలో ఉండే సృజనాత్మకత దెబ్బతింటుంది. అలాంటివాటికి దూరంగా ఉంటాను. ఈ సినిమా విషయంలో మా రెండో అన్నయ్య విజయ్‌కుమార్, థామస్‌రెడ్డిలకు ఆ బాధ్యతలను అప్పజెప్పాను.

• మీరు నిర్మించే సినిమాల విషయంలో ఎక్కువగా సెట్స్‌కు వెళ్లరట? కారణమేమిటి?

‘దర్శకుడు’ సినిమా సెట్స్‌కు ఒక్కరోజు కూడా వెళ్లలేదు. ఒకవేళ సెట్స్‌కు వెళితే ఆ సినిమాకు నేనే దర్శకత్వం వహించానని ప్రచారం చేస్తారు. కథ రాసుకొని, తన ఊహలకు అనుగుణంగా పాత్రలకు సృష్టించుకొని, సినిమా కోసం ఎన్నో కష్టాలు పడిన దర్శకుడి శ్రమకు విలువ లేకుండా పోతుంది. భవిష్యత్తులో నేను నిర్మించే సినిమాల విషయంలో ఇదే పంథాను అనుసరిస్తాను.

• సినిమాలో దర్శకుడి ప్రేమను చూపిస్తున్నారా? అతడి స్వార్థాన్ని తెరకెక్కిస్తున్నారా?

వృత్తి పట్ల స్వార్థం ప్రతి దర్శకుడిలో ఉంటుంది. కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నామని ఫీలవుతుంటాం. నిజానికి మనకు నిజమైన ఆనందం కలిగించే విషయం సినిమానే కాబట్టి దాని కోసమే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాం. ఇంటికి వెళితే పిల్లలు చేస్తున్న పనుల గురించి భార్య గొప్పగా చెబుతుంది. అవి ఆనందం కలిగిస్తాయి. కానీ వాటి కంటే ఓ సినిమా హిట్టయినపుడు కలిగే ఆనందం ఎన్నో రేట్లు ఎక్కువగా ఉంటుంది. వృత్తిలోనే ఆనందం ఎక్కువ ఉండటంతో వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా దానికే కేటాయిస్తున్నాం. ఓ సందర్భంలో మా ఆవిడతో కలిసి షాపింగ్‌కు వెళ్లినపుడు రెండు నిమిషాల్లో బట్టల సెలెక్షన్ పూర్తయింది. ‘100 పర్సెంట్ లవ్’ చిత్రీకరణ సమయంలో తమన్నా డ్రెస్ విషయంలో ఇబ్బందులు తలెత్తడంతో సరైన కలర్ కుదిరే వరకు షూటింగ్ ఆపేశాం. మూడు గంటల పాటు కష్టపడి డ్రెస్ సెలెక్ట్ చేశాం. ఆ సమయంలో పక్కనే ఉన్న నా భార్య హీరోయిన్ కోసం అంత సమయం కేటాయించారు కానీ నా కోసం మాత్రం రెండు నిమిషాలు కూడా కేటాయించలేకపోయారని అన్నది. ఇలాంటి అంశాల్లో దర్శకుడిలో స్వార్థం కనిపిస్తుంది.

• మీ నిజజీవితంలోని ఓ సంఘటనను ఈ సినిమాలో ఉపయోగించామని దర్శకుడు హరి ప్రసాద్ అన్నారు. ఆ సన్నివేశం చూసి మీ భార్య ఏమన్నారు?

నా సీన్ కొట్టేశావని తిట్టుకున్నది (నవ్వుతూ). మొదట్లో తనకు సినిమాల గురించి ఏమి తెలియదు. నా సినిమాలు చూడలేదు. దర్శకుడిగా నా పని ఏమిటో కూడా తెలియదు. ఆరిస్టులకు ఎలా నటించాలో నేను చెబుతానంటే తను నమ్మలేదు. నటులకు మీరు చెబుతారా వారు ఆ మాత్రం కూడా చేయలేరా? వారికి మీరు చెప్పడమేమిటని ప్రశ్నించింది. అది అమాయకత్వమో, ఏమనుకోవాలో అర్థం కాలేదు. ఇప్పటికీ ఆమెకు నేను చేసేది అర్థం కాదు.

• రంగస్థలం ఎంతవరకువచ్చింది? 1985 బ్యాక్‌డ్రాప్‌లో సినిమా చేయడానికి కారణమేమిటి?

నలభై నుంచి యాభై శాతం వరకు చిత్రీకరణ పూర్తయింది. పల్లెటూళ్లలో ఉండే అనుబంధాలు, ఆప్యాయతల్ని అద్దంపట్టే చిత్రమిది. సంక్రాంతికి విడుదల చేయబోతున్నాం. కథాపరంగానే 1985 నేపథ్యాన్ని ఎంచుకున్నాం. అలాంటి సెటప్ ఉంటేనే సినిమా వర్కవుట్ అవుతుందని అనిపించింది.

• మీ పంథాకు భిన్నంగా పల్లెటూరి నేపథ్యాన్ని ఎంచుకున్నారెందుకని?

పాతిక సంవత్సరాలకు పైగా పల్లెటూళ్లలోనే పెరిగాను. అక్కడే చదువుకున్నాను. ‘ఆర్య’ సినిమాలో పల్లెటూళ్ల పట్ల నాకున్న ప్రేమను ఆ పాటలో చూపించాను. గ్రామీణ నేపథ్యంలో పూర్తిస్థాయిలో సినిమా చేయాలని చాలా రోజులుగా అనుకున్నాను. రంగస్థలంతో ఆ నిరీక్షణ ఫలించింది

• పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై చూపించడం ఎలాంటి అనుభూతిని కలిగిస్తున్నది?

పాపికొండల్లో చిత్రీకరణ జరిపే సమయంలో అక్కడ కరెంట్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఏమీ లేవు. నాకున్న చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు అక్కడికి వెళ్లగానే తగ్గిపోయాయి. జీవితం అలాగే ఉండిపోతే బాగుండునని అనిపించింది. హైదరాబాద్‌లో తిరిగి అడుగుపెట్టగానే ఆ సమస్యలు మొదటకు వచ్చాయి. తెలియకుండానే కలుషిత వాతావరణం మనపై చాలా ప్రభావాన్ని చూపిస్తున్నది.

‘జయ జానకి నాయక’ గీతాలు


మిర్యాల రవీందర్‌రెడ్డి, శరత్‌కుమార్, వినాయక్, సాయిశ్రీనివాస్, రకుల్‌ప్రీత్‌సింగ్, బోయపాటి శ్రీను, దేవిశ్రీప్రసాద్, జగపతిబాబు

‘ప్రేమించిన అమ్మాయి దూరమైపోతే నేటితరం అబ్బాయిలు వ్యసనాలకు అలవాటు పడిపోవడమో.. లేక ఆ అమ్మాయిని ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించడమో చేస్తుంటారు. అలా కాకుండా తల్లిదండ్రుల్ని, తోబుట్టువుల్ని జీవితాంతం ఎలా ప్రేమిస్తామో.. ప్రేమించిన యువతిని కూడా అదే తీరుగా చూసుకునే ఓ యువకుడి కథతో ‘జయ జానకి నాయక’ చిత్రాన్ని రూపొందించాను’ అన్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రగ్యాజైస్వాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మాత. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ చిత్ర గీతాల్ని సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆడియో సీడీని వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. ట్రైలర్‌ను హర్షిత్, ద్వారక విడుదల చేశారు. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను మాట్లాడుతూ ‘నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొనే ఓ ప్రధాన సమస్యను ఇతివృత్తంగా ఎంచుకొని ఈ సినిమా తీశాను. హంసలదీవిలో తీసిన పోరాటఘట్టం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. రకుల్‌ప్రీత్‌సింగ్ నటించిన కొన్ని సన్నివేశాల్ని చూస్తే కన్నీళ్లు వస్తాయి. వాణీ విశ్వనాథ్, శరత్‌కుమార్, జగపతిబాబు పాత్రలు చిరకాలం గుర్తుండిపోతాయి. మిర్యాల రవీందర్‌రెడ్డితో మరొక సినిమా చేయాలనివుంది’ అన్నారు. ‘బోయపాటి శ్రీను సినిమా కోసం అణువణువు తపిస్తారు. సాయిశ్రీనివాస్ చక్కటి పరిణితితో కూడిన నటనను ప్రదర్శించాడు. పాటలన్ని బాగున్నాయి’ అని వి.వి.వినాయక్ చెప్పారు. బోయపాటితో తనకిది నాలుగో చిత్రమని, కథానుగుణంగా చక్కటి సాహిత్యం కుదిరిందని సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ పేర్కొన్నారు. సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ‘బోయపాటి శ్రీనుని సొంత అన్నయ్యలా భావిస్తాను. ప్రతి విషయంలో ఆయన నాకు అండగా నిలిచారు. నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన సినిమా ఇది. తన కలల్ని నాలో చూసుకుంటూ మా నాన్నగారు నన్ను నడిపిస్తున్నారు’ అని అన్నారు. ప్రేక్షకుల అంచనాల్ని అందుకునేలా సినిమాను తీర్చిదిద్దామని నిర్మాత చెప్పారు. తన కెరీర్‌లో విభిన్నమైన పాత్ర ఇదని రకుల్‌ప్రీత్‌సింగ్ తెలిపింది. ‘నువ్వేలే..నువ్వేలే...’ అనే పాటను ఎంతో ఆర్తితో రాశానని గీత రచయిత చంద్రబోస్ పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా తెలుగులో పునరాగమనం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని వాణీ విశ్వనాథ్ పేర్కొంది. సినిమాలో ఐదు పాటల్ని రాశానని గీత రచయిత శ్రీమణి చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ పద్మావతి, మిరియాల నవ్య, కోనేరు కిరణ్, ప్రేమ్‌రక్షిత్, నల్లమలుపు బుజ్జి, జెమినీ కిరణ్, రామ్‌లక్ష్మణ్, శ్రావణ్, శశాంక్, భరణి తదితరులు పాల్గొన్నారు.


సాయిపల్లవి, దుల్కర్ సల్మాన్

తెలుగులో ‘కలి’

దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి జంటగా నటించిన మలయాళ చిత్రం ‘కలి’ తెలుగులో అనువాదంకానుంది. ఈ చిత్ర తెలుగు డబ్బింగ్ హక్కులను సీడెడ్ పంపిణీదారుడు డి.వి.కృష్ణస్వామి దక్కించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ‘ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల రెండోవారంలో టైటిల్, లోగోను విడుదల చేస్తాం. సెప్టెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. గోపీసుందర్ సంగీతాన్నందించారు’ అన్నారు. ఈ చిత్రానికి మాటలు: భాషాశ్రీ, సాహిత్యం: సురేంద్రకృష్ణ, సినిమాటోగ్రఫీ: గిరీష్ గంగాధరన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దక్షిణ్ శ్రీనివాస్, దర్శకత్వం: సమీర్ తాహిర్.

సమాచారశాఖ ఆధ్వర్యంలో
ఫొటోగ్రఫీ పోటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించేందుకు సమాచారశాఖ సన్నాహాలు చేస్తున్నది. ప్రధానంగా మూడు విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో మొదటి విభాగం బంగారు తెలంగాణ.. హరితహారం, మిషన్‌భగీరథ, ఆరోగ్యలక్ష్మి, పర్యాటక, సంస్కృతి, సంప్రదాయాలు తదితర అంశాలపై ఫొటోలు పంపించాలి. రెండో విభాగం తెలంగాణ పండుగలు.. బోనాలు, బతుకమ్మ, కృష్ణా పుష్కరాలు తదితర ఉత్సవాలకు సంబంధించిన ఫొటోలు, మూడో విభాగంలో న్యూస్ పిక్చర్‌ను పోటీకి పంపించాల్సి ఉంటుంది. న్యూస్ పిక్చర్ విభాగంలో దినపత్రిక, జర్నల్స్‌లో ప్రచురితమైన ఫొటోలను మాత్రమే స్వీకరిస్తారు. ఆగస్టు 2016 నుంచి తెలంగాణ రాష్ట్రంలో తీసిన ఫొటోలను మాత్రమే ఎంట్రీకి స్వీకరిస్తారు. వివరాలకు సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఏ హష్మిని సంప్రదించాలి. www.ipr. tg.nic. in వెబ్‌సైట్‌లో కూడా వివరాలు అందుబాటులో ఉన్నాయి.

బీసీల ఆర్థిక ప్రగతే సర్కారు ధ్యేయం

కులవృత్తుల అభివృద్ధికి ఆధునిక యంత్రాల వినియోగం ● మంత్రి జోగు రామన్న వెల్లడి



మంగళవారం సచివాలయంలో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీవర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. శాలివాహన (కుమ్మరి) సంఘం ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బీసీలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా పథకాలను రూపొందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదుగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ కుల వృత్తులపైనే ఆధారపడి ఉందని, ఆ వృత్తుల్లో అత్యాధునిక యంత్రాల వినియోగానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పాత పద్ధతులను ఆచరించడం మానుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కుమ్మరి వర్గాల ఉత్పత్తులతో మానవ జీవితం ముడిపడి ఉన్నదని, మనిషి పుట్టుక, పెండ్లి సహా ప్రతి అంశంలో కుమ్మరివర్గాల మట్టి ఉత్పత్తుల అవసరం ఉంటుందని అన్నారు. కుమ్మరి వర్గాలు ఆధునిక పద్ధతుల్లో వ్యాపారం చేసుకునేందుకు, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని మంత్రి వెల్లడించారు. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న పలు కార్యక్రమాలను పరిశీలించేందుకు త్వరలో ప్రత్యేక బృందాలను పంపుతామని తెలిపారు. కుమ్మరి వర్గాల ప్రాముఖ్యతను, ఎంబీసీల ప్రగతికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ఈ సందర్భంగా వివరించారు. అధునాతన యంత్రాలతో వస్తువులు తయారు చేసేందుకు వీలుగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, వస్తు అమ్మకాలకు అవకాశాలు కల్పించాలని కుమ్మరి సంఘం ప్రతినిధులు కోరారు. చెరువుల్లో మట్టిని వినియోగించుకునే అవకాశం కల్పించాలని, మట్టితో తయారు చేసిన గణేశ్ ప్రతిమలను కొనుగోలు చేసేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్, అదనపు కార్యదర్శి సైదా, అదనపు డైరెక్టర్లు మల్లయ్యభట్టు, అలోక్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పెనాల్టీలపై
నేడు టీ శాట్ లైవ్ షో

టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా సందేహాలు తీర్చుకోవచ్చు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో అమలుచేస్తున్న పెనాల్టీలు, 12 పాయింట్ల ట్రాఫిక్ నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కార్యక్రమాన్ని టీ-శాట్ (మన టీవీ) ఏర్పాటుచేసింది. బుధవారం మధ్యాహ్నం మూడుగంటల నుంచి ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రఘునాథ్, పోలీస్, న్యాయశాఖ అధికారులు ప్రత్యక్ష ప్రసారంలో సలహాలు, సూచనలు అందిస్తారని టీ శాట్ తెలిపింది. వినియోగదారులు 18004254038, 04023553473 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చునని వివరించింది.

ప్రజాధనాన్ని పెంచితే
విమర్శలా?

ఇసుకతో ఖజానాకు వెయ్యి కోట్ల ఆదాయం
కాంగ్రెస్‌పై ఐడీసీ చైర్మన్ శంకర్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ ఏడేండ్లపాలనలో (2007-14 వరకు) ఇసుక ద్వారా రూ.39.60 కోట్ల ఆదాయం వస్తే, కేవలం మూడేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1024 కోట్ల ఆదాయాన్ని సమకూర్చిందని తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ నేతల జేబుల్లోకి వెళ్లే ప్రభుత్వ ఆదాయాన్ని ఖజానాకు మళ్లించినందుకు ఆ పార్టీ నేతలు టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారా? అని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో ఇసుక మాఫియా వల్ల సర్కార్ ఖజానాకు వేల కోట్లు గండిపడేదని, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని ఆ పార్టీ నేతలు తమ జేబుల్లో వేసుకున్నారని మంగళవారం ఐడీసీ కార్యాలయంలో ఆయన మీడియాకు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకునే టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇసుకపాలసీ తెచ్చి సామాన్యుడికి, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలుగకుండా చర్యలు తీసుకుందని అన్నారు. నెహ్రూకాలం నుంచిదళితుల కోసం కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది? మూడేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసింది? అని చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఇందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిద్ధమేనా? అని శంకర్‌రెడ్డి సవాల్ విసిరారు.

మైక్రో ఇరిగేషన్‌కు రూ.130కోట్లు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద మైక్రో ఇరిగేషన్‌కు రాష్ట్రప్రభుత్వం రూ.130కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేసింది.

తిరుమలలో ఘనంగా వెంగమాంబ వర్ధంతి

తిరుమల, నమస్తే తెలంగాణ: వేంకటేశ్వరస్వామికి అపర భక్తురాలైన కవయిత్రి తరిగొండ వెంగమాంబ 200వ వర్ధంతి తిరుమలలో మంగళవారం ఘనంగా జరిగింది. వరాహస్వామి అతిథి గృహాల వద్ద ఉన్న వెంగమాంబ బృందావనంలో ఆమె సమాధికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. భక్తులకు వెంగమాంబ సమాధి దర్శనం కల్పించి ప్రసాద వితరణ చేశారు.

కాంగ్రెసోళ్లే ఇసుక దొంగలు



మీడియాతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి, వీజీ గౌడ్

- మీరాకుమార్‌తో అన్నీ అబద్ధాలు చెప్పించారు
- ప్రాజెక్టులపై సైంధవ పాత్ర.. 2024లోనూ అధికారం కల్లే
- తెలంగాణలో శాండ్, ల్యాండ్ మాఫియాకు స్థానం లేదు
- నిప్పులు చెరిగిన మండలి విప్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కాంగ్రెస్‌వి అభివృద్ధికి అడ్డుపడే కుట్రలు: ఎమ్మెల్సీ వీజీ గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మూడు వారాలుగా సమస్యే కాని దాన్ని సమస్యగా చిత్రీకరించి ప్రభుత్వంపై, మంత్రి కేటీఆర్‌పై విషయం కాంగ్రెస్ నేతలు విషం కక్కుతున్నారు. సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో జరిగింది ఒకటైతే, మసిబూసి మారేడుకాయచేశారు. మాజీ స్పీకర్ మీరాకుమార్‌ను తీసుకొచ్చి కుల రాజకీయాలకు తెరలేపారు. ఆమెను పక్కదారి పట్టించి అబద్ధాలు చెప్పించారు' అని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేండ్లలో ఇసుకపై రూ.50 కోట్ల ఆదాయం కూడా రాలేదని, టీఆర్‌ఎస్ మూడేండ్లలో పాలనలో రూ.1200 కోట్ల ఆదాయం వచ్చిందని గుర్తుచేశారు. ఈ గణాంకాలను బట్టి ఇసుక దొంగలు(లూటర్లు) ఎవరో, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎన్ని కోట్లు దిగమింగారో మీరాకుమార్ గమనించాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో కంటే టీఆర్‌ఎస్ హయాంలోనే సీఎం కేసీఆర్ ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అమలుచేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే నిధులను దారి మళ్లించారని, అలా చేయకుండా ఉండేందుకు ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ యాక్ట్ తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్రంలో మూడేండ్లలో దళితులు, గిరిజనులపైనే కాకుండా ఏవర్గం వారిపైనా చిన్నదాడి జరుగలేదని, తప్పుడు సమాచారం, అబద్ధాలను అదేపనిగా ప్రజల్లోకి తీసుకెళ్లే కాంగ్రెస్ ప్రయత్నాలను తిప్పికొడుతామన్నారు.తెలంగాణలో శాండ్, ల్యాండ్ మాఫియాకు స్థానం లేదని, పాతబుద్ధులు మార్చుకోకుండా కుల రాజకీయాలు చేస్తామంటే కుదురదని కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించకుండా 29 కేసులు వేసి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలకు కాంగ్రెస్ నేతలే డిమాండ్ చేస్తారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగ నియామకాలు జరగకుండా 19 కేసులు వేశారని, విద్యుత్‌శాఖలోఉద్యోగుల క్రమబద్ధీకరణపైనా కేసులు వేయించి అడ్డుపడ్డారు..ఇవేం ద్వంద్వ ప్రమాణాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడుతున్నదని ఎమ్మెల్సీ వీజీగౌడ్ మండిపడ్డారు.



పెద్దపల్లి జిల్లా ఖమ్మంపల్లిలో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే పుట్ట మధు, ప్రభుత్వ సలహాదారు వివేక్ తదితరులు

చిల్లర రాజకీయాలు మానండి

- ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదు
- కాంగ్రెస్ నాయకులకు మంత్రులు తుమ్మల, ఈటల హితవు

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రజలను తప్పుదోవ పట్టించేలా, కులాల పేరిట వారి మనోభావాలు దెబ్బతినేలా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మండిపడ్డారు. ఇలాంటి చిల్లర, నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాలో పర్యటించిన వారు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రామగుండం రీజియన్-3 అడ్రియాల ప్రాజెక్ట్ పరిధిలో ఒకే రోజు లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో మానేరు నదిపై రూ.50 కోట్లతో నిర్మించనున్న వంతెన పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలతో ముందుకుసాగుతుంటే, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఢిల్లీ నాయకులతో నాటకాలు ఆడిస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రుల వెంట మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ తదితరులు ఉన్నారు.

ఓర్వలేకే దిగజారుడు రాజకీయాలు

- ఉనికి కోసం జాతీయనేతను సిరిసిల్లకు రప్పించారు
- కేటీఆర్‌పై నిందారోపణలు మోపితే ఊరుకోబోమని హెచ్చరిక
- కాంగ్రెస్, టీడీపీలపై టీఆర్‌ఎస్ నేతల ధ్వజం
- కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారు: ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్





మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, గువ్వల బాలరాజు, ఆగ్రో చైర్మన్ కిషన్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ అద్భుత పాలన చూసి కాంగ్రెస్ ఓర్వలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని టీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ తెలంగాణ ముద్దుబిడ్డ కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉనికి కోసం పేరుపొందిన జాతీయ నేతకు కులం కార్డు తగిలించి సిరిసిల్లకు తీసుకువచ్చారంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్, తెరాస శాసనసభాపక్ష కార్యాలయాల్లో వేర్వేరుగా మీడియాతో మాట్లాడిన నేతలు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. సుపరిపాలన, సీఎం కేసీఆర్ వినూత్న నిర్ణయాలతో అంతర్జాతీయంగా తెలంగాణకు వస్తున్న పేరు, ప్రతిష్ఠలు చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్‌ను రాష్ట్రానికి రప్పించి తెలంగాణకు మచ్చ తెచ్చేలా కాంగ్రెస్ నేతలు ప్రవర్తించారని ఫైరయ్యారు. అంతర్జాతీయస్థాయిలో మంత్రి కేటీఆర్ పేరు గడిస్తుండటంతో కాంగ్రెస్ నేతలకు నిద్ర పట్టడం లేదని, ఆయనను టార్గెట్ చేసి దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు: ఎమ్మెల్యే గువ్వల

దళితులను ఉపయోగించుకొని రాజకీయం చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు. కులాల మధ్య విభజన రేఖ సృష్టించి రాజకీయాలు చూస్తే నమ్మేందుకు దళితులు సిద్ధంగా లేరు.

మీరాకుమార్ నోట అబద్ధాలు చెప్పించారు: ఆగ్రో చైర్మన్ కిషన్‌రావు

ఓటు బ్యాంకు రాజకీయాలకు బరితెగించిన కాంగ్రెస్.. మీరాకుమార్‌ను సిరిసిల్లకు రప్పించి అబద్ధాలు పలికించారు. టీఆర్‌ఎస్‌పై పోరాడేందుకు ఎక్కడా అవకాశం లభించక సిరిసిల్ల ఘటనను భూతద్దంలో చూపించి దళితుల దృష్టిని ఆకర్షించేందుకు కాంగ్రెస్ యత్నిస్తున్నది.

కాంగ్రెస్‌ను దళితులు నమ్మరు: సాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి

ఒక చిన్న ఘటనను తీసుకొని కాంగ్రెస్ దేశవ్యాప్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఇతర కాంగ్రెస్ నేతల మాటలు నమ్మేందుకు దళితులు సిద్ధంగా లేరు. కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకొని గౌరవంగా వ్యవహరించాలి. కుల రాజకీయాలకు తెగబడితే ఊరుకోం.

'సిరి'సిల్లగా మారుతుంటే ఓర్వలేని తనం: తాడూరి శ్రీనివాస్

కాంగ్రెస్ హయాంలో చేనేత ఆత్మహత్యలతో అప్రతిష్ఠ పాలైన సిరిసిల్ల.. మంత్రి కేటీఆర్ చలవతో అన్నిరంగాల్లో దూసుకు పోతున్నది. కేటీఆర్‌ను టార్గెట్ చేసిన కాంగ్రెస్ నేతలు..ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. జాతీయ స్థాయి నేతను సిరిసిల్లకు రప్పించి, తెలంగాణ ప్రభుత్వంపై లేనిపోని మాటలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

దళితుల గురించి మాట్లాడే హక్కు లేదు: భూంరెడ్డి

కాంగ్రెస్ పార్టీ నేతలకు దళితుల గురించి మాట్లాడే హక్కు ప్రజల్లో సానుభూతి పొందేందుకు, ఎన్నికల వేళ లబ్ధి పొందేందుకు లేని పోని ఆరోపణలు చేయటం మానుకోవాలి.

ప్రముఖ శాస్త్రవేత్త భార్గవ కన్నుమూత

- బయోటెక్నాలజీ రంగంలో పరిశోధనలకు అంతర్జాతీయ గుర్తింపు
- సేవలకు 1986లో పద్మభూషణ్.. 2015లో ప్రభుత్వానికి తిరిగిచ్చేసి నిరసన

హైదరాబాద్ సిటీబ్యూరో/ఉప్పల్/తార్నాక: సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ పుష్పమిత్ర భార్గవ (89) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్దిరోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రశాంతి నగర్‌లో ఉన్న ఇంట్లో తుదిశ్వాస విడిచారు. బయోటెక్నాలజీ రంగం అభివృద్ధికి విశేషకృషిచేసిన భార్గవ అనేకమంది శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాత. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో మధ్యతరగతి కుటుంబంలో 1928 ఫిబ్రవరి 22న పుష్పమిత్ర జన్మించారు. భార్గవకు కుమార్తె వినీత, కుమారుడు మోహిత్ ఉన్నారు.ఆయన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1986లో పద్మభూషణ్ అవార్డునివ్వగా.. 2015లో ప్రభుత్వ విధానాలను నిరసనగా ఆయన తిరిగి ఇచ్చేశారు. 1977 ఏప్రిల్ 1న హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయోలజీని సెమీ అటానమస్‌గా ప్రారంభించగా అంచెలంచెలుగా అభివృద్ధిపరిచి 1981-82లో పూర్తిస్థాయి జాతీయ పరిశోధనశాలగా మార్చడంలో భార్గవ కీలక పాత్ర పోషించారు. 1990 వరకు డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. తార్నాకలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఫెలోషిప్ పొంది 1993లో రిలీవ్ అయ్యారు. సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా పనిచేయక ముందు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో, సీఎస్ఐఆర్‌లో శాస్త్రవేత్తగా సేవలందించారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితర 50 దేశాల్లో పర్యటించి పరిశోధనలపై పనిచేశారు. ఈయన నేషనల్ నాలెడ్జి కమిషన్ వైస్ చైర్మన్‌గా, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ బోర్డు సభ్యుడిగా, కేంద్ర ప్రభుత్వ జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రయిజల్ కమిటీకి సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. ప్రొటీన్స్ ఆఫ్ సెమినల్ ప్లాస్మా, ది సాగా ఆఫ్ ఇండియన్ సైన్స్ సిన్స్ ఇండిపెండెన్స్, ఏంజిల్స్, డెవిల్, సైన్స్, ఎజెండా ఫర్ నేషన్, ది టు ఫేసెస్ ఆఫ్ బ్యూటీ వంటి రచనలను పలువురి సహకారంతో పూర్తిచేశారు. భార్గవ మృతి పరిశోధన రంగానికి తీరనిలోటని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్‌కుమార్ మిశ్రా అన్నారు.



భార్గవ భౌతికకాయానికి శాస్త్రవేత్తల నివాళి

తదుపరి ఎవరు?

మొదటిపేజీ తరువాయి...

వారి నుంచి సమాచారం సేకరిస్తూ, హైదరాబాద్ నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ సోదాలు ముమ్మరంచేశారు. ఉత్కంఠగా సాగిన సినీ ప్రముఖుల విచారణలో సైతం అధికారులు విస్తుపోయే సమాచారం సేకరించినట్టు తెలిసింది. వీటి ఆధారంగా మత్తుమందు కేటుగాళ్ల ఆటకట్టించేందుకు ప్రభుత్వం వ్యూహాలు సిద్ధంచేస్తున్నట్టు సమాచారం. కేసు మొత్తం లైసర్జిక్ యాసిడ్ డైథైలమైడ్ (ఎల్ఎస్డీ), మిథలీన్ డయాక్సీ మెథంఫెటమైన్ (ఎండీఎంఏ) చుట్టూనే తిరిగాయి. ఇప్పటి వరకు బాగా తెలిసిన మత్తుపదార్థాలు గంజాయి, కొకైన్ మాత్రమే. తాజా కేసుతో కొత్తకొత్త మాదకద్రవ్యాల పేర్లు బయటకు వచ్చాయి.

12 మంది.. 91.20 గంటల విచారణ

సినీరంగానికి చెందిన 12 మందికి నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు వారిని గంటల తరబడి విచారించారు. డ్రగ్స్ సరఫరా నిందితులు ఇచ్చిన సమాచారాన్ని తమ వద్ద పెట్టుకుని, వాటిని చూపుతూ సినీ ప్రముఖులు, ఇతరుల నుంచి అదనపు సమాచారం సేకరించారు. మొత్తం 12 రోజుల విచారణలో 12 మందిని 91.20 గంటల పాటు సిట్ బృందం ప్రశ్నించింది.

కెల్విన్, జీషాన్ అలీ ఎవరో తెలియదు: నందు

తనకు డ్రగ్స్ వాడే అలవాటు లేదని, డ్రగ్స్ మాఫియాగా చెప్తున్న కెల్విన్, జీషాన్‌లు ఎవరోకూడా తెలియదని సిట్ విచారణలో నటుడు నందు వెల్లడించినట్లు సమాచారం. పరిశ్రమలో ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న తరుణంలో డ్రగ్స్ ఆరోపణలు రావడంతో తట్టుకోలేకపోయానని చెప్పారు. తనతోపాటు తన కుటుంబం మొత్తం విచారంలో మునిగిపోయిందని విలపించినట్టు తెలిసింది. మంగళవారం నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన నటుడు నందును సిట్ అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విచారించారు. అయితే ఆశించిన స్థాయిలో సమాచారం రాబట్టలేకపోయినట్టు తెలిసింది. కెల్విన్, జీషాన్‌వంటి డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు ఎందుకు పెట్టుకున్నారు? వారితో ఫోన్లో ఎందుకు మాట్లాడారు? సినీ ప్రముఖులకు వారి నుంచే డ్రగ్స్ సరఫరా అవుతున్నాయా? అని సిట్ అధికారులు ప్రశ్నించారని సమాచారం. తనకు డ్రగ్స్ అలవాటు లేదని, కెల్విన్, జీషాన్‌లు అసలే తెలియదని నందు బదులిచ్చారని తెలిసింది. డ్రగ్స్ చూపే ప్రభావం, దాని అనర్థాలపై నందుకు సిట్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

డ్రగ్స్ కేసులో మరొకరి అరెస్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రగ్స్ కేసులో మరొకరిని సిట్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్‌లో ఎయిర్‌పోర్టులో ఆఫ్రికా దేశానికి చెందిన అలెక్స్ విక్టర్ (40)ను సిట్ బృందం అరెస్టు చేసింది. అతడి నుంచి సుమారు 10 గ్రాముల శుద్ధిచేసిన కొకైన్ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. కాగా నైజీరియా డ్రగ్స్ ముఠా సెల్‌ఫోన్లలో ఉన్న డాటా ఆధారంగా 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. వీరిలో కొందరు నైజీరియన్స్ ఉండగా మరికొందరు డ్రగ్స్ వాడుతున్న బాధితులు ఉన్నారు.

రెండేండ్లలో పూర్తిస్థాయిలో కేజీ టు పీజీ

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ సమాజం కొన్ని తరాలు వెనుకబడిపోయింది. తెలంగాణ పునర్నిర్మాణంలో మానవవనరుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. ఉద్యమ సమయంలో తాను కలలుగన్న కేజీ టు పీజీ పథకానికి రూపమిచ్చారు. రాష్ట్రంలో 80 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నాణ్యమైన విద్యతో ఉద్యోగులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దినప్పుడే ఆ వర్గాల అభ్యున్నతి సాధ్యమని కేసీఆర్ విశ్వసించారు. ఈ మేరకు భారీ సంఖ్యలో రెసిడెన్సియల్ స్కూళ్లను ప్రారంభించారు. ఒక్కో పాఠశాలకు, కళాశాలకు భవనాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.కోటి వరకు వెచ్చించారు. భోజనం, పుస్తకాలు, హాస్టల్, స్కూల్ నిర్వహణ తదితరాలకింద ఒక్కో విద్యార్థి మీద సగటున రూ.70 వేలు ఖర్చు చేశారు. ఈ ఏడాది 2,68,955 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. అలాగే 31 జూనియర్ కళాశాలల్లో 9120 విద్యార్థులను చేర్చుకున్నారు. ఇలా ఒక్క ఏడాదికి సగటున రూ. 2 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తున్నది. ఈ పాఠశాలల ద్వారా మెరుగైన ఫలితాలు కూడా వస్తున్నాయి. రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివిన వారిలో 49 మందికి ఎంబీబీఎస్‌లో, 23 మందికి బీడీఎస్‌లో సీట్లు వచ్చాయి. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం ఈ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా లభించింది. రెసిడెన్షియల్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఇబీసీలలోని పేదలకు కూడా ఇస్తున్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కూడా ఈ పాఠశాలల్లో ఉచితంగా చదువుకోవడానికి అవకాశం వచ్చింది.

ఏటేటా అప్‌గ్రేడేషన్..

కొత్తగా ప్రారంభమైన పాఠశాలల్లో ప్రభుత్వం 5,6,7 తరగతులకు అడ్మిషన్లను నిర్వహించింది, ఇక డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహించింది. పాఠశాలలు, కళాశాల్లో విద్యార్థులు కొత్తగా పై తరగతులకు వెళుతున్న కొద్దీ వాటిని అప్‌గ్రేడేషన్ చేస్తారు. ఇలా మరో రెండేండ్లలో రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివిన విద్యార్థుల కోసం పీజీ కాలేజీలు ఏర్పాటవుతాయి. దీంతో కే జీ టూ పీజీ ఉచిత విద్య సంపూర్ణంగా అమలులోకి వస్తుంది. విద్య, వైద్యంపై ఎంతైనా ఖర్చు చేయడానికి సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సర్కారు దవాఖానలో కార్పొరేట్ వైద్యం అందేవరకు అది కొనసాగుతుందని చెప్పారు.

బీసీలకు బీజేపీ, కాంగ్రెస్ దోఖా: జాజుల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభలో జాతీయ బీసీ కమిషన్ బిల్లును ఆమోదించకుండా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దోఖా చేశాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. సవరణల పేరుతో బిల్లును మళ్లీ లోక్‌సభకు పంపడంతో దేశంలోని 60కోట్ల మంది బీసీలను మోసగించినట్లు అయిందని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై బీసీ కమిషన్ బిల్లుకు జవ సత్వాలు లేకుండా చేశాయని ధ్వజమెత్తారు. కేంద్రసర్కారు తీరుకు నిరసనగా ఈ నెల నాలుగున రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

కడ్తాల్ టోల్‌ప్లాజా సిబ్బందిపై
దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

కడ్తాల్: హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి సిబ్బందిపై దాడిచేసిన ఆరుగురు యువకులను అరెస్ట్‌చేసినట్లు ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన యువకులు అరుణ్‌రెడ్డి, నిశిత్, సాయితేజ్‌రెడ్డి, మనీశ్‌గౌడ్, సాయికుమార్, అనిరుధ్ తమ స్నేహితుడు సాయికుమార్ పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు సోమవారం మండలంలోని మైసిగండి గ్రామానికి వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో టోల్‌ప్లాజావద్ద నిర్ణీత మార్గంలో కాకుండా బారికేడ్లను తొలగించి వాహనంతో ముందుకెళ్లారు. గమనించిన టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ మహేశ్ వారిని సరైన దారిలో రావాలని కోరారు. దీంతో కోపోద్రిక్తులైన యువకులు అతడిపై దాడి చేశారు. అరుణ్‌రెడ్డి కత్తితో దాడి చేయగా మహేశ్ రెండు చేతులకు గాయలయ్యాయి. యువకులు పారిపోవడంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించగా కారును అడ్డగించిన పోలీసులు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసును మోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నిందితులపై చర్యలు తీసుకున్నారు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: టోల్‌ప్లాజా సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఐటీశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. కడ్తాల్ సమీపంలోని టోల్‌గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై కొందరు యువకులు దాడికి పాల్పడిన విషయాన్ని ఓ వ్యక్తి ట్విట్టర్‌ద్వారా మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'నిందితులు ఎవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఐపీసీ 307 సెక్షన్ ప్రకారం నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు శంషాబాద్ డీసీపీ సమాచారం ఇచ్చారు' అని ఆయన రీట్వీట్ చేశారు.

నష్టాల నుంచి గట్టెక్కుతున్న ఆర్టీసీ

- లాభాల బాటలో హైదరాబాద్, కరీంనగర్ జోన్లు
- తొలి త్రైమాసికంలో తగ్గిన రూ.44.80 కోట్ల నష్టాలు
- లాభాల్లో పయనిస్తున్న 32 గ్రామీణ డిపోలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వరాష్ట్రంలో సర్కారు చేయూతతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) పనితీరు మెరుగుపడుతున్నది. ప్రభుత్వ సహకారం, ప్రయాణికులకు అందించే సేవల్లో ఆర్టీసీ యాజమాన్యం చేపట్టిన మార్పులు, సంస్కరణలు సంస్థను నష్టాల నుంచి గట్టెక్కిస్తున్నాయి. సాధారణంగా అధిక నష్టాల్లో ఉండే హైదరాబాద్, కరీంనగర్ జోన్లు ప్రస్తుతం లాభాలబాటలో పయనిస్తుండటం సంస్థకు ఉత్సాహాన్నిస్తున్నది. 2016-17 తొలి త్రైమాసికంతో పోల్చుకుంటే 2017-18 తొలి త్రైమాసికంలో టీఎస్ఆర్టీసీ రూ.44.80 కోట్ల నష్టాలను తగ్గించుకున్నది. ముఖ్యంగా హైదరాబాద్, కరీంనగర్ వంటి కీలకజోన్లు నష్టాల నుంచి లాభాల బాటలో పయనిస్తుండడం గొప్ప పరిణామమని సంస్థ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో మిగతా గ్రామీణ జోన్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.6.61కోట్ల లాభాలు ఆర్జించాయి.

సంస్కరణల అమలుతో ఫలితాలు

డిపోలవారీగా చూస్తే 2016-17 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రాష్ట్రంలో 19 గ్రామీణ డిపోలు లాభాల్లో ఉండగా, 2017-18 తొలి త్రైమాసికంలో మరో 13 డిపోలు ఆ జాబితాలో చేరి మొత్తం 32 గ్రామీణ డిపోలు లాభాల్లోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో సంస్థకు 68 డిపోలు ఉండగా వాటిలో 32 డిపోలు తొలి త్రైమాసికంలో లాభాల్లోకి రావడం సంస్థ పనితీరుకు నిదర్శనమని అధికారిక, కార్మికవర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మిగతా 36 గ్రామీణ డిపోలు కూడా గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నష్టాలను గణనీయంగా తగ్గించుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెరిగిన హెచ్ఎస్డీ ఆయిల్ రేట్ల డిపాజిట్, ఉద్యోగులు, కార్మికుల డీఏ, ఇంక్రిమెంట్ల పెరుగుదల కలుపుకొని రూ.128.22 కోట్లుపోగా నష్టాలు తగ్గించుకోగలిగామని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రమణారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రేటర్ హైదరాబాద్ జోన్ అత్యధికంగా రూ.82.56 కోట్ల నష్టాల్లో కొనగుతున్నది. ఇది కూడా సంస్థ లాభాలకు అడ్డంకిగా మారింది. జీహెచ్‌జెడ్ జోన్‌లో నష్టాలను భారీగా తగ్గించుకోగలిగితే సంస్థ మరిన్ని లాభాలు సాధించే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలిపారు. సంస్థ ఎండీ రమణారావు, ఈడీలతో కలిసి చేపట్టిన సంస్కరణలతో సంస్థ పరిస్థితి గతంలో కంటే మెరుగుపడిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. సంస్థకు రెవెన్యూ, లాభాలు రావడానికి అమలుచేసిన పలు కార్యక్రమాలు, ప్రయాణికులకు ప్రజా రవాణా సౌకర్యం మెరుగుపరుచడం, ప్రైవేట్ రవాణాకు దీటుగా బస్సులను కొత్త రూట్లలో ప్రవేశపెట్టడం, అంతర్రాష్ట్ర సర్వీసుల పెంపు, కొత్త ప్రణాళికల అమలు వంటివి సంస్థ నష్టాలు తగ్గించుకోవడానికి దోహదపడినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.

కాల్పుల ఒప్పందం !

మొదటిపేజీ తరువాయి

తెల్లవారుజామున 3 గంటలప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్డు నం. 86లోని విక్రమ్‌గౌడ్ ఇంట్లో కాల్పుల ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన తీరుపై శాస్త్రీయంగా ఆధారాలను సేకరించిన పోలీసులు ఇదంతా పక్కా ప్లాన్ ప్రకారం జరిగినట్లు అనుమానించి ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ముందస్తు ప్లాన్‌లో భాగంగానే స్నేహితులు వస్తారని వాచ్‌మెన్‌కు చెప్పిన విక్రమ్‌గౌడ్.. గేట్లు తెరిపించి ఉంచాడని సమాచారం. ముఠాలోని ఐదుగురు సభ్యులు ఘటన జరిగేందుకు రెండురోజుల ముందే హైదరాబాద్ వచ్చి, గురువారం విక్రమ్‌గౌడ్ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారని పోలీసులు గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ప్రణాళికను అమలు చేసి, తుపాకీ దొరుకకుండా చెరువులో పడేసినట్లు సమాచారం. కాల్పులపై స్పష్టత కోసం మధ్యప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్న ప్రధాన సూత్రధారిని విచారిస్తున్నారు. అతడు ఇచ్చిన సమాచారంతో షేక్‌పేట్‌లోని కొత్త చెరువులో పడేసిన తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కేసును రాజకీయంగా వాడుకొని సానుభూతి పొందడం, అప్పులు ఇచ్చిన వారికి ఎగ్గొట్టడం.. కుటుంబసభ్యుల నుంచి అడిగినంత డబ్బు తీసుకోవచ్చనే ఆలోచనతో పక్కా వ్యూహంతో పథకాన్ని అమలు చేయించాడని పోలీసులు భావిస్తున్నారు.

ఆటోస్టాండ్లకు షట్టర్లు

- రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడి

జనగామ, నమస్తే తెలంగాణ ప్రతినిధి/వరంగల్ రెడ్డికాలనీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ల వద్ద ప్రత్యేకంగా షట్టర్లతో కూడిన ఆటోస్టాండ్లు ఏర్పాటు చేయనున్నట్టు రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. ఆటోడ్రైవర్ల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని, 11 డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.మూడో విడుత హరితహారంలో భాగంగా మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో, పెంబర్తిలో మొక్కలు నాటారు. ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రైవర్లకు నాణ్యమైన శిక్షణ ఇచ్చేందుకు జిల్లాకో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్లు చొరవ తీసుకుని ఐదెకరాల భూమి కేటాయిస్తే రూ.18 లక్షల చొప్పున వెచ్చించి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 1200 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నియోజకవర్గ నిధులు ఖర్చు చేసి రోడ్లు వేయిస్తే బస్సులు నడుపుతామన్నారు. ఇండ్లులేని పేద ఆటోడ్రైవర్లకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ బోడకుంటి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, ఆరూరి రమేశ్, శంకర్‌నాయక్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు రాజయ్య యాదవ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆటోడ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్, పాల్గొన్నారు.



వరంగల్ సభలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి. వేదికపై ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, శంకర్‌నాయక్



ఢిల్లీలో ఎస్సీ వర్గీకరణను డిమాండ్ చేస్తూ పిడమర్తి రవి ఆధ్వర్యంలో మౌనదీక్ష

ఎస్సీ వర్గీకరణలో రాజకీయం వద్దు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గీకరణలో రాజకీయ జోక్యం తగదని, మాదిగల జీవితాలతో బీజేపీ ఆటలాడొద్దని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి హెచ్చరించారు. తెలంగాణ ఎమ్మార్పీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు వెంకయ్యనాయుడు మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, ఉపరాష్ట్రపతి పదవికి దగ్గరవుతున్న ఆయన ఇప్పుడు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ లాయర్ల సమాఖ్య అధ్యక్షుడు జయకర్ పాల్గొన్నారు.

14నుంచి బ్రాహ్మణులకు ఆరోగ్యబీమా దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిరుపేద బ్రాహ్మణ కుటుంబాల కోసం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఆరోగ్యబీమా పథకం ప్రవేశపెట్టింది. ఈ నెల 14 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ పథకంలో ఏడాదికి రూ.2లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తారు. దరఖాస్తుదారులు విధిగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ వివరాలను పరిషత్తు చిరునామాకు పంపించాల్సి ఉంటుంది.

రైతులకు పరిహారం చెల్లింపుపై వైఖరేమిటి: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ భూముల్లో విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేసినప్పుడు రైతులకు పరిహారం చెల్లించే విషయంలో వైఖరి తెలియజేయాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను ఉమ్మడి హైకోర్టు మంగళవారం ఆదేశించింది. పరిహారం చెల్లింపు విషయంలో ఉన్న నిబంధనలు, ఇదివరకు చేపట్టిన చర్యలను తెలుపాలని పేర్కొంది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పుడు పరిహారం చెల్లించలేడం లేదంటూ చెంగల్‌రెడ్డి లేఖ రాయగా హైకోర్టు విచారణ చేపట్టింది.

బాబుతో దోస్తీచేసి పరపతి తగ్గించుకోవద్దు

జనసేన అధినేత పవన్‌కు ముద్రగడ బహిరంగలేఖ

అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ సీఎం చంద్రబాబుతో దోస్తీచేసి పరపతి తగ్గించుకోవద్దని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సూచించారు. మంగళవారం పవన్‌కు ఆయన బహిరంగలేఖ రాశారు. ఏడునెలల్లో బీసీ కమిషన్ నివేదిక తెప్పించి రిజర్వేషన్లు అమలు చేస్తామని గతేడాది ఫిబ్రవరిలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ గద్దెనెక్కి మూడేండ్లు దాటినా, కమిషన్ వేసి 18 నెలలు గడిచినా నెరవేరలేదన్నారు. కాపు ఉద్యమ నేత ముద్రగడను గృహనిర్బంధం చేయడం వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని బీజేపీ నాయకురాలు పురందేశ్వరి పేర్కొన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తేవడంలో పవన్‌కల్యాణ్ సఫలమయ్యారన్నారు.

రైతు సంక్షేమంలో సర్కారు చర్యలు భేష్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ప్రశంసనీయమని యువ ఐఏఎస్‌లు అన్నారు. సచివాలయంలో వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథితో శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు డాక్టర్ సచిన్, యోగిందర్‌సింగ్, ఆశికా జైన్ మంగళవారం సమావేశమయ్యారు. తెలంగాణ పంటలు, సూక్ష్మసేద్యం, గిడ్డంగుల నిర్మాణం వంటి వాటి కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను కార్యదర్శి వివరించారు.

ఆయేషా కేసులో ఏం చేశారు?: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో అసలైన దోషులను గుర్తించే విషయంలో అపెక్స్ కమిటీ చేపట్టిన చర్యలను వివరించాలని ఏపీ సర్కార్‌ను హైకోర్టు మంగళవారం ఆదేశించింది. విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది.

ఎస్టీ విద్యార్థి వసతిగృహాలు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోస్ట్‌మెట్రిక్ గిరిజన విద్యార్థినుల వసతిగృహాలను హైదరాబాద్‌లోని చంపాపేట్, మీర్‌పేట్‌ల్లో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా మంగళవారం ప్రారంభించారు. బడంగ్‌పేట్, ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంబాగ్, దిల్‌షుక్‌నగర్, అడిక్‌మెట్, బండ్లగూడ, బోరబండతోపాటు మరోచోట వసతిగృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ శాఖ కమిషనర్ ఆర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఖైదీల క్షమాభిక్షపై మార్గదర్శకాల కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లలో ఉన్న ఖైదీల క్షమాభిక్ష విషయంలో మార్గదర్శకాలు రూపొందించేందుకు జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ కొత్త కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ చైర్మన్‌గా జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ, సభ్యులుగా చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ సైదయ్య, చర్లపల్లి జైలు వ్యవసాయ క్షేత్రం సూపరింటెండెంట్ రాజేశ్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ భాస్కర్, సికా ప్రిన్సిపల్ మురళిబాబు, వరంగల్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సంపత్‌ను నియమించారు.

ఈ ఏడాది 67 కోట్ల చేప పిల్లల పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా 2017-18లో రూ.52.5 కోట్ల విలువైన 67 కోట్ల చేప పిల్లలను చెరువులు, జలాశయాల్లో వదులనున్నట్లు మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల మూడోవారంలో లేదా నెలాఖరులో ప్రారంభిస్తామని చెప్పారు.



మంగళవారం సచివాలయంలో 30 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి అదర్‌సిన్హా.చిత్రంలో జాయింట్ సెక్రటరీ అప్పారావు, అడిషనల్ సెక్రటరీ శంకర్ ఉన్నారు.

అమల్లోకి రెరా

మొదటిపేజీ తరువాయి

రెరా వద్ద తప్పకుండా నమోదు చేసుకోవాల్సిందే. ప్లాట్లుగా విక్రయించే లే అవుట్లనూ రెరా వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ప్లాట్లు, ఇండ్ల అమ్మకాలను నిర్వహించే రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కూడా రెరా వద్ద నమోదయ్యాకే క్రయవిక్రయాలు చేపట్టాలి. సొంతింటి కలను సాకారం చేసుకోవాలని భావించేవారికి ఈ చట్టం వల్ల సంపూర్ణ భరోసా లభిస్తుంది. మోసాలకు పాల్పడే డెవలపర్ల బారిన పడకుండా కాపాడుతుంది. ఖరీదైన బ్రోచర్లతో కొనుగోలుదారులను బురిడీకొట్టించి వారి సొమ్ముతో జల్సాలు చేసే డెవలపర్లకు అడ్డుకట్ట పడుతుంది. 'రెరా' అథారిటీ అనుమతి లేకుండా ఫ్లాట్లు విక్రయించే బిల్డర్లకు జైలు శిక్ష తప్పదు. మొత్తానికి రెరా చట్టం అమలుతో నిర్మాణరంగంలో పారదర్శకత నెలకొనడంతోపాటు డెవలపర్లలో జవాబుదారీతనం పెరుగుతుంది. అనుభవమున్నవారు మాత్రమే అపార్టుమెంట్లు, విల్లాలను రాష్ట్రంలో నిర్మిస్తారు.

కొత్త ప్రాజెక్టుల నమోదుకు నామమాత్రపు ఫీజు

రెరా వద్ద కొత్త ప్రాజెక్టులను నమోదు చేసుకోవడానికి డెవలపర్లు నామమాత్రపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అపార్టుమెంటును నిర్మించే స్థలాన్ని బట్టి.. చదరపు మీటరుకు రూ.5 నుంచి రూ.10 వసూలు చేస్తారు. ప్లాట్లను అభివృద్ధి చేసే రియల్టర్లు చదరపు మీటరుకు రూ.5 చెల్లించాలి. ఫ్లాట్లను విక్రయించే క్రమంలో కొనుగోలుదారుల నుంచి వసూలు చేసే సొమ్ములో 70% సొమ్మును ప్రతి డెవలపర్ విధిగా ఎస్క్రో ఖాతాలో జమ చేయాల్సిందే. దీంతో, ఒక ప్రాజెక్టుకువసూలుచేసే సొమ్మును మరొక నిర్మాణంలో వాడుకునే అవకాశం ఉండదు.

రెరా అథారిటీ, రెరా అప్పిలేట్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెరా అథారిటీ, రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రెరా అథారిటీ ఏర్పడే వరకూ పురపాలక శాఖ కార్యదర్శి రెరా అథారిటీగా వ్యవహరిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. హైకోర్టు చీఫ్ జస్టిస్, పురపాలక శాఖ కార్యదర్శితో కూడిన సెలక్షన్ కమిటీ రెరా చైర్‌పర్సన్‌ను నియమిస్తుంది. పాతికేండ్ల అనుభవమున్న వ్యక్తిని ఈ పదవికి ఎంపిక చేస్తుంది. రెరా చైర్మన్ కనీసం ఐదేండ్లపాటు ఆ పదవిలో ఉంటారు. రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో తప్పనిసరిగా హైకోర్టు జడ్జి లేదా తత్సమానమైన వారిని నియమించాల్సి ఉంటుంది. వీరితోపాటు న్యాయవిభాగంలో కనీసం పదిహేనేండ్ల అనుభవమున్నవారు, సాంకేతిక అంశాల్లో ప్రావీణ్యమం ఉన్నవారిని సభ్యులుగా నియమిస్తారు.

పది శాతం జరిమానా..

2017 జనవరి 1 తర్వాత కొత్తగా ప్రారంభయ్యే లేఅవుట్లు, నిర్మాణాలను రెరా వద్ద నమోదు చేసుకోకుండా.. ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయిస్తే.. ఆ ప్రాజెక్టు వ్యయంలో పది శాతం సొమ్ము వసూలుచేస్తారు. ఇప్పటివరకూ డెవలపర్లు సూపర్ బిల్టప్ ఏరియా చొప్పున ఫ్లాట్లను విక్రయించేవారు. ఇకపై కార్పెట్ ఏరియా ప్రాతిపదికన ఫ్లాట్లను అమ్మాల్సి ఉంటుంది. ఏయే సదుపాయాలు కల్పిస్తారు? వేటిని అందజేయరనే విషయాన్ని డెవలపర్లు స్పష్టంగా తమ వాణిజ్య ప్రకటనల్లో పేర్కొనాల్సి ఉంటుంది.

ఏజెంట్లూ.. బహుపరాక్!

ప్లాట్లు, ఫ్లాట్ల లావాదేవీలను నిర్వహించేవారు కూడా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తను నిర్వహించే కార్యకలాపాలకు సంబంధించి విధిగా రికార్డులను నిర్వహించాలి. తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ప్లాట్లు లేదా ఫ్లాట్లను విక్రయించకూడదు. ఒకవేళ, రెరా నిబంధనల్ని అతిక్రమిస్తే.. సదరు ఏజెంట్లు భారీ వడ్డనకు సిద్ధం కావాల్సి ఉంటుంది. రెరా నిబంధనల్ని బేఖాతరు చేస్తే.. అతను అమ్మిన ప్లాటు లేదా ఫ్లాటు విలువలో కనీసం ఐదు శాతం సొమ్మును జరిమానాగా విధిస్తారు.

వడ్డీ భారం తగ్గేనా?

నేడే ఆర్బీఐ ద్రవ్యపరపతి సమీక్ష



ముంబై, ఆగస్టు 1: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్నాయి. పరపతి సమీక్షలో కీలక వడ్డీ(రెపో)రేట్లపై నిర్ణయం తీసుకునేందుకు ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మంగళవారం నాడు భేటీ అయింది. బుధవారం ఉదయం మరోసారి భేటీ కానుంది. అనంతరం వడ్డీరేట్లతోపాటు పలు అంశాలపై కీలక నిర్ణయాలను ఆర్బీఐ ప్రకటించనుంది. వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో తగ్గిన నేపథ్యంలో కుంటుపడ్డ పారిశ్రామికోత్పత్తికి ఊతమిచ్చేలా ఈసారి సమీక్షలో ఆర్బీఐ రెపోరేటును పావు (0.25) శాతం తగ్గించవచ్చని బ్యాంకర్లు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతకంటే ఎక్కువ తగ్గించేందుకూ అవకాశాల్లేకపోలేవని కొందరు నిపుణులంటున్నారు. జూన్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం చారిత్రాత్మక కనిష్ఠ స్థాయి 1.54 శాతానికి తగ్గింది. మరోవైపేమో పారిశ్రామికోత్పత్తి, వస్తు తయారీ రంగాలు నిస్తేజంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగ పెట్టుబడులను పునరుద్ధరించేందుకు వడ్డీరేట్లను అర శాతం తగ్గించాలని ఇండస్ట్రీ వర్గాలు కోరుతున్నాయి. గత నాలుగు సమీక్షల్లో ఆర్బీఐ రెపోరేటును యథాతథంగానే కొనసాగించింది. ప్రస్తుతం రెపోరేటు 6.25 శాతంగా ఉంది. రెపోరేటు తగ్గితే బ్యాంకులు రుణాలపై విధించే వడ్డీరేట్లను మరింత తగ్గించే అవకాశం ఉంటుంది.

సెన్సెక్స్	నిఫ్టీ
32,575	10,115
60	37

బంగారం ధరలు

ముంబై	
24 క్యారెట్లు	28,645
22 క్యారెట్లు	28,495
వెండి (కిలో)	38,260

ముడి చమురు (బ్రెంట్) 51.25

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.34	67.64
ఆస్ట్రేలియా డాలర్	46.84	54.21
బహ్రెయిన్ దినార్	158.06	181.04
యూరో	68.98	80.00
జపాన్ యెన్/100	52.97	61.43
కువైట్ దినార్	175.24	219.24
ఒమన్ రియాల్	154.67	177.00
సౌదీ రియాల్	15.51	18.39
సింగపూర్ డాలర్	43.02	50.95
స్టెర్లింగ్ పౌండ్	77.09	89.42
యూఏఈ దిర్హామ్	15.88	18.56

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్ఎల్ఎఫ్ఏ
హైదరాబాద్	310-00	310-00
రంగారెడ్డి	310-00	310-00
మెదక్	310-00	310-00
కరీంనగర్	312-00	---
వరంగల్	312-00	---
రిటైల్ ప్రైస్	3-70	3-70

చికెన్ ధరలు

ఫారం ధర	67.00
రిటైల్ లైవ్	81.00
డ్రెస్డ్	113.00
స్కిన్‌లెస్	134.00

మార్కెట్లోకి బ్లాక్‌బెర్రీ కీవన్



ధర రూ.39,990

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ బ్లాక్‌బెర్రీ..దేశీయ మార్కెట్లోకి కీవన్ ఫోన్‌ను విడుదల చేసింది. దేశీయ భాగస్వామి ఒప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ తయారు చేసిన ఈ ఫోన్ ధరను రూ.39,990గా నిర్ణయించింది. 4.5 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లో ఆండ్రాయిడ్ 7.1.1 నౌగట్ ఆపరేటింగ్ సిస్టమ్, ఆక్టా-కోర్ క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్, 4జీబీ ర్యామ్, 64జీబీ ఇంటర్నల్ మెమొరీ(2గిగాహెడ్జ్ వరకు పెంచుకోవచ్చును), 12 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, ముందుభాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా, 3505 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ నెల 8 నుంచి అమెజాన్‌లో మాత్రమే ఈ ఫోన్ లభించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సంస్థ దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా డ్యూయల్ సిమ్ కలిగిన ఫోన్‌ను విడుదల చేయడం విశేషం. వొడాఫోన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో ఈ ఫోన్‌ను కొనుగోలు చేసిన వారికి 75జీబీ డాటా లభించనున్నది. ఈ సందర్భంగా ఒప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ ఈడీ హర్‌దీప్ సింగ్ మాట్లాడుతూ..వచ్చే ఏడాదికాలంలో ఈ నూతన డివైజ్ అమ్మకాలు దూసుకుపోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ధర విషయానికి వస్తే చాలా తక్కువగా ఉండటం కొనుగోలుదారులను ఆకట్టుకోనున్నదని పేర్కొన్నారు.

ముకేశ్@నం.2

ఆసియాలోని అత్యంత సంపన్నుల్లో ద్వితీయ స్థానానికి అంబానీ



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ తాజాగా ఆసియా సంపన్నుల జాబితాలో రెండో స్థానానికి ఎగబాకారు. బ్లూంబర్గ్ బిలియనీర్ల జాబితాలో హాంకాంగ్‌కు చెందిన స్థిరాస్థి వ్యాపార దిగ్గజం లీ కా షింగ్‌ను వెనుకకు నెట్టి అంబానీ సెకండ్ ప్లేస్‌లో నిలిచారు. టెలికం వ్యాపారంలోకి రిలయన్స్ జియో సంచలన రంగప్రవేశం ఈమధ్యకాలంలో ముకేశ్ సంపద భారీగా పెరిగేందుకు దోహదపడింది. జియో సేవలు ప్రారంభించినప్పటి నుంచి స్టాక్ మార్కెట్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీగా పుంజుకున్నాయి. ప్రస్తుతం ఆల్‌టైం రికార్డు స్థాయిలో ట్రేడవుతున్నాయి. దాంతో ఈ ఏడాది ముకేశ్ అంబానీ సంపద 1,250 కోట్ల డాలర్లు (మన కరెన్సీలో రూ.80వేల కోట్ల పైమాటే) పెరిగిందని బ్లూంబర్గ్ పేర్కొంది. ప్రస్తుతం ముకేశ్ సంపద 3,520 కోట్ల డాలర్లకు చేరుకుంది. గత ఏడాది చివరినాటికి బ్లూంబర్గ్ ప్రపంచ కుబేరుల జాబితాలో 29వ స్థానంలో నిలిచిన ఆయన ప్రస్తుతం 19వ స్థానానికి ఎగబాకారు. ఆసియాలో రెండో అత్యంత సంపన్నుడిగా ఎదిగారు. అలీబాబా.కామ్ వ్యవస్థాపకులు జాక్‌మా 4,370 కోట్ల డాలర్ల సంపదతో ఆసియా రిచ్ లిస్ట్‌లో అగ్రస్థానంలో ఉన్నారు.

ఫ్లిప్‌కార్ట్‌లో 13 వేల కోట్ల పెట్టుబడి!

ప్రకటించనున్న సాఫ్ట్‌బ్యాంక్



న్యూఢిల్లీ, ఆగస్టు 1: జపాన్‌కు చెందిన ఆర్థిక సేవల సంస్థ సాఫ్ట్‌బ్యాంక్..దేశీయ ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో మరో 200 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టేయోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. మన కరెన్సీలో రూ.13 వేల కోట్లు. విభిన్న వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు సాఫ్ట్‌బ్యాంక్..ఫ్లిప్‌కార్ట్‌లో 1.5-2 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నది. మరింత సమాచారం ఇవ్వడానికి ఆయన నిరాకరించారు. ఫ్లిప్‌కార్ట్‌లో భారీగా పెట్టుబడులు పెట్టే యోచనలో ఉన్న సాఫ్ట్‌బ్యాంక్... ఫ్లిప్‌కార్ట్-స్నాప్‌డీల్ విలీన ఒప్పందానికి మోకాలడ్డినట్లు తెలుస్తున్నది. 2014లో స్నాప్‌డీల్‌తోపాటు ఓలా, పలు సంస్థల్లో సాఫ్ట్‌బ్యాంక్ 1000 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది. ఈ ఏడాది మే నెలలో కూడా పేటీఎంలో 140 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

ఫ్లిప్‌కార్ట్-ఈబే ఇండియా విలీనం పూర్తి

దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్.. ఈబే ఇండియా విలీన ప్రక్రియ నేటితో పూర్తయింది. దీంతో ఈబే.ఇన్ ఇకనుంచి ఫ్లిప్‌కార్ట్ గ్రూపు పరిధిలోకి రానున్నది. ఏప్రిల్‌లో ఈబే ఇండియాను కొనుగోలు చేయనున్నట్లు సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం అవసరమైన నిధుల్లో అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలైన ఈబే, మైక్రోసాఫ్ట్, టెన్‌సెంట్‌ల నుంచి 140 కోట్ల డాలర్ల నిధులను సేకరించింది. స్నాప్‌డీల్‌తో ఒప్పందాన్ని వదులుకున్న మరుసటి రోజే ఫ్లిప్‌కార్ట్ ఈ భారీ ఒప్పందాన్ని పూర్తి చేసుకోవడం విశేషం.

త్వరలో పేటీఎం మెసేజింగ్ సేవలు!



న్యూఢిల్లీ, ఆగస్టు 1: అలీబాబా వెనుకుండి నడిపిస్తున్న పేటీఎం నూతన సేవలను అందించడానికి సిద్ధమవుతున్నది. వాట్సప్‌కు పోటీగా ఈ నెల చివరి నుంచి మెసేజింగ్ సేవలు అందించనున్నట్లు విభిన్న వర్గాల ద్వారా తెలిసింది. నూతన ఫీచర్స్‌లో భాగంగా చాట్ చేసుకోవడంతోపాటు ఆడియో, వీడియోలు, చిత్రాలు ఒకరినొకరు పంపుకునే వీలుంటుంది. ఈ మెసేజింగ్ సేవలపై పేటీఎం వర్గాలు స్పందించడానికి నిరాకరించారు. డిజిటల్ రంగంలో దూసుకుపోతున్న వాట్సప్‌కు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో పేటీఎం ఈ నూతన సేవలు అందించడానికి సిద్ధమైనట్లు తెలుస్తున్నది.

తయారీ తిరోగమనం!

జీఎస్టీ అమలు నేపథ్యంలో భారీగా తగ్గిన ఆర్డర్లు

జూలైలో మాన్యుఫాక్చరింగ్ పీఎంఐ 47.9కు పతనం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: దేశీయ తయారీ రంగం తిరోగమన బాటపట్టింది. జూలైలో మాన్యుఫాక్చరింగ్ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 47.9కి పడిపోయింది. జీఎస్టీ అమలు నేపథ్యంలో పరిశ్రమలకు కొత్త ఆర్డర్లు భారీగా తగ్గడంతోపాటు వినిమయ డిమాండ్, ఉత్పత్తి మందగించడం ఇందుకు ప్రధాన కారణమైంది. ఫిబ్రవరి 2009 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి. అంతేకాదు, ఈ ఏడాదిలో తయారీ రంగ పీఎంఐ క్షీణతను కనబర్చడం ఇదే మొదటిసారి. పెద్ద నోట్ల రద్దు ఫలితంగా డిసెంబర్ 2016లోనూ మాఫాక్చరింగ్ సెక్టార్ పేలవ పనితీరు కనబర్చింది. జూన్‌లో తయారీ రంగ పీఎంఐ 50.9గా ఉంది. ఈ సూచీ 50కి ఎగువన ఉంటే వృద్ధికి, దిగువన ఉంటే క్షీణతకు సంకేతం. కుదేలైన తయారీ రంగానికి ఊతమిచ్చేలా ఈసారి సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లు తగ్గించాల్సిన ఆవశ్యకత మరింత పెరిగిందని విశ్లేషకులంటున్నారు.

జీఎస్టీ రాయితీల జోష్


మారుతి, టాటా, మహీంద్రా అమ్మకాల్లో రెండంకెల వృద్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 1:

వాహన అమ్మకాలకు వస్తు, సేవా పన్ను(జీఎస్టీ) జోష్‌నిచ్చింది. జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాన్ని వినియోగదారులకు మళ్లించడంలో భాగంగా ఆయా సంస్థలు ధరలను భారీగా తగ్గించడంతో కొనుగోలుదారులు ఎగబడ్డారు. కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ విక్రయాలు అంచనాలకుమించి నమోదు చేసుకోగా.. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫోర్డ్, హోండాలు సైతం రెండంకెల వృద్ధిని కనబరిచాయి. గడిచిన నెలలో దేశవ్యాప్తంగా 1,54,001 యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు మారుతి సుజుకీ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో విక్రయించిన 1,25,778 యూనిట్లతో పోలిస్తే 22.4 శాతం వృద్ధిని కనబరిచింది. కాంప్యాక్ట్ సెగ్మెంట్‌కు చెందిన వాహన అమ్మకాల్లో 25.3 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, మినీ సెగ్మెంట్ 20.7 శాతం చొప్పున పెరిగినట్లు సంస్థ తెలిపింది. మరో దేశీయ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ సేల్స్‌లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. జూలైలో సంస్థ దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు 10.23 శాతం పెరిగి 14,933 యూనిట్లకు చేరుకున్నాయి. జీఎస్టీతో వినియోగదారుల్లో కొనుగోళ్ల సెంటిమెంట్ మెరుగుపడిందని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరేఖ్ వెల్లడించారు. గత నెలలో 8,418 కార్లను విక్రయించినట్లు ఫోర్డ్ ఇండియా ప్రకటించింది. 2016 జూలైలో విక్రయించిన 7,076 యూనిట్లతో పోలిస్తే 18.96 శాతం పెరుగుదల కనిపించింది. సాధారణ వర్షాలు, వడ్డీరేట్లు తగ్గుతుండటం, పండుగ సీజన్‌లో వినియోగదారుల నమ్మకం మరింత పెరుగనుండటం ఆటోమొబైల్ ఇండస్ట్రీకి సానుకూల అంశమని ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ అనురాగ్ మెహరోత్రా తెలిపారు. దేశీయ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా సేల్స్ 13 శాతం పెరిగి 39,762 యూనిట్లకు చేరుకున్నాయి. హోండా కార్స్ ఇండియా(హెచ్‌సీఐఎల్) అమ్మకాలు 21.74 శాతం ఎగబాకి 17,085 యూనిట్లకు చేరాయి. దేశంలో రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ అమ్మకాలు ఆశించిన స్థాయిలో నమోదు చేసుకోలేదు. గడిచిన నెలలో విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 4.38 శాతం మాత్రమే పెరిగి 43,007 యూనిట్ల అమ్మకాలు జరిపింది. ధరలు తగ్గడం అమ్మకాల్లో ఈ మాత్రమైన వృద్ధికి దోహదపడిందని హెచ్ఎంఐఎల్ డైరెక్టర్ రాకేశ్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. కమర్షియల్ వాహన విభాగంలో టాటా మోటార్స్ అమ్మకాలు 15 శాతం ఎగబాకి 27,842 యూనిట్లకు చేరుకున్నాయి. ధరల తగ్గింపు మార్కెట్లో సెంటిమెంట్ మెరుగుపడటానికి దోహదపడిందని టాటా మోటార్స్ హెడ్ ఉనిత్ గిరీష్ వాగ్ తెలిపారు. హిందుజా గ్రూపునకు చెందిన అశోక్ లేలాండ్ అమ్మకాలు 14.19 శాతం ఎగబాకి 11,981 యూనిట్లకు చేరాయి. 17,682 మేర ట్రాక్టర్లను విక్రయించినట్లు మహీంద్రా ప్రకటించింది.

దూసుకెళ్లిన ద్విచక్ర వాహన అమ్మకాలు

కార్లతోపాటు ద్విచక్ర వాహన అమ్మకాలు కూడా టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. అగ్రగామి సంస్థ హీరో మోటోకార్ప్ అమ్మకాల్లో రికార్డును సృష్టించింది. గడిచిన నెలలో ఏడాది ప్రాతిపదికన 17.13 శాతం పెరిగి 6,23,269 యూనిట్లకు చేరుకుంది. నెల మొదట్లో అమ్మకాల్లో నిస్తేజం నెలకొన్నప్పటికీ చివరకు ఒక నెలలో ఇంతటి స్థాయిలో వాహనాలను విక్రయించడం ఇదే తొలిసారి. హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్ఎంఎస్ఐ) అమ్మకాలు 19.96 శాతం పెరిగి 5,44,508 యూనిట్లకు చేరాయి. చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్ అమ్మకాలు 9.34 శాతం వృద్ధిచెంది 2,71,171 యూనిట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. లగ్జరీ వాహన సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 20.75 శాతం ఎగబాకి 64,459 యూనిట్లకు చేరాయి.



గతసారి 2 లక్షల కోట్లు

కార్పొరేట్ రుణాల పునర్వ్యవస్థీకరణపై ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ, ఆగస్టు 1: గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు పునర్వ్యవస్థీకరించిన కార్పొరేట్ రుణాల విలువ తగ్గుముఖం పడుతూ వచ్చిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభకు వెల్లడించారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.3,70,279 కోట్ల రుణాలను పునర్వ్యవస్థీకరించగా.. 2015-16లో ఈ విలువ రూ.2,99,111 కోట్లకు తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2016-17) బ్యాంకులు రూ.2,04,884 కోట్ల కార్పొరేట్ రుణాలను పునర్వ్యవస్థీకరించాయన్నారు. ఏయే కంపెనీల రుణాలను పునర్వ్యవస్థీకరించాయో వివరాలు తెలుపాలని కోరుతూ సభలో అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ జైట్లీ ఈ విషయాలను వెల్లడించారు. ఆర్బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలను పునర్వ్యవస్థీకరిస్తాయన్నారు. అయితే, ఆర్బీఐ చట్టం-1934 లోని సెక్షన్ 45ఈ ప్రకారంగా బ్యాంకులు ఈ వివరాలను గోప్యంగా ఉంచాల్సి ఉంటుందన్నారు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 21% వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడున్నర నెలల కాలానికి (ఏప్రిల్ 1-జూలై 15) ప్రత్యక్ష పన్ను వసూళ్ల రూపంలో ప్రభుత్వానికి రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. వార్షిక ప్రాతిపదికన వసూళ్లు 21.4 శాతం వృద్ధి చెందాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించారు. ప్రస్తుత పన్ను వసూళ్ల వృద్ధి.. బడ్జెట్ అంచనాలు అందుకునేందుకు అవసరమైన 15.32 శాతం కన్నా అధికమని మంత్రి తెలిపారు.

10,100 ఎగువకు నిఫ్టీ



ముంబై, ఆగస్టు 1: ఈవారం స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజు సరికొత్త గరిష్ఠాలను తాకాయి. వాహన సంస్థల జూలై విక్రయాలు ఆశాజనకంగా ఉండటం, గ్లోబల్ మార్కెట్ల సంకేతాలు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. బుధవారం ఆర్బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు కాస్త జాగ్రత్తపడ్డారు. గతనెలకు తయారీ రంగ పనితీరు కుంటుపడటం కూడా ట్రేడర్ల జోరుకు కళ్లెం వేసింది. దాంతో మార్కెట్లు స్వల్పలాభాలతో సరిపెట్టుకున్నాయి. మంగళవారం స్టాక్ ఎక్స్చేంజ్‌లలో ట్రేడింగ్ ముగిసేసరికి 60.23 పాయింట్లు (0.19 శాతం) బలపడ్డ సెన్సెక్స్ 32,575.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37.55 పాయింట్లు (0.37 శాతం) పెరిగి 10,114.65 వద్ద ముగిసింది. ప్రధాన స్టాకులతోపాటు మధ్య స్థాయి షేర్లకు సైతం కొనుగోళ్ల మద్దతు లభించగా.. చిన్న కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 0.45 శాతం పెరుగగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.12 శాతం జారుకుంది. సెన్సెక్స్ షేర్లలో మారుతి సుజుకీ అత్యధికంగా 1.96 శాతం లాభపడింది. హీరోమోటోకార్ప్ స్టాకులు 1.85 శాతం పుంజుకున్నాయి. విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, హిందుస్థాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్ షేర్లు ఒకటిన్నర శాతంపైగా పెరిగాయి. లుపిన్, ఓఎన్జీసీ, ఎస్బీఐ మాత్రం ఒక శాతంపైగా మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను కోల్పోయాయి.

బీఎస్ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 317.6(321.0)14298
Aditya Spin 9.02(9.03)1990
Agro Tech Foods 511.25(512.0)2290
Aishwarya Telcom 4.31(4.51)1750
Alphageo 855.45(854.35)4349
Alufluoride 59.05(59.95)3642
Amara Raja 848.6(834.5)11687
Andhra Bank 56.65(57.0)69076
Andhra Cements 9.8(9.91)16617
Andhra Petroch 26.3(26.8)35991
Andhra Sugars 339.2(342.15)7003
Anjani Portl 224.25(223.15)1401
Astra Micro 133.9(134.2)109812
Aurobindo Phar 734.5(719.4)221698
Avantel 231.0(241.35)7311
Avanti Feeds 1706.15(1638.6)47783
Avon Organics 6.44(5.91)15399
B N Rathi Secu 36.25(36.9)9291
Balaji Amines 331.75(330.2)2387
Bambino Agro 198.5(199.0)76
Bartronics India 15.35(15.46)7374
Bgr Energy Sys147.7(149.9)8579
Bhagiradha 185.25(187.2)7474
Bhagyaind 24.45(24.8)4572
Bnr Udyog 38.3(38.25)172
Brilliant Secur8.24(8.14)1374746
Cambridge Tech76.25(77.4)23633
Canaan Credi 16.55(15.8)5
Cat Tech 0.61(0.59)201
Ccl Products 282.85(283.0)1687
Celestial Labs 24.7(24.8)13764
Cil Securities 41.25(39.6)1296
Color Chips 50.7(51.55)9991
Coromandel Fert 446.45(448.7)544138
Country Club 14.78(14.86)16797
Cubex Tubings 18.15(18.5)3500
Cybermate Inf. 3.48(3.41)59487
Danlaw Tech. 53.9(54.75)4160
Deccan Cem1144.0(1159.95)1478
Denisons Hyd 1273.0(1261.95)135
Dhan Roto Sp 22.8(22.8)20
Diamond Power Infra26.7(26.85)34470
Divi's Lab 668.35(671.9)61408
Divyashakti Gr 106.3(104.0)1840
Dolphin Med 1.42(1.38)2000
Dr Reddy`s 2426.75(2385.5)80773
Empee Sugars 5.76(5.66)6805
Everest Org 96.35(100.0)236
Facor Alloys 4.11(4.08)127560
Fenoplast 62.35(65.6)2100
Firstobj 15.75(16.3)437
Fortune Info 111.05(110.75)4351
Four Soft 109.0(110.95)1409
Gati 119.4(120.9)43642
Gayatri 9.9(10.24)116744
Gayatri Proj168.75(169.35)1962
Gennex 4.56(4.46)155270
Gmr Infra 18.7(18.75)1283281
Godavari Drugs 40.25(40.15)2332
Goldinfra 71.65(70.15)21358
Goldstone Tech 8.61(8.2)21099
Granules Ind 137.8(136.1)106568
Gss America Info20.95(20.75)260
Gulf Oil Corp 492.95(440.0)32228
Gvk Pwr 12.93(12.83)3024581
Hbl Power 47.45(47.7)29970
Heritage Food 1255.3(1239.0)965
Hindustan Bio Sci0.97(1.02)500
Hyderabad Ind 1136.8(1165.1)2524
I V R Cons 6.47(6.77)576560
I.c.s.a. 3.2(3.3)227437
Ikf Technologies 0.66(0.68)183268
Inani Securities 9.85(9.39)125
Incap 43.6(42.85)4517
Infotech Ent 525.05(525.0)7679
Ivrcl Infrastruc 6.47(6.77)576560
K C P 102.8(103.65)26816
Kakatiya Cem381.65(384.9)1787
Kallam Spinning 27.5(28.0)23493
Karan Woosin 1.04(1.09)1500
Kaveri Seed 682.2(691.95)21691
Kernex Mic. 36.25(36.15)6692
Knr Constru 211.5(211.25)1855
Krebsbio 103.0(101.0)1570
L N Polyesters 2.19(2.19)3
Lanco Ind 370.05(375.45)15063
Lanco Infratech 1.27(1.21)25363493
Livewell Home Fin 76.9(80.05)1185
Lokesh Mach 79.55(81.05)18427
Madhucon Proj31.75(32.05)20257
Maytas Infra 46.4(47.25)14481
Medinova Diagno 24.6(25.1)3200
Mhril 399.1(405.2)3940
Mic Electronics 8.53(8.66)64700
Moldtek 50.0(49.8)2824
Moschip Semi 45.85(46.55)44418
Msr India Ltd 24.6(25.75)113763
N C L Ind 209.55(196.25)16120
Nagarjuna Agri 37.45(38.4)19031
Nagarjuna Con 88.9(88.85)403523
Natco Pharma 967.0(973.55)29469
National Min 125.75(126.75)184173
Nbventure 135.4(137.1)18170
Ncc Finance 1.8(1.8)1603
Neha International 6.0(6.09)66833
Neha IntLtd. 6.0(6.09)66833
Neocure Thera 3.68(3.63)9907
Nettlinx 98.5(92.85)15981
Neuland Lab 1440.4(1446.4)706
Niharinf 16.05(17.6)2082
Nile 617.5(623.1)9340
Oil Country 45.85(46.85)2947
Padmalaya Tel 9.49(9.04)31240
Pankaj Polymers 7.86(7.49)865
Panyam Cem 66.25(66.6)14334
Pennar Ind 55.3(54.75)89459
Phaarmasia 23.0(23.8)40
Phyto Chem 59.25(59.9)2295
Pitti Lamin 56.05(54.95)10889
Pokarna 1356.3(1294.65)387
Prajay Eng 9.38(9.33)20098
Premier Expl 481.7(487.15)5646
Prism Cement 121.4(119.75)16204
Ragsan Petrochem 60.0(60.2)70
Rain 128.45(129.9)107455
Raj Packaging 58.25(57.85)1478
Ram Informatics 43.8(48.3)3496
Ras Finance 18.8(18.8)100
Regency Ceramic 5.9(5.9)4501
Restile Ceramics 5.65(5.5)299
Roopa Industries 13.1(13.06)2612
Rubra Medicaments 3.53(3.53)600
Saamya Biotech India 1.88(1.8)40
Sagar Cements 829.85(839.3)1720
Samkrg Pistons 298.6(296.45)10247
Sampre Nutritions 48.0(46.5)13306
Sanghi Ind 87.35(89.5)73225
Sanjeevni Indus29.45(30.55)51666
Sark Sys 78.75(79.75)17976
Sathavahana Ispat 44.0(42.05)7362
Saven Technologies 22.9(22.8)3053
Sec'bad Healthcare 0.95(0.96)1025300
Sks Microfin851.6(845.9)112072
Sms Pharma77.1(77.55)11003
Southern Online Bio 3.91(3.86)25935
Sowbhagya Exports 3.26(3.43)2100
Sr Ray Alkalies 32.05(32.9)548842
Sree Rayalaseema 133.35(134.6)2619
Srinivasa Shipp 64.8(66.5)1697
Steel Exchange 92.0(94.1)172810
Sujana 1.2(1.29)14633
Sujana Towers 4.82(4.96)40473
Sujanametal 1.99(2.13)57153
Surana Telecom 5.25(5.15)5799
Suryachakra Power 1.65(1.68)114989
Suryalak Cott 109.7(110.4)6989
Suryalata Spin 137.85(143.65)504
Suryavanshi Spin 8.84(9.28)148
Suvarna Cem 168.65(167.5)1074
Suven 170.1(166.4)47954
Taj Gvk 166.4(163.45)106184
Tanla Solutions 37.45(39.05)52610
Tci Fin 23.25(23.5)13205
Transcorp Int18.55(19.1)9625
Transgene Biotek 2.63(2.76)48040
Transport Co 303.95(313.7)12129
Trendy Knitwear 0.21(0.21)201
Tyche 61.95(63.25)2067
Unisocks 3.84(3.91)4350
Usher 8.22(8.07)10101
V & K Softech 4.7(4.84)100
V B C Ferro 42.0(42.0)9019
V S T Ind 3019.8(3097.65)303
Vamshi Rubber 71.2(73.15)3268
Viceroy Hotels 19.15(19.25)33777
Vijay Textiles 61.45(60.0)16942
Vimta Labs 146.65(150.1)6989
Virat Crane 36.7(36.5)3483
Virnichiq 88.0(88.4)10618
Visaka Ind 469.6(473.9)8583
Vista Pharma 31.2(32.1)23045
Vivmed Labs 121.75(124.85)128251
Vivo Bio Tech 76.9(76.8)552
Vmf Softech 101.25(102.0)4501
Waterbase 108.3(106.3)125430
Ybrant Digital 6.94(7.3)108394
Zen Tech 56.25(57.1)6037
Zenotech 56.95(54.8)308697











హరితోత్సవం

1. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలో మొక్కనాటుతున్న మంత్రి ఈటల రాజేందర్
2. పెద్దపల్లి జిల్లా సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారంలో మొక్కనాటుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు వివేక్ తదితరులు
3. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ మెమోరియల్ పాఠశాలలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు
4. పెంబర్తిలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
5. హైదరాబాద్‌లోని కిమ్స్ ప్రాంగణంలో మొక్కనాటుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

గంగిరెద్దులోళ్లను ప్రభుత్వం ఆదుకుంటుంది



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: గంగిరెద్దుల కులస్థులను తప్పకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన గంగిరెద్దుల కులస్థుల జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గంగిరెద్దులోళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కులతో సంబంధం లేకుండా గురుకుల పాఠశాలలో గంగిరెద్దుల విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వెనుకబడిన కులాల సంఘాల నాయకులతో సెక్రటేరియట్‌లో సమావేశం పెట్టామని, అనంతరం అసెంబ్లీ హాల్‌లో కూడా నిర్వహించామని చెప్పారు. ఇటువంటి సమావేశాలు గతంలో ఏ ప్రభుత్వమూ నిర్వహించలేదని, వాళ్లను కేవలం ఓట్ల కోసమే వాడుకున్నారు తప్ప సమస్యలు పరిష్కరించిన దాఖలాల్లేవన్నారు. సెప్టెంబర్‌లో మరో మారు సమావేశం ఏర్పాటు చేస్తామని, అనంతరం గంగిరెద్దుల కులస్థుల ఎదుగుదలకు సహాయం చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తానన్నారు. అడుక్కొని తినడం మానాలని, సమాజంలో కలిసి జీవించాలని, కుల కట్టుబాట్లు కొంత మేర పక్కన పెట్టాలని కోరారు. సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు సీతయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కనుకయ్య, గౌరవ అధ్యక్షుడు వెంకన్న, స్థానిక టీఆర్ఎస్ నాయకులు, భారీ సంఖ్యలో గంగిరెద్దుల కులస్థులు పాల్గొన్నారు.



అపురూపం.. ఆ అంగన్‌వాడీ కేంద్రం

రంగురంగుల పిచ్చుకలు...బాతులు...చిన్నపాటి స్విమ్మింగ్‌పూల్...చేపలు పరుగులు పెట్టే ఎక్వేరియం... గోడల నిండా ఆకర్షణీయమైన బొమ్మలు.. మొత్తంగా ఆహ్లాదకరమైన వాతావరణం.. అక్కడకు వెళ్తే ఇంకాసేపు కూర్చోవాలనే రీతిలో ఉంటుంది. ఇదేదో ప్రకృతి అహ్లాదాన్ని పంచే దర్శనీయ స్థలం కాదు.. బడిబుడి అడుగులు వేసే చిన్నారులు అక్షరాలు దిద్దేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామంలోని ఈ అంగన్‌వాడీ కేంద్రం రోజురోజుకూ దర్శనీయ కేంద్రంగా మారిపోతున్నది. మొదట రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా ఓ అంగన్‌వాడీని తీర్చిదిద్ది అదే రీతిన అన్నింటినీ అమలు చేయాలని మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన సూచన మేరకు కలెక్టర్ అత్యంత బాధ్యతాయుతంగా తన క్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్ నుంచి రూ.5లక్షలు వెచ్చించి ఈ కేంద్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు.

- సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి





కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు... ఖమ్మంలోని ఇల్లందు క్రాస్‌రోడ్డులో ఆందోళన చేస్తున్న కార్మికులు

కాంగ్రెస్‌పై కరెంటోళ్ల కన్నెర్ర

- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు
- క్రమబద్ధీకరణపై కోర్టుకు వెళ్లడంపై మండిపాటు
- కుట్ర చేస్తున్న ప్రతిపక్షాలను అడ్డుకుంటాం
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల హెచ్చరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/న్యూస్‌నెట్‌వర్క్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడికిపోయింది. ప్రతిపక్ష పార్టీల నేతల కుట్ర కారణంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆనందం ఒక్క రోజులోనే ఆవిరైంది. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 30వేల మంది తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని భావించింది. అందులో భాగంగానే మొదటి విడుతగా 20,903మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతలు కోర్టును ఆశ్రయించడంతో సదరు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు చేపట్టారు. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. 30 ఏండ్లుగా విద్యుత్ సంస్థల్లో వివిధ స్థాయిల్లో పని చేస్తున్నామని, నిబంధనలకు అనుగుణంగానే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తే కాంగ్రెస్ నేతలు అడ్డుకునేందుకు కుట్ర చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా వరంగల్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. అనంతరం కలెక్టర్‌తోపాటు ఎన్పీడీసీఎల్ సీఎండీకి వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లాలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో కార్మికులు ధర్నాలు, నిరసన ర్యాలీలతో హోరెత్తించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కేసీ క్యాంపులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పెద్దపల్లి జిల్లా రామగుండం బీ థర్మల్ కేంద్రం ఎదుట తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం హెచ్ 58 ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. ఆయా జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లోని విద్యుత్ కార్యాలయాల ఎదుట 1104, టీఆర్‌వీకేఎస్, ఇఫ్టూ, తెలంగాణ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించారు. కోర్టులో పిల్ వేసిన శ్రవణ్‌కుమార్ దిష్టిబొమ్మను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యుత్తు శాఖ కార్యాలయం ఎదుట దహనం చేశా రు. ఎస్‌ఈ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో, నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో ధర్నా చేశారు. నిజామాబాద్ పవర్‌హౌస్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. మెదక్ ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు.

17 ఏండ్లుగా పనిచేస్తున్నా..



రూ.2వేల వేతనంపై 17 ఏండ్లుగా పనిచేస్తున్నా. పర్మినెంట్ అవుతుందనే ఆశతోనే పనిచేస్తున్నా. సీఎం కేసీఆర్ దేవుడి రూపంలో వచ్చి మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. ఈక్రమంలో ప్రతిపక్ష పార్టీల నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించడం సరి కాదు.

- ఎం సుదర్శన్, క్యాజువల్ లేబర్

ప్రాణాలను పణంగా పెట్టి బతుకుతున్నం..



రూ.800 వేతనంతో నా జీవితం ప్రారంభమైంది. సీఎం కేసీఆర్ పుణ్యమా అని నా కుటుంబంలోకి వెలుగులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ నేతలు కుట్రలు చేసి మా బతుకులను చీకటి చేయాలని చూస్తున్నారు.

—జీ నర్సింహారెడ్డి, సెక్షన్ లేబర్

ప్రతి ఇంటికీ శుద్ధ జలం

కొల్లాపూర్ టౌన్ : ప్రతి ఇంటికీ నల్లా సౌకర్యం కల్పించి సురక్షితమైన జలం అందించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పనులను వేగవంతం చేసిందని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామి ఆలయం వద్ద రూ.61.43 లక్షలు, జయశంకర్ కాలనీలో రూ.61.43లక్షలు, ఖాదర్‌బాషా రోడ్డులో రూ.96.72 లక్షలతో వాటర్‌ట్యాంకుల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి రూ.40 కోట్లు వెచ్చించి సింగోటం శ్రీవారి సముద్రం వద్ద చేపట్టిన తాగునీటి పథకం పనులు త్వరలోనే పూర్తి కానున్నాయని తెలిపారు.

బోధన్ స్కాంలో ఇద్దరికి బెయిల్

నిజామాబాద్ లీగల్: బోధన్ వాణిజ్య పన్నులశాఖలో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణంలో ఎనిమిదో ముద్దాయి నారాయణదాస్ వెంకటకృష్ణమాచారి, తొమ్మిదో ముద్దాయి ధరణి శ్రీనివాస్‌కు నిజామాబాద్ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ మేరిసారా దానమ్మ మంగళవారం బెయిల్ మంజూరు చేశారు. ముద్దాయిలిద్దరు వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో అధికారులుగా ఉన్న కాలంలో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని పేర్కొంటూ సీఐడీ అధికారులు మే ఒకటిన వారిని అరెస్ట్ చేశారు. అనంతరం వీరిని కోర్టు రిమాండ్‌కు తరలించింది. 90రోజులు దాటినా సీఐడీ అధికారులు అభియోగపత్రం దాఖలు చేయడక పోవడంతో వీరికి బెయిల్ మంజూరైంది.

36.51లక్షల పురుగు మందులు స్వాధీనం

నర్సంపేట రూరల్ (వరంగల్ రూరల్): వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరం, లక్నేపల్లి గ్రామాల్లోని మూడు గోదాములపై వ్యవసాయాధికారులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పురుగు మందుల నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.36.51లక్షలుగా ఉంటుందని తెలిపారు. నర్సంపేట ఏడీఏ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, నెక్కొండ ఏఓలు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

మావోయిస్టు సానుభూతిపరుల లొంగుబాటు

చంద్రపూర్: గడ్చిరోలి జిల్లా బ్రమగడ్ తాలూకాలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది మావోయిస్టు సానుభూతిపరులు మంగళవారం బ్రమగడ్ డీఎస్పీ సందీప్ గావితే ఎదుట లొంగిపోయారు. వారి వద్ద ఉన్న 12 నాటు తుపాకులను పోలీసులకు అప్పగించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ తమ పోలీసు బృందాలు గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో చైతన్యవంతులైన గిరిజనులు ఇకపై మావోయిస్టులకు సహకరించబోమని ప్రతిజ్ఞ చేశారన్నారు.

సహకార సంఘాలన్నింటినీ కంప్యూటరీకరిస్తాం

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సహకార సంఘాలన్నింటినీ దశల వారీగా కంప్యూటరీకరిస్తామని నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమలోర్ పావనాథన్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి విండోలో కంప్యూటర్ సేవలను పరిశీలించారు. అనంతరం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 63 వేల సహకార సంఘాలను కంప్యూటరీకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 907 సహకార సంఘాలుండగా మొదటి దశలో 798 సంఘాలను కంప్యూటరీకరిస్తున్నామని చెప్పారు. కంప్యూటరీకరణకు తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 6 సహకార సంఘాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశామన్నారు.

ఆలస్యమైనా.. జూరాలకు బేఫికర్

- పవర్‌హౌస్, కాల్వల రీజనరేటింగ్ వాటర్ రాక..
- నారాయణపూర్ నుంచి 9,704 క్యూసెక్కులు విడుదల
- జూరాల జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం



జూరాల జలాశయం

జోగులాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉన్న రైతులకు దిగులు లేదు. ఈ సారి కూడా ఆగస్టులో కురిసే ప్రతి చినుకూ ఇకపై జూరాలకు చేరనున్నది. ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టులన్నీ పూర్తిగా నిండటం, ఇంకా వరద కొనసాగుతుండటంతో పాలమూరులో సేద్యానికి ఢోకా ఉండదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. నారాయణపూర్ నుంచి జూరాలకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. సోమవారం రాత్రి స్పిల్‌వే గేట్ ఎత్తి 3,704 క్యూసెక్కులు, పవర్‌హౌజ్ ద్వారా 6వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. మంగళవారం ఉదయం వరకు జూరాల ప్రాజెక్టుకు 3,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది.

ఎగువన కురిస్తే.. దిగువన పండుగే..

కృష్ణమ్మపై ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండాయి. మంగళవారం ఉదయం వరకు ఆల్మట్టిలో 128.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇంకా 35,521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 18,448 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అదే విధంగా నారాయణపూర్ ప్రాజెక్టులో 36.98 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. జూరాలకు నీరు రావాలంటే ఈ రెండు ప్రాజెక్టుల నుంచే విడుదల చేయాల్సి ఉంటుంది.

జూరాలకు ఢోకా లేదు..

ఇప్పుడున్న వరద, ఎగువ ప్రాజెక్టులో నీటి నిల్వల ఆధారంగా కొంచెం ఆలస్యమైనప్పటికీ.. జూరాల ఆయకట్టుకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు ఉండవు. రెండు రోజుల నుంచి కృష్ణా రివర్ బెల్ట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలతో జూరాలకు వరద మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఇప్పటి నుంచి డిసెంబర్ వరకు నారాయణపూర్ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల చేస్తారు. దీనిలో దాదాపు 1500 నుంచి 2వేల క్యూసెక్కుల రీ జనరేటింగ్ వాటర్ తప్పనిసరిగా నదిలో కలుస్తుంది. దీంతోపాటు నవంబర్ వరకు నారాయణపూర్ వరకు పవర్‌హౌజ్‌కు దాదాపు 3వేల నుంచి 6 వేల క్యూసెక్కులు వాడుతుంటారు. ఈ నీరు కూడా దిగువకు రానున్నది. ఈ నేపథ్యంలో జూరాల నుంచి ఎత్తిపోతల పథకాలు, కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తే ప్రాజెక్టులో నీటి నిల్వ పడిపోయే అవకాశాలు లేవని, ఆయకట్టుకు నీటిని పుష్కలంగా అందించవచ్చని ఇంజినీర్లు ప్రభుత్వానికి నివేదించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి దిగువకు, జూరాల నుంచి ఎత్తిపోతల పథకాలు, కాల్వలకు నీటి విడుదల కొనసాగుతున్నది. సోమవారం ఉదయం నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి స్పిల్‌వే గేట్, పవర్‌హౌస్ ద్వారా 9,704 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. అదే విధంగా కాల్వలకు 11,204 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రాత్రి వరకు నారాయణపూర్ నుంచి 20,908 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదవుతున్నది. జూరాల నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1 కు 650, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 900, కుడి కాల్వకు 656 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 811, భీమా లిఫ్ట్-2కు 77 క్యూ సెక్కులు వదులుతున్నారు. జూరాలకు ఇన్‌ఫ్లో 3000 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 4151 క్యూసెక్కులుగా నమోదైంది.



వికారాబాద్‌లో టీఆర్ఎస్వీ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరావు

జోరుగా టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదు

నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతున్నది. విద్యార్థులు అధిక సంఖ్యలో సభ్యత్వాలు తీసుకుంటున్నారు. వికారాబాద్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే బీ సంజీవరావు మాట్లాడారు. విద్యార్థులు టీఆర్ఎస్వీలో సభ్యత్వం పొంది బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వాలు అందించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో టీఆర్ఎస్వీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాజీ కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము అశోక్ ఆధ్వర్యంలో స్థానిక కాలేజీల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా సభ్యత్వాలను తీసుకున్నారు.




కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో టీఆర్ఎస్వీ సభ్యత్వం పొందిన విద్యార్థులు

నేరెళ్ల ఘటనలో 8 మందికి బెయిల్

కరీంనగర్ లీగల్: సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రాంచంద్రాపూర్ స్టేజీ వద్ద ఇటీవల ఇసుక లారీ ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించిన ఘటనలో జరిగిన విధ్వంసంపై దాఖలైన మూడు కేసుల్లో ఎనిమిదిమంది నిందితులకు కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసులు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. గత నెల 2న రాంచంద్రాపూర్ స్టేజీ వద్ద లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. నేరెళ్ల, జిల్లెల్ల గ్రామస్థులు ఆగ్రహంతో లారీని ధ్వంసం చేసి, పోలీసులను సైతం అడ్డుకున్నారు. ఈ కేసుల్లో నేరెళ్లకు చెందిన బానయ్య, గంధం గోపాల్, చెప్యాల బాలరాజు, కోల హరీశ్, పూసల ఈశ్వర్ కుమార్, జిల్లెల్లకు చెందిన చీకోటి శ్రీనివాస్, కే గణేశ్, రామచంద్రాపురానికి చెందిన బత్తుల మహేశ్‌ను అరెస్టు చేసిన పోలీసులు గతనెల 8న రిమాండ్ నిమిత్తం కరీంనగర్ జైలుకు తరలించారు. మంగళవారం జడ్జి వీరికి బెయిల్ మంజూరు చేశారు. నెల రోజులపాటు వేములవాడలోనే ఉండాలని, ప్రతి ఆది, బుధవారాల్లో వేములవాడ పోలీస్ స్టేషన్‌లో హాజరవ్వాలని, కోర్టు అనుమతి లేనిదే వేములవాడ పట్టణం దాటి వెళ్లరాదని షరతులు విధించారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 296.498 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	35521	18448	1705	1704.72	129.72	128.19
నారాయణపూర్	25301	20,908	1615	1614.17	37.646	36.98
జూరాల	3,000	4151	1045	1037.57	9.66	5.560
తుంగభద్ర	13795	832	1633	1612.10	100.86	39.42
శ్రీశైలం	425	74	885	777.90	215.807	19.59
నాగార్జునసాగర్	400	400	590	500.70	312.045	116.42
పులిచింతల	0	0	175	117.32	45.77	3.21
ప్రకాశం బ్యారేజీ	7711	7711	57.05	54.85	3.070	2.49

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	13333	2883	1522	1511.31	102.732	64.00
కడెం	0	857	700	688.475	7.6	4.956
ఎస్సారెస్పీ	0	50	1091	1055.50	90.313	9.656
సింగూరు	0	452	1717.93	1709.6	29.91	17.95
నిజాంసాగర్	0	40	1405	1380.30	17.803	1.35
ఎల్లంపల్లి	217	418	485	472.11	20.175	10.51
లోయర్‌మానేరు	0	129	920	893.65	24.07	7.394
ధవళేశ్వరం	63265	63033	45	45	2.93	2.93



మన రాష్ట్రం నుంచి

మరో మిథాలీ రావాలి

అంతటా వినిపిస్తున్న జయజయధ్వానాలు..
కురుస్తున్న అభినందనల వెల్లువ..
కానుకలు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు..
మర్రిచెట్టులాంటి పురుష క్రికెట్ నీడ నుంచి ఒక్కసారిగా
వెలుగులోకి వచ్చిన భారత మహిళా క్రికెట్ సరికొత్త
వెలుగులతో కాంతులీనుతున్న సందర్భం..
భారత మహిళా క్రికెట్‌కు చిరునామా..
హైదరాబాద్ క్రికెట్ మణిపూస.. మన మిథాలీకి అంతా
కొత్తగా.. సరికొత్తగా.. కనిపిస్తున్న అరుదైన దృశ్యాలు..
ఏండ్లుగా క్రికెట్ ఆడుతున్నా దక్కని గుర్తింపు
కెరీర్ చరమాంకంలో లభించడంతో ఎంతో ఆనందం..
మరెంతో ఉద్వేగం.. ఫైనల్ చూశానమ్మా,
బాగా ఆడారంటూ ప్రధాని మోదీ ప్రశంసలు..
కోటి నజరానా, ఇంటిజాగ కేటాయింపుతో
మన సీఎం కేసీఆర్ ఘన సత్కారం..

ప్రపంచకప్ ఫైనల్ చేరడంలో భారత జట్టును ముందుండి నడిపించిన సారథి మిథాలీ రాజ్ ప్రస్తుత పరిస్థితి ఇది.

ఐనా అదే ప్రశాంతత.. మైదానంలో ఎంత నిబద్ధతతో ఉంటుందో ఇప్పుడూ అంతే ధ్రుడచిత్తంతో కనిపిస్తున్న మిథాలీ.. మన రాష్ట్రం నుంచి మరో మహిళా స్టార్ క్రికెటర్ ఎవరవుతారు? అకాడమీ స్థాపన విషయంలో తన ఆలోచనలు, మహిళా క్రికెట్ అభివృద్ధి కోసం తన సూచనలు, హైదరాబాద్ మహిళల క్రికెట్‌లో హెచ్‌సీఏ పాత్ర, ఇలా తన అంతరంగాన్ని 'నమస్తే తెలంగాణ'తో ఆవిష్కరించింది. ఆ విశేషాలేంటో మిథాలీ మాటల్లోనే చదవండి!

మహిళల క్రికెట్ అభివృద్ధి కోసం హెచ్‌సీఏ కృషిచేయాలి
ఇప్పుడు భారత క్రీడారంగంలో మహిళలది ప్రత్యేకపాత్ర
మరో రెండేండ్ల దాకా రిటైరయ్యేది లేదు
ప్రోత్సాహకాలతో ప్రతిభ రెట్టింపు
నమస్తే తెలంగాణ తో భారత మహిళా క్రికెట్ సారథి మిథాలీ

ప్రపంచకప్‌నకు ముందు, తర్వాత ఎలాంటి ఫీలింగ్?

- ప్రపంచకప్ కోసం ఇంగ్లండ్ బయలుదేరేముందు మాపై ఎవరికీ అంచనాల్లేవు. అసలు మేం ఫైనల్ దాకా చేరుతామని కూడా ఎవరూ ఊహించి ఉండరు. అందుకు తగ్గట్టే మాకు వీడ్కోలు పలికేందుకు కూడా కొందరు బీసీసీఐ అధికారులు, మాకు సన్నిహితులైన కొద్దిమంది మాత్రమే వచ్చారు. అయినా, మేం ఉత్సాహంగానే లండన్ ఫ్లైట్ ఎక్కాం. అయితే, జట్టులోని సభ్యులమంతా ఒకటి మాత్రం అనుకున్నాం, కనీసం సెమీఫైనల్ దాకానైనా చేరాలని. అయితే ఆస్ట్రేలియాతో సెమీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత ప్రదర్శనకు తోడు జట్టులోని సభ్యులమంతా సమిష్టిగా రాణించడంతో ఫైనల్ బెర్త్ ఖరారవడంతో మా ఆనందానికి అవధుల్లేవు. కానీ, ఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో ఓడడంతో డీలాపడ్డాం. చివరిదాకా అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకున్నామే అన్న భావన మాలో కలిగింది. ఫైనల్ ముగిశాక డ్రెస్సింగ్ రూమ్‌లో ఒక ఉద్విగ్నమైన వాతావరణం అలుముకుంది. కానీ, భారత్ వచ్చాక మాకు లభించిన స్వాగతం చూసి ఓటమిని మరిచిపోయాం. సెలెబ్రిటీల నుంచి సాధారణ ప్రజల దాకా మాపై చూపిన అభిమానం ఎప్పటికీ మరిచిపోలేనిది. ఇదే ఆదరణ ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా.

ఫైనల్లో ఒత్తిడి వల్లే ఓడామనుకుంటున్నారా?

- ఒత్తిడి అని అందరూ అనుకోవచ్చు. కానీ, నేనైతే అలా భావించడం లేదు. ఆటలో గెలుపోటములు సహజం. చివరిదాకా మ్యాచ్ ఉత్కంఠగానే సాగింది. మేం బాగానే ఆడాం. ప్రత్యర్థి ఇంగ్లండ్ ఇంకా బాగా ఆడింది. గెలువాలన్న కసితోనే ఆడాం. కానీ, ఆరోజు మాకు కలిసిరాలేదంతే. అయినా, ఇప్పుడు జట్టు చాలా పరిణతి చెందింది. అందరూ అద్భుతంగా ఆడుతున్నారు. ఈ టోర్నీ ప్రదర్శనతో కచ్చితంగా ఒకరోజు ప్రపంచకప్ సాధిస్తామన్న ఆత్మవిశ్వాసం వచ్చింది.

సైనా, సానియా, సింధు, మిథాలీ.. ఇలా భారత క్రీడారంగంమంటే మహిళలదే హవా అనుకోవచ్చా..?

- మహిళలు ప్రతిరంగంలోనూ పైకిరావడం శుభ పరిణామం. కొన్నేండ్లక్రితం మన దగ్గర అథ్లెటిక్స్‌లోనే మహిళలు ఎక్కువగా కనిపించేవారు. కానీ, ఇప్పుడు కాలం మారింది. మహిళలు అన్ని క్రీడలపట్లా ఆకర్షితులవుతున్నారు. అథ్లెటిక్స్ అనే గాకుండా, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, క్రికెట్.. ఇలా ప్రతి క్రీడలోనూ అమ్మాయిలు దూసుకెళ్తున్నారు. ఇందుకు తార్కాణమే ఒలింపిక్స్‌లో సైనా, మేరీకోం, సింధు, సాక్షి మాలిక్ పతకాలు సాధించడం. పురుషులకు దీటుగా తామూ రాణించగలమని మహిళలు నిరూపిస్తున్నారు.

తెలంగాణ నుంచి మరింత మంది మహిళా క్రికెటర్ల రాకను ఆశించవచ్చా?

- మన రాష్ట్రం నుంచి మరో మహిళా క్రికెటర్ లేకపోవడం బాధ కలిగించే అంశం. ఇక్కడ సైనా, సానియా అంతర్జాతీయ విజయాల స్ఫూర్తితో చాలామంది అమ్మాయిలు బ్యాడ్మింటన్, టెన్నిస్‌వైపు పరుగులు పెడుతున్నారు. ఇది మంచి పరిణామమే. కానీ, క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకోవడంపై అంతగా దృష్టి సారించడం లేదు. ఎందుకంటే, క్రికెట్‌కు సంబంధించిన సరైన కోచింగ్ సౌకర్యాలు లేకపోవడం లాంటి అంశాలు కారణమై ఉండొచ్చు. ఇక నుంచి అలా ఉండకపోవచ్చనుకుంటున్నాను. ఇవాళ మా ప్రదర్శన చూసి కొంతమంది అమ్మాయిలైనా స్ఫూర్తి పొంది ఉంటారు. కచ్చితంగా భవిష్యత్‌లో మన రాష్ట్రం నుంచి మరో మిథాలీ వస్తుందన్న నమ్మకముంది.

రాష్ట్రంలో మహిళల క్రికెట్ అభ్యున్నతి కోసం హెచ్‌సీఏ ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- నేను సూచనలిచ్చేంత పెద్దదాన్ని కాదన్నది నా అభిప్రాయం. కానీ, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కచ్చితంగా మహిళల క్రికెట్‌పై దృష్టి సారించాల్సిన అవసరముంది. పురుషుల జట్టుపై ఎలాంటి దృష్టిసారించారో, మహిళల జట్లను తయారు చేయడంలోనూ అంతే శ్రద్ధ వహించాలి. హెచ్‌సీఏ చొరవ లేకపోతే ఇక్కడి నుంచి మరో మహిళా క్రికెటర్ వచ్చేందుకు అవకాశం లేదు. కచ్చితంగా హెచ్‌సీఏ పాలకులు దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. గ్రామీణస్థాయిలో అమ్మాయిలను క్రికెట్‌పై మక్కువ చూపేలా ప్రతిఏటా శిక్షణ శిబిరాలు నిర్వహించాలి. ప్రతిభగల క్రీడాకారిణులను ఎంపికచేసి వాళ్లకు జిల్లాస్థాయిలో టోర్నీలు నిర్వహించాలి.

సీఎం నుంచి నజరానా ఊహించారా?

- ఫైనల్లో ఓడినా కూడా ప్రధాని మోదీతో పాటు మన సీఎం కేసీఆర్ దాకా అందరూ ప్రశంసించారు. అద్భుతంగా పోరాడారంటూ పొగిడారు. కానీ, ప్రోత్సాహకం గురించి అసలు పట్టించుకోలేదు. హైదరాబాద్‌లో అడుగుపెట్టగానే మన క్రీడాధికారులు నేరుగా సీఎం కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్లారు. కానీ, అక్కడికెళ్లాక నేను ఊహించనిదానికి భిన్నంగా కేసీఆర్ సార్ రూ. కోటి నజరానాతో పాటు ఇంటిస్థలం ప్రకటించడంతో చాలా సంతోషమేసింది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఇంటిస్థలం కోసం నాకిచ్చిన హామీ నెరవేరలేదు. ఇక దాని గురించి పట్టించుకోవడమే మర్చిపోయాను. కానీ, ఇప్పుడు నేనేమాత్రం ఊహించకుండానే నజరానా ప్రకటించిన కేసీఆర్‌గారికి కృతజ్ఞతలు. ఈ గుర్తింపును ఎప్పటికీ మర్చిపోలేను. ప్రోత్సాహకాలు అనేవి క్రీడాకారుల ప్రతిభ రెట్టింపు అయ్యేందుకు దోహదం చేస్తాయన్నది నా నమ్మకం.

రిటైర్మెంట్‌పై ఆలోచన?

- ఇటీవలే ప్రపంచంలోనే అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్‌గా రికార్డు సాధించాను. అంటే, ఇప్పటికీ నేను మెరుగ్గానే ఆడుతున్నానని అనుకుంటున్నాను. అలాంటప్పుడు రిటైర్మెంట్ గురించి ఎందుకు ఆలోచించాలి. కచ్చితంగా మరో రెండు, మూడేండ్లు అంతర్జాతీయస్థాయిలో ఆడగల సత్తా నాలో ఉందన్న విశ్వాసముంది. కాబట్టి ఇప్పటికైతే రిటైర్మెంట్ ఆలోచనలు పెట్టుకోలేదు.

మహిళల క్రికెట్ కోసం అకాడమీ స్థాపిస్తారా?

- ఇప్పటికైతే నాకలాంటి ఆలోచన లేదు. అయినా, నా దగ్గర అకాడమీలు స్థాపించేంత డబ్బులు కూడా లేవు. రిటైర్మెంట్ తర్వాత అకాడమీ గురించి ఆలోచిస్తా. కానీ, మహిళల క్రికెట్ కోసం భవిష్యత్‌లో కచ్చితంగా ఏదో ఒకటి చేయాలనుంది.

తీరికవేళల్లో ఏం చేస్తుంటారు?

- సినిమాలు చూడను. చిన్నప్పటినుంచి సినిమాలంటే అంతగా ఆసక్తి లేదు. పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం. క్రికెట్ కోసం వివిధ దేశాల పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఎప్పుడూ పుస్తకాలు వెంట తీసుకెళుతుంటాను. ఖాళీ సమయాల్లో పుస్తకాలు ఎంత చదివితే అంత బాగా మైండ్ రిఫ్రెష్ అవుతానన్నది నా అభిప్రాయం. డ్యాన్స్ అంటే ఇష్టం. చిన్నప్పుడు భరతనాట్యం నేర్చుకున్నాను. అప్పుడప్పుడూ ఇంట్లో డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుంటా.



వాళ్లకిచ్చే గౌరవం మాకెందుకివ్వరు?

- మిమానాశ్రయంలో డిఫ్లెంపిక్స్ అథ్లెట్ల నిరసన



న్యూఢిల్లీ: క్రీడాకారుల పట్ల పాలకుల వైఖరి మారడం లేదు. తరాలు మారుతున్నా..వారి నైజంలో మార్పు రావడం లేదు. స్టార్ ఆటగాళ్లకు బ్రహ్మరథం పట్టే నాయకులు, అభిమానులు..అదే దేశం కోసం పతకాలు సాధించిన బధిర ఆటగాళ్ల పట్ల చిన్నచూపు చూసిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ మధ్యే టర్కీ వేదికగా ముగిసిన డిఫ్లెంపిక్స్‌లో మన అథ్లెట్లు ఓ స్వర్ణం సహా ఐదు పతకాలతో సత్తాచాటారు. అంతర్జాతీయ వేదికపై దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన తమకు స్వదేశంలో ఘనంగా స్వాగతం దక్కుతుందని కోటి ఆశలు పెట్టుకున్నారు. కానీ వారి ఆశలు అడియాసలయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న డిఫ్లెంపిక్స్ బృందానికి నిరాశే ఎదురైంది. స్వదేశం బయల్దేరడానికి ముందు భారత క్రీడా ప్రాధికారిక సంస్థ(సాయ్)తో పాటు కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖకు సమాచారమిచ్చినా ఎవరూ స్వాగతం పలికేందుకు రాలేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆటగాళ్లు సాయ్ నుంచి గానీ క్రీడాశాఖ తరపున ఎవరైనా వచ్చేదాకా విమానాశ్రయం నుంచి కదిలేది లేదంటూ నిరసనకు దిగారు. దీనిపై డిఫ్లెంపిక్స్ ఆటగాళ్ల ప్రతినిధి ఒకరు మీడియాతో మాట్లాడుతూ 'డిఫ్లెంపిక్స్‌లో ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా మన ఆటగాళ్లు ఓ స్వర్ణం సహా ఐదు పతకాలు కొల్లగొట్టారు. దేశం గర్వపడేలా పతకాలు సాధించామని సంబుర పడ్డాం. ఈ సమాచారాన్ని క్రీడాశాఖకు కూడా చేరవేశాం. కానీ ఇక్కడకు వచ్చిన తర్వాత ఎవరూ కూడా స్వాగతం పలికేందుకు రాలేదు. దీనిపై సాయ్ అధికారులతో పాటు క్రీడా మంత్రిని సంప్రదించేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది' అని జట్టు ప్రతినిధి కేతన్ షా వాపోయాడు. మొత్తం 46 మంది అథ్లెట్లు పాల్గొన్న డిఫ్లెంపిక్స్‌లో రెజ్లింగ్‌లో విజేందర్ సింగ్(74కి) స్వర్ణ పతకంతో మెరువగా, మన రాష్ట్రానికి చెందిన జఫ్రీన్ షేక్..పృథ్వీశేఖర్‌తో కలిసి టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

మిథాలీకి బీఎండబ్ల్యూ బహూకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ బీఎండబ్ల్యూ కారును అందుకుంది. మంగళవారం గోపీచంద్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో ఈ లగ్జరీ కారును హైదరాబాద్ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన మిథాలీ రాజ్‌ను గోపీచంద్ అభినందించారు.

హైదరాబాద్‌లో ఆసీస్‌తో టీ20

కోల్‌కతా: రానున్న స్వదేశీ సీజన్‌కు గాను బీసీసీఐ పర్యటన, ప్రణాళిక కమిటీ మంగళవారం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. సెప్టెంబర్ ఆఖరు నుంచి డిసెంబర్ వరకు జరుగనున్న సీజన్‌లో టీమ్‌ఇండియా..తొలుత ఆస్ట్రేలియాతో వన్డే, 20 సిరీస్ ఆడనుంది. ఇందులో హైదరాబాద్ వేదికగా రెండు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరుగనుంది. ఆసీస్‌తో సిరీస్ తర్వాత న్యూజిలాండ్, శ్రీలంకతో వరుస సిరీస్‌లు ఉన్నాయి. లంకతో మూడు టెస్ట్‌లకు గాను కోల్‌కతా, నాగ్‌పూర్, ఢిల్లీ వేదికలుగా నిర్ణయించారు.

టైటాన్స్ హ్యాట్రిక్



వరుసగా మూడో ఓటమి
ప్రొ కబడ్డీలో యోధా జట్టు తొలి గెలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు హ్యాట్రిక్ కొట్టింది. అయితే, ఈ హ్యాట్రిక్ విజయాల్లో కాదు.. అపజయాల్లో. తొలిరోజు తొలిమ్యాచ్ నెగ్గిన తెలుగు టైటాన్స్, ఆ తర్వాత వరుసగా విఫలమవుతున్నది. మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 18-31 పాయింట్ల తేడాతో యూపీ యోధా జట్టు చేతిలో చిత్తుగా ఓడింది. టైటాన్స్‌కిది వరుసగా మూడో ఓటమి. మరోవైపు యోధా జట్టుకిది తొలి విజయం కావడం విశేషం. ఆదినుంచే తడబాటుకు గురైన టైటాన్స్ చివరిదాకా అదేతరహాను చూపుతూ నిరాశపరిచింది. డిఫెన్స్, ట్యాకిల్, రైడింగ్..ఇలా అన్ని విభాగాల్లోనూ టైటాన్స్ తేలిపోయింది. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి 7 పాయింట్లు సాధించినా అతనికి సహచరులు తోడ్పాటు అందించలేకపోయారు. డిఫెన్స్‌లో కేవలం 4 పాయింట్లు సాధించడం టైటాన్స్ జట్టును దెబ్బతీసింది. యూపీ యోధా జట్టులో నితిన్ తోమర్ 6, నితేశ్ కుమార్ 5 పాయింట్లు స్కోరు చేసి విజయంలో కీలకపాత్ర పోషించారు.

గుజరాత్ ఫార్చ్యూన్ జైంట్స్ తొలి విజయం

గుజరాత్ ఫార్చ్యూన్ జైంట్స్ జట్టు లీగ్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లోఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్న ఫార్చ్యూన్స్ 26-20తో టోర్నీ ఫేవరెట్ దబాంగ్ ఢిల్లీపై విజయం నమోదుచేసింది. గుజరాత్ జట్టులోని డిఫెండర్ ఫాజెల్ అత్రాచాలి ప్రత్యర్థి జట్టులోని రైడర్స్‌ను దీటుగా నిలువరించడంతోపాటు 4పాయింట్లను సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి గుజరాత్ 15-5 పాయింట్లతో స్పష్టమైన ఆధిక్యాన్ని అందుకోగా ..రెండో అర్ధభాగంలో 15 పాయింట్లు సాధించిన ఢిల్లీ జట్టు కాస్త ప్రతిఘటించింది. కానీ వ్యూహంతో ఆడిన గుజరాత్ జట్టు మాత్రం వారికి గెలిచే అవకాశాన్నివ్వలేదు. గుజరాత్ జట్టు రైడర్ సచిన్ 4 పాయింట్లతో మెరువగా.. ఢిల్లీ జట్టులో ఆర్ శ్రీరాం 5 పాయింట్లు సాధించాడు.

క్యాబ్ అధ్యక్షుడి 'క్యాబ్ ప్రయాణం'



కోల్‌కతా: బీసీసీఐ సాంకేతిక కమిటీ సమావేశం ఓ ఐదు నక్షత్రాల హోటల్‌లో జరుగుతున్నది.. అందరూ విచ్చేశారు... కానీ, కీలక వ్యక్తి జాడ మాత్రం లేదు.. అప్పటికి అరగంట ముగిసింది.. ఈ సమయంలో ఓ ఆశ్చర్యకర సంఘటన.. అందరూ విస్తుపోయేలా.. ఆ కీలక వ్యక్తి ఓ సాదాసీదా ట్యాక్సీ అయిన పసుపుపచ్చ అంబాసిడర్ కారులో హోటల్ ముందు దిగాడు. అంతే అంతా నోరెళ్లబెట్టి చూస్తుండగా, తనకే సాధ్యమైన హుందాతనంతో చిరునవ్వులు చిందిస్తూ సమావేశ మందిరంలోకి చకచకా వెళ్లాడు. అతను మన కోల్‌కతా ప్రిన్స్, బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ. అదేంటీ .. దాదా క్యాబ్‌లో రావడమేంటి అనుకుంటున్నారా. సమావేశానికి తనకు ఇష్టమైన బీఎండబ్ల్యూ కారులో బయలుదేరినా, దారిమధ్యలో అది మొరాయించింది. ఈ విషయాన్ని గంగూలీ డ్రైవర్ చెప్పాడు. దీంతో అక్కడే క్యాబ్‌ను బుక్ చేసుకుని అరగంట ఆలస్యంగా సమావేశానికి గంగూలీ హాజరయ్యాడు. పరిస్థితులు ఎలాంటివైనా, ఏమాత్రం హంగు, ఆర్భాటాలు లేకుండా ఉండడం తనకే సాధ్యమని మరోమారు ఈ మాజీ కెప్టెన్ నిరూపించాడు.

పల్లికల్ జోడీ శుభారంభం

మాంచెస్టర్: డబ్ల్యూఎస్ఎఫ్ ప్రపంచ డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. మహిళల గ్రూప్-బి లీగ్ తొలిమ్యాచ్‌లో భారత్‌కు చెందిన దీపికా పల్లికల్-జోష్న చినప్ప జోడీ 11-4, 11-5తో కొలంబియా జంట పాలెజ్-తోవర్‌పై గెలిచింది. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ జోష్న-విక్రమ్ మల్హోత్రా 11-5, 11-6తో స్కాట్లాండ్ జంటను ఓడించి రెండోరౌండ్ చేరింది.

రాహుల్‌పై నజర్



కొలంబో: వైరల్ జ్వరం కారణంగా శ్రీలంకతో తొలి టెస్ట్‌కు దూరమైన ఓపెనర్ లోకేశ్ రాహుల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టామని టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. జ్వరం నుంచి పూర్తిగా కోలుకున్న రాహుల్..లంకతో రెండు టెస్ట్ సన్నాహకాల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. 'రాహుల్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడు. అతన్ని జాగ్రత్తగా గమనిస్తున్నాం. జ్వరం కారణంగా రెండు, మూడు రోజులపాటు దవాఖానలోనే ఉన్నాడు. దీంతో కొంత నీరసంగా మారిపోయాడు. రోజురోజుకు అతను మెరుగవుతున్నా..ఫిట్‌నెస్‌ను బట్టి తుది జట్టు ఎంపిక ఉంటుంది' అని శాస్త్రి అన్నాడు. మరోవైపు జట్టులో ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొన్నదని, గాయం కారణంగా దూరమైనా..భర్తీ చేసేందుకు రిజర్వ్ ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారని కెప్టెన్ కోహ్లీ అన్నాడు.

జడేజా @ 1

భారత స్టార్ స్పిన్నర్ జడేజా టెస్ట్‌ల్లో నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో జడేజా 897 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. టెస్ట్‌ల్లో నిలకడగా రాణిస్తూ జట్టు విజయాల్లో కీలకమవుతున్న అశ్విన్(849) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. లంక సీనియర్ స్పిన్నర్ రంగనా హెరాత్(828)ను అధిగమిస్తూ అశ్విన్ మూడు నుంచి రెండుకు చేరుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో టీమ్‌ఇండియా నుంచి పుజార(866) నాలుగో ర్యాంక్‌లో ఉండగా, కెప్టెన్ కోహ్లీ(826) ఐదో ర్యాంక్‌లో ఉన్నాడు. శ్రీలంకతో గాలె టెస్ట్‌లో సెంచరీతో విజృంభించిన ధవన్ ఏకంగా 21 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్‌స్మిత్(941) నంబర్‌వన్ ర్యాంక్‌లో దిగ్విజయంగా కొనసాగుతున్నాడు.

రెండో టెస్ట్‌కు తిరిమానే

భారత్‌తో రెండోటెస్ట్‌కు లాహీరు తిరిమానేను లంక జట్టు ఎంపిక చేసింది. తొలి టెస్ట్‌లో గాయపడి సిరీస్‌కు పూర్తిగా దూరమైన గుణరత్నే స్థానంలో తిరిమానేను తీసుకున్నట్లు లంక బోర్డు తెలిపింది. గతేడాది జూన్‌లో చివరి టెస్ట్ ఆడిన తిరిమానే తన కెరీర్‌లో 26 టెస్ట్‌లు ఆడాడు. మరోవైపు న్యూమోనియాతో గాలె టెస్ట్‌కు దూరమైన రెగ్యులర్ కెప్టెన్ దినేశ్ చండీమల్ తిరిగి జట్టులోకొచ్చాడు. సురంగ లక్మల్ వెన్నునొప్పితో రెండో టెస్ట్ నుంచి వైదొలుగగా, లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ లక్షణ్ సందకన్ జట్టుకు ఎంపిక చేశారు.

కాంస్య పతక పోరుకు మనోళ్లు



న్యూఢిల్లీ: ఫిన్లాండ్‌లోని తాంపెరెలో జరుగుతున్న జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు వీర్‌దేవ్ గులియా (74 కిలోలు), రవీందర్ (60 కిలోలు)లు తమ విభాగాల్లో కాంస్య పతక పోరులో నిలిచారు. రవీందర్ సెమీఫైనల్లో 14-16తో స్టీవెన్ మెక్‌కీ (అమెరికా) చేతిలో ఓడాడు. దీంతో కాంస్య పతకం కోసం హిరోము(జపాన్)తో రవీందర్ తలపడనున్నాడు. ఇక వీర్‌దేవ్ క్వార్టర్స్‌బౌట్‌లో ఇసా షపియేవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడాడు. అయితే, షఫియేవ్ స్వర్ణ పతక పోరులో నిలువడంతో వీర్‌దేవ్‌కు కాంస్య పతకపోరులో ఆడే అవకాశం లభించింది.

హిమాలయాల్లో దుర్భిక్షం

- ఎడారిగా మారుతున్న అతిఎత్తైన గ్రామం
- తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్న కోమిక్
- భూతాపం ప్రభావమే కారణం



హిమాలయాల్లోని కోమిక్ గ్రామం

కోమిక్: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రాంతంలో ఉన్న గ్రామం కోమిక్. అరుణాచల్ ప్రదేశ్‌లోని స్పిటీ లోయలో ఈ గ్రామం ఉంది. హిమాలయ పర్వత శ్రేణిలోని ఆ గ్రామానికి వెళ్తే చుట్టూ మంచుకొండలు, శీతల గాలులు, పచ్చికబయళ్లు కనిపిస్తాయేమోనని ఊహించుకుని వెళ్తే నిరాశ ఎదురవడం ఖాయం. ఇప్పుడక్కడ చుక్కనీరు లేక బీడుపడిన భూములు దర్శనమిస్తాయి. పెరుగుతున్న భూతాపం క్రమంగా హిమాలయాలపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో కోమిక్ గ్రామం మెల్ల మెల్లగా ఎడారిగా మారుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో పెరుగుతున్న దుర్భిక్షానికి ప్రమాదకర సంకేతంగా నిలుస్తున్నది కోమిక్.

నేపాల్‌లోని థోతరప్ నుంచి బొలీవియాలోని శాంటా బార్బరా వరకు ఎత్తైన పర్వత ప్రాంతాలు ఎన్నో ఉన్నప్పటికీ కోమిక్ ప్రత్యేకమైనది. ఇండో-టిబెట్ సరిహద్దున 4,587 మీటర్ల ఎత్తున ఉండే ఈ బౌద్ధ ఆవాస గ్రామానికి ప్రపంచంలోనే వాహనాలు వెళ్లగలిగిన అతి ఎత్తైన గ్రామంగా పేరుంది. కేవలం 130మంది మాత్రమే నివసించే ఈ ప్రాంతానికి హిమానీనదాలే ఆధారం. మంచు కారణంగా ఆరునెలలపాటు ఈ గ్రామానికి ప్రపంచంతో రవాణా సంబంధాలు తెగిపోతాయి. స్పిటీ లోయలోని ఇలాంటి గ్రామాలన్నింటిలోనూ బఠానీలు, బార్లీ సాగే ప్రధాన వృత్తి. 'మేం మూరుమూల ప్రాంతంలో ఉన్నందున, మా సంప్రదాయ జీవనశైలే మమ్మల్ని కాపాడుతుంది' అని రైతు నవాంగ్ పున్‌చోక్ చెప్పారు. 'ఇప్పుడు వాతావరణం మారుతున్నది. వర్షాలు తగ్గుతున్నయి. రెండేండ్ల కిందటివరకు హిమాలయాల్లో మంచు కరిగితే మా గ్రామంలో చెరువులు నిండేవి. వాటితోనే వ్యవసాయం ఇతరత్రా అవసరాలు తీరేవి. ఇప్పుడు మంచే కనిపించడం లేదు' అని నవాంగ్ తెలిపారు. చెరువులకు నీరు వచ్చేలా తవ్విన కాలువలు ఇప్పుడు పూర్తిగా ఎండిపోయాయి. 2014లో జేఎన్‌టీయూ నిర్వహించిన అధ్యయనంలో హిమాలయాల ఉష్ణోగ్రత రెండు డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, హిమానీనదాలు 13శాతం తగ్గిపోయాయని తేలింది. 'ఆసియా జలశిఖరాలు'గా పిలిచే హిమాలయాల్లోనే ఇలాంటి దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయంటే భారత్ ముమ్ముందు ఎంతటి ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కోనుందో తెలుస్తుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. సువిశాల నదీనదాలతో పుష్కల జలవనరులున్న దేశాల్లో అగ్రభాగాన ఉండే భారత్‌లో పరిస్థితులు మారుతున్నాయి. వినియోగం కారణంగా పడిపోతున్న భూగర్భజలాలు, పెరుగుతున్న భూ ఉపరితల తాపం పెనుప్రభావాన్ని చూపుతున్నాయని వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ తన తాజా నివేదికలో పేర్కొన్నది.

బ్రీత్ ఎనలైజర్‌లు కచ్చితమైన ఫలితాన్ని ఇవ్వలేవు

ఢిల్లీ అడిషనల్ సెషన్సు కోర్టు



న్యూఢిల్లీ: బ్రీత్ ఎనలైజర్‌తో పాటు ఎల్రక్టానిక్ పరికరాలేవీ వందశాతం కచ్చితమైన ఫలితాలను ఇవ్వలేవని, తప్పుడు ఫలితాలు రావడం సహజమని ఢిల్లీకి చెందిన అడిషనల్ సెషన్సుకోర్టు అభిప్రాయపడింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 31ఏళ్ల వివేక్‌కుమార్ పట్టుబడగా అతడికి మోటార్ వెహికల్ చట్టం కింద మెజిస్ట్రేట్ కోర్టు జూన్ 3, 2017న రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించిన వివేక్.. శిక్షపై పునర్విచారణ జరిపించాలని, తన కుటుంబం తనపైనే ఆధారపడి ఉందని కోర్టును అభ్యర్థించారు. దీనిపై విచారణ చేపట్టిన అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి లోకేశ్‌శర్మ స్పందిస్తూ 'వివేక్ కేసులో సెషన్సుకోర్టు బ్రీత్ ఎనలైజర్ ఆమోదిక సంబంధించిన నివేదికను పట్టించుకోలేదు. ఎల్రక్టానిక్ పరికరాల ఫలితాల్లో లోపాలు ఉంటాయి. అందుకు బ్రీత్ ఎనలైజర్ మినహాయింపు కాదు. ఇది వందశాతం కచ్చితమైన ఫలితాన్ని ఇవ్వగలదని ఏ తయారీ సంస్థ ఇప్పటివరకు ప్రకటించలేదు. వివేక్ రక్త నమూనాను పరీక్షిస్తే అతను 68.8మి.గ్రా/100మి.లీ ఆల్కహాల్ మాత్రమే తీసుకున్నట్లు స్పష్టమైంది. ఇతర కేసులను పరిశీలిస్తే నిబంధనలను ఉల్లంఘించేవారు 300మి.గ్రా నుంచి 500మి.గ్రా/100మి.లీ ఆల్కహాల్ తీసుకుంటున్నారు. అతడికి సెషన్సుకోర్టు విధించిన రెండురోజుల జైలుశిక్షను కఠినమైనది' అని జస్టిస్ లోకేశ్‌శర్మ పేర్కొన్నారు.

దిగ్విజయ్‌సింగ్ ఔట్!

- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగింపు
- ఆర్‌సీ కుంతియాకు బాధ్యతలు



దిగ్విజయ్‌సింగ్, ఆర్‌సీ కుంతియా

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా దిగ్విజయ్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఉద్వాసన పలికారు. ఆయన స్థానే ఆర్‌సీ కుంతియాకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఏఐసీసీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా దిగ్విజయ్‌సింగ్‌పై నాలుగేండ్లుగా పలు ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదులు కూడా అందాయి. కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో సమర్థంగా వ్యవహరించడంలో విఫలమైన దిగ్విజయ్‌ను ఆ రెండు రాష్ట్రాల బాధ్యతల నుంచి ఇప్పటికే తప్పించిన కాంగ్రెస్ అధినాయకత్వం.. తాజాగా తెలంగాణ బాధ్యతల నుంచి తొలిగించింది. సంస్థాగతంగా పార్టీని చక్కదిద్దే పనిని పక్కనబెట్టిన దిగ్విజయ్.. తెలంగాణ సర్కార్, పోలీసుశాఖ, డ్రగ్స్ కేసులపై వివాదాస్పద వ్యాఖ్యలతో విమర్శల పాలయ్యారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో దిగ్విజయ్ విఫలమయ్యారని అప్పట్లోనే విమర్శలొచ్చాయి. తెలంగాణలో బలమైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీని తీర్చిదిద్దడంలో విఫలం కావడంతోపాటు పార్టీలో గ్రూపుల మధ్య ఘర్షణ నివారించి ఐక్యత సాధించలేకపోవడం వంటి కారణాలతో ఆయనకు ఉద్వాసన పలికి ఉంటారని భావిస్తున్నారు. దీనికి తోడు టీఆర్‌ఎస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో ప్రజాదరణ పొందడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డ కాంగ్రెస్ పార్టీ.. ప్రజలకు దగ్గర కాలేకపోయింది. రైతులకు అవసరమైన సాగునీటి సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా అడ్డుపుల్లలు వేయడం, కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేయడం వల్ల కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజాగ్రహానికి గురైందన్న విమర్శలు ఉన్నాయి.

2350 కోట్ల వరద సాయం

- ఈశాన్య రాష్ట్రాలకు కేంద్రం చేయూత
- గువాహటిలో ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితులపై ప్రధాని మోదీ సమీక్ష



గువాహటిలో అసోం సీఎం సర్బానందతో ప్రధాని మోదీ

గువాహటి, ఆగస్టు 1:

వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఐదు ఈశాన్య రాష్ట్రాలకు ప్రధాని నరేంద్రమోదీ రూ.2350 కోట్ల తక్షణ ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళవారం అసోం రాజధాని గువాహటికి చేరుకున్న ప్రధాని మోదీ.. ఉదయం 10 గంటల నుంచి ఆ రాష్ట్రాల్లో వరదల పరిస్థితిపై సమీక్షించారు. వరదలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న అసోం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరం, నాగాలాండ్ రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆయా రాష్ట్రాల సీఎంలతో విస్తృత స్థాయిలో సమీక్షించారు. సమావేశం తర్వాత అసోం ఆర్థికశాఖ మంత్రి హిమంత బిశ్వశర్మ మీడియాతో మాట్లాడారు. అసోంలో వరద సహాయం, పునరావాస పనుల కోసం అదనంగా రూ.250 కోట్ల నిధులు విడుదల చేస్తామని ప్రధాని ప్రకటించారన్నారు. ఇంతకుముందే అసోంలో వరద సహాయ చర్యల కోసం రూ.300 కోట్లు కేటాయించారని శర్మ గుర్తుచేశారు. అసోంలో బ్రహ్మపుత్ర నది నుంచి వచ్చే వరదల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సి ఉన్నదని ప్రధాని నొక్కి చెప్పారన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ కేటాయిస్తారని శర్మ తెలిపారు. అలాగే ఈశాన్య రాష్ట్రాల్లో వరదల సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజినీర్లు సభ్యులుగా ఉంటారు. ఇది దీర్ఘకాలిక ప్రాజెక్టు అని శర్మ వివరించారు. వరదలు తగ్గుముఖం పట్టడంతో ప్రధాని నరేంద్రమోదీ ఆయా ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరుపలేదు. దీనిపై అధికార బీజేపీని విపక్షాలు విమర్శించాయి. ఈ సమావేశంలో ఈశాన్య రాష్ట్రాల సీఎంలు, కేంద్రమంత్రి ఇందర్‌జిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వరదలతో పోటెత్తిన యూపీ నదులు

స్వల్పం నుంచి మోస్తరు ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన నదులు గంగా, శార్దా, రాప్తి వరదలతో ఉప్పొంగుతున్నాయి. మొహమదాబాద్, బిజ్నోర్‌లలో ఆరు సెం.మీ, వారణాసి, బరేలీల్లో ఐదు సెం.మీ, చునార్, సహస్వాన్, బాఘ్‌పేట్, అత్రౌలిలలో నాలుగు సెం.మీ చొప్పున, ఖైయాంగజ్, నజీబాబాద్, నరోరా, హమీర్‌పూర్‌ల్లో మూడు సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. అలహాబాద్ – వారణాసి మధ్య వరద ఉధృతి పెరుగుతున్న గంగానదీ.. ఫతేగఢ్ వద్ద ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నది. శార్దా నదీ ప్రవాహం పాలియా కలాన్ వద్ద ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండగా, శార్దానగర్ వద్ద ప్రమాద సంకేతానికి సమీపంలో ఉన్నది. ఎల్గిన వంతెన వద్ద రెడ్ మార్క్ దాటిన ఘాఘ్రా నదీ ప్రవాహం అయోధ్య, తుర్తిపర్‌ల్లో, బల్‌రామ్‌పూర్‌లో రాప్తీ నది ప్రమాదస్థాయికి చేరువలో ఉన్నదని కేంద్ర జల సంఘం అధికారులు తెలిపారు.

గైర్హాజరు ఎంపీలపై అమిత్ షా ఆగ్రహం

పునరావృతం కావొద్దని హెచ్చరిక



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: కీలక రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు రాజ్యసభకు గైర్హాజరైన ఎంపీలపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా భావించిన బీసీ కమిషన్ బిల్లుపై సోమవారం చర్చ జరుగుతున్నప్పుడు ఐదుగురు మంత్రులతోపాటు 30 మంది బీజేపీ ఎంపీలు గైర్హాజరయ్యారు. గత వారం కూడా సభ్యుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో మినహా సభ్యులు సమావేశాలు జరిగినన్ని రోజులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వారం తిరుగక ముందే బీజేపీ ఎంపీలు ప్రధాని ఆదేశాలను బేఖాతర్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తన అధ్యక్షతన జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాజ్యసభకు గైర్హాజరైన సభ్యులపై షా ఆరా తీశారు. గైర్హాజరైన మంత్రులు, ఎంపీలు లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వారితో విడిగా సమావేశమవుతానని చెప్పారు. సోమవారం బీసీ కమిషన్ బిల్లుపై చర్చ సమయంలో బీజేపీ, దాని మిత్రపక్షాల సభ్యులు సభలో లేకపోవడంతో కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు ప్రతిపాదించిన సవరణలకు ఆమోదం లభించింది. ఇది కేంద్ర వైఫల్యమేనని, బీసీ కమిషన్‌పై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని రుజువైందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

ప్రభుత్వంలో చేరను: అమిత్ షా

రాజ్యసభకు ఎన్నికైనా తాను కేంద్ర క్యాబినెట్‌లో చేరబోనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. పార్టీ వ్యవహారాలతో తాను సంతృప్తిగానే ఉన్నానని మంగళవారం మీడియాతో అన్నారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, క్యాబినెట్‌లో చేరతానని వచ్చిన వార్తలను కొట్టిపారేశారు. 2019లోనూ తామే అధికారంలోకి వస్తామని, మరింత బలమైన శక్తిగా అవతరిస్తామని దీమా వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత వివాద రరహిత, ప్రజాదరణ గల నేతగా ప్రధాని మోదీ ఖ్యాతి గడించారని చెప్పారు.

చైనాపై కన్నేస్తే సహించం

- ఎలాంటి దాడులైనా తిప్పికొడుతాం
- పీఎల్‌ఏ వార్షికోత్సవంలో జిన్‌పింగ్ హెచ్చరిక



బీజింగ్, ఆగస్టు 1: దేశ భద్రతకు, సార్వభౌమత్వానికి, అభివృద్ధి ప్రయోజనాలకు సవాళ్లు ఎదురైతే చైనా సహించదని ఆ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. చైనా పీపుల్స్ ఆర్మీ(పీఎల్‌ఏ)90వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం బీజింగ్‌లోని గ్రేట్‌హాల్ ఆఫ్ పీపుల్‌లో భారీ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ పై హెచ్చరికలు చేశారు. 'చైనా ప్రజలు శాంతికాముకులు. దురాక్రమణను, విస్తరణను మేం కోరుకోం. అయితే చైనా భూభాగాన్ని ఎవరైనా చీల్చాలనుకుంటే మాత్రం ఊరుకోం. అది వ్యక్తులైనా సంస్థలైనా, రాజకీయ పార్టీ అయినా కావచ్చు.. మాపై ఎలాంటి దాడులకు దిగినా ఓడిస్తాం' అని అన్నారు. సిక్కిం ప్రాంతంలోని డోక్లాం సరిహద్దు సమస్యపై భారత్-చైనాల మధ్య ప్రతిష్టంభన నెలకొన్న సందర్భంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. చైనా సైన్యం సత్తా గురించి జిన్‌పింగ్ ప్రస్తావించడం గత మూడు రోజుల్లో ఇది రెండోసారి. 'దేశంపై దాడులకు దిగే శత్రువులను ఓడించే సామర్థ్యం, విశ్వాసం పీఎల్‌ఏకున్నాయి'అని జూలై 30న పీఎల్‌ఏ పరేడ్‌లో ఆయన చెప్పారు. అయితే ఈ రెండు ప్రసంగాల్లోనూ ఆయన డోక్లాం విషయాన్ని నేరుగా ప్రస్తావించలేదు. గత నెలలో బ్రిక్స్ దేశాల సమావేశాల సందర్భంగా భారత జాతీయ భద్రతాసలహాదారు అజిత్ దోవల్, చైనా భద్రతా సలహాదారు యాంగ్ జీచీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే ఈ భేటీలో వారు ఏం మాట్లాడారన్న వివరాలను రెండు దేశాలు వెల్లడించలేదు. దేశాధ్యక్ష పదవితోపాటు చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, చైనా కేంద్ర సైనిక సంఘం చైర్మన్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న జిన్‌పింగ్ తన ప్రసంగంలో..ఒకనాడు ఆవగింజంత ఉన్న పీఎల్‌ఏ నేడు పూర్తిస్థాయి మహా సైన్యంగా ఎదిగిందని చెప్పారు. సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు యువతరం సంకల్పసిద్ధులై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నాంచాంగ్ తిరుగుబాటు సందర్భంగా 1927లో ఆగస్టు ఒకటిన పీఎల్‌ఏను స్థాపించారు.

భారత్‌కు పాశ్చాత్య మీడియా అనుకూలం: చైనా

న్యూఢిల్లీ: భారత్‌కు పాశ్చాత్య మీడియా అనుకూలంగా ఉందని చైనా అభిప్రాయపడింది. డోక్లాంపై ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న తరుణంలో చైనా మీడియా ఈ విధంగా వ్యాఖ్యానించింది. పాశ్చాత్య దేశాలు భారత్‌కు మద్దతు ఇవ్వడానికి ప్రధాన కారణం ఇండియా ప్రజాస్వామ్య దేశం కావటమేనని పేర్కొన్నది. చైనాతో పోల్చుకుంటే భారతదేశం బలహీనమని, అందుకే ఇతరదేశాలు సానుభూతి తెలుపుతున్నాయని చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ చట్టానికి విరుద్ధంగా చైనా భూభాగంలోకి భారత్ చొరబడి హింసను ప్రేరేపిస్తున్నదని చైనా ఆరోపించింది.

గూర్ఖాలాండ్ ఉద్యమంపై నేడు కీలక నిర్ణయం!


ఢిల్లీలో సమావేశం కానున్న ఉద్యమ సమన్వయ కమిటీ

డార్జిలింగ్: గూర్ఖాలాండ్ ఉద్యమంపై నేడు కీలక నిర్ణయం జరుగనున్నది. గూర్ఖాలాండ్ ఉద్యమ సమన్వయ కమిటీ (జీఎంసీసీ) సమావేశం బుధవారం ఢిల్లీలో జరుగనున్నది. ఈ నేపథ్యంలో సమావేశం తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు లక్ష్యంతో జీజేఎం సహా డార్జిలింగ్ పర్వత ప్రాంతంలో ఉన్న అన్ని పార్టీలు 30 మంది సభ్యులతో జీఎంసీ కమిటీని ఏర్పాటు చేశాయి. కాగా డార్జిలింగ్ పర్వత ప్రాంతంలో 47 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక బంద్ విరమించే అంశంపై తుది నిర్ణయం తమదేనని గుర్ఖా జనముక్తి మోర్చా (జీజేఎం) అధ్యక్షుడు బిమల్ గురుంగ్ మంగళవారం స్పష్టం చేశారు. బంద్ విషయంలో జీఎంసీసీ పాత్ర ఏమీ లేదని, బంద్ పిలుపు ఇచ్చింది తామేనని, దాన్ని విరమించుకునే అంశంపై నిర్ణయం కూడా తమదేనని చెప్పారు. సమావేశానికి ముందు గురుంగ్ చేసిన వ్యాఖ్యల ద్వారా జీఎంసీసీలో చీలిక వచ్చినట్లు స్పష్టమవుతున్నది. కాగా జీజేఎం కార్యకర్తల పట్ల పోలీసుల తీరును గురుంగ్ తప్పుబట్టారు. తాము శాంతియుతంగా ఉద్యమాన్ని కొనసాగిస్తుంటే పశ్చిమబెంగాల్ ప్రభుత్వం దాన్ని క్రూరంగా అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. తమకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని పేర్కొనడాన్ని ఖండించారు. కాగా జీఎంసీసీ సమావేశం తర్వాత సభ్యులు తీర్మానం పత్రాలను కేంద్ర హోంమంత్రికి అందజేయనున్నారు. గూర్ఖాలాండ్ ప్రత్యేక రాష్ట్రం విషయంలో కేంద్ర జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరనున్నారు.

వ్యక్తిగత సమాచార పరిరక్షణ

మార్గదర్శకాలు అతిక్రమించొద్దు

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, ఆగస్టు 1: వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించాలన్న మార్గదర్శకాలను అతిక్రమించొద్దని, ప్రభుత్వానికి సమర్పించిన సమాచారాన్ని నిర్దేశిత ప్రయోజనాల కోసమే వినియోగించాలని సుప్రీంకోర్టు తెలిపింది. వ్యక్తిగత గోప్యతా హక్కు ప్రాథమిక హక్కు అవునా? కాదా? అన్న అంశంపై చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ సారథ్యంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. గుజరాత్ ప్రభుత్వ న్యాయవాది వాదనను తిరస్కరించింది. ధర్మాసనంలో జస్టిస్ జే చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బోబ్డె, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ ఏఎం సప్రే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నాజీర్ సభ్యులుగా ఉన్నారు. ఈ అంశాన్ని విడివిడిగా చూడాలన్న గుజరాత్ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. వ్యక్తిగత సమాచారం ఒక ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ భారత్ 1948 అంతర్జాతీయ సదస్సు తీర్మానంపై సంతకం చేసిందని న్యాయస్థానం గుర్తుచేసింది. మహారాష్ట్ర ప్రభుత్వ వాదనను ప్రస్తావించిన సుప్రీం 'ఒకవేళ రాజ్యాంగ అసెంబ్లీ నిర్ణయాన్ని మనం ఆమోదిస్తే వ్యక్తిగత సమాచారం ప్రాథమిక హక్కు కాదని నిర్ణయించాలి. అప్పుడు మానవ హక్కులపై అంతర్జాతీయ సదస్సు సభ్య దేశంగా ఎలా వ్యవహరించాలి? అన్న సంశయం ముందుకు వస్తుంది' అని పేర్కొన్నది. 'ఒకవేళ నేను నా పేరు, తల్లిదండ్రుల పేర్లు, టెలిఫోన్ నంబర్లను నిర్దిష్ట అవసరాలకు ఇస్తే, దాన్ని ఉల్లంఘన కింద ఎలా పరిగణించాలి' అని ప్రశ్నించింది. భారీ స్థాయిలో ప్రజల వివరాలు బహిర్గతమైనప్పుడు విడివిడిగా నిజానిజాలను నిర్ధారించలేమని, అటువంటప్పుడు నియంత్రణ మార్గదర్శకాలను అతిక్రమించేందుకు అనుమతించాలా? అని ప్రశ్నించింది.

త్వరలో మరో నావిగేషన్ ఉపగ్రహం

ఏర్పాట్లు చేస్తున్న ఇస్రో

బెంగళూరు, ఆగస్టు 1: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో నావిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. నెలాఖరులోగా ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్‌గా పిలిచే ఈ ఉపగ్రహాన్ని పీఎస్‌ఎల్‌వీ-సీ39 రాకెట్ ద్వారా ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్) అనేది భారత్ సొంతంగా రూపొందించుకున్న నావిగేషన్ వ్యవస్థ. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు దీనికి 'నావిక్'(ఎన్‌ఏవీఐసీ) అని పేరుకూడా పెట్టారు. ఈ శ్రేణిలో ప్రయోగించిన ఏడు నావిగేషన్ ఉపగ్రహాలు ప్రస్తుతం మార్గనిర్దేశక సేవలందిస్తున్నాయి. వీటిలో ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1ఏలో ఇటీవల సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. అందులోని కీలకమైన మూడు అణుగడియారాలు పనిచేయడంలేదు. ఆ ఉపగ్రహానికి బ్యాకప్‌గా 'ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్'ను పంపనున్నారు.

మాస్కో కోర్టులో కాల్పుల మోత

ముగ్గురు నిందితులు మృతి



కాల్పుల్లో గాయపడిన వ్యక్తిని దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

మాస్కో, ఆగస్టు 1: రష్యా రాజధాని మాస్కో ప్రాంతీయ కోర్టులో మంగళవారం కాల్పుల మోత మోగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. ఓ కేసు విచారణలో భాగంగా కొందరు నిందితులను పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. అయితే నిందితులు పోలీసుల వద్ద ఉన్న తుపాకులను లాక్కొని కాల్పులు జరిపి పారిపోవాలని పథకం పన్నారు. వెంటనే పోలీసులపై దాడి చేసి వారి వద్ద ఉన్న తుపాకులను లాక్కోవడానికి విశ్వప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పెనుగులాట జరిగి కాల్పుల మోత మోగింది. దీంతో ముగ్గురు నిందితులు మృతిచెందారు. ఇద్దరు పోలీసులు, ఇద్దరు పౌరులు గాయపడ్డారు. ఘటనపై కోర్టు ప్రాంగణంలో ఉన్న వ్యక్తులు మాట్లాడుతూ, కాల్పుల శబ్దంతో ఆ ప్రాంతం మార్మోగిందని చెప్పారు. దాదాపు 20సార్లు కాల్పుల శబ్దాన్ని విన్నామని, వెంటనే కోర్టు ప్రాంగణం నుంచి పరుగులు తీశామని పేర్కొన్నారు.

సొహ్రాబుద్దీన్ కేసు నుంచి వంజరకు విముక్తి

ముంబై ఆగస్టు 1: వివాదాస్పద సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో గుజరాత్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి డీజీ వంజరకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం విముక్తిని ప్రసాదించింది. రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన మరో ఐపీఎస్ ఎంఎన్ దినేశ్ పైనా అభియోగాలను కోర్టు కొట్టివేసింది. బీజేపీ చీఫ్ అమిత్‌షాను ఇదే తరహాలో 2014లో ఈ కేసునుంచి తప్పించిన న్యాయస్థానం రెండున్నరేండ్ల తర్వాత ఇద్దరు ఐపీఎస్ అధికారులకు విముక్తి కల్పించింది. కోర్టు నిర్ణయాన్ని స్వాగతించిన వంజర 'న్యాయవ్యవస్థ నాకు సరైన న్యాయం అందించింది' అని అన్నారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

20 మందికి పైగా మృతి

హీరాత్, ఆగస్టు 1: ఆఫ్ఘనిస్థాన్‌లో హీరత్ నగరంలోని జావాద్య ప్రాంతంలోని షియా ముస్లింల మసీదుపై ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు, మరో సాయుధుడు జరిపిన దాడిలో 20 మందికి పైగా మరణించారు. 30 మందికి పైగా గాయపడ్డారు. దాడి జరిగిన ప్రాంతం ఇరాన్ సరిహద్దుల్లో ఉన్నది. మంగళవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో దాడి జరిగిందని హీరాత్ పోలీసు అధికార ప్రతినిధి అబ్దుల్ అహద్ వాలిజాదా తెలిపారు. తొలుత ఆత్మాహుతి దళ సభ్యుడు మాత్రమే దాడి చేశాడని భావించామని, కానీ ఆత్మాహుతి దళ సభ్యుడు తనను తాను పేల్చివేసుకోగా, అతడితోపాటు వచ్చిన సాయుధుడు కూడా దాడి ఘటనలో మరణించాడని తెలిపారు. కాబూల్‌లోని ఇరాక్ రాయబార కార్యాలయంపై ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) దాడి చేసిన మరుసటి రోజే మరో దాడి జరుగడం ఆఫ్ఘన్లో దిగజారుతున్న పరిస్థితిని తెలియజేస్తున్నది. ఈ ఘటనలో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నది. ఈ దాడికి తమదే బాధ్యత అని ఏ సంస్థ కూడా ప్రకటించలేదు.